హనుమంతరావు, కామరాజు.

దేశిరాజు పెదబాపయ్య గారి జీవనస్మృతి

రాజమహేంద్రవరము, 1928.

Record no.88

Hanumantarāvu, Kāmarāju.

Dēśirāju Pedabāpayya gāri jīvanasmṛti

Rājamahēndravaramu, 1928.

Record no.88

Bibliographic Record Target

హనుమంతరావు, కామరాజు.

దేశిరాజు పెదబాపయ్య గారి జీవనస్మృతి / కామరాజు హనుమంతరావు.- 1. కూర్పు .- రాజమహేంద్రవరము : సరస్వతి పపర్ ప్రెస్, 1928.

vii, (1), 231 p. :port. ;17cm.

Record no.88

Hanumantarāvu, Kāmarāju.

Dēśirāju Pedabāpayya gāri jīvanasmṛti / Kāmarāju Hanumantarāvu.- 1. kūrpu .- Rājamahēndravaramu : Sarasvati papar pres, 1928.

vii, (1), 231 p. :port. ;17cm.

Record no.88

బాపయ్యగారు

చరిత్ర

...ంతరావు

ఓమ్

ధరణి నాదినుండి ధర్మయోధు లగుచు,
జన్మభూమికొరకు, జగముకొరకు,
నాత్మశక్తులెల్ల నర్పించి ధన్యు లై
నట్టి ఘనుల కిద్ది యంకితంబు.

దేశిరాజు పెదబాపయ్యగారి

జీవనస్మృతి

కర్త

కామరాజు హనుమంతరావు

రాజమహేంద్రవరము

1928

వెల రు 1-0-0.

మొదటికూర్పు

శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామినాయఁడుగారి
సరస్వతీ పవర్ ప్రెస్‌నందు ముద్రితము.

విషయసూచిక

విజ్ఞప్తి

దేశిరాజు పెదబాపయ్యగారి చరిత్రను సమర్థు లయిన వా రెవరయిన రచియింపవలయు నని వారు పరలోకగతు లయినప్పటినుండియు నభిలషించు చుంటిని. ఇప్పటికి వారు మృతి జెంది యిరువది సంవత్సరము లయినది. వారినిగురించి యెరిగిన విషయములు చెప్పగల మిత్రులు కూడ గతించి పోవుచున్నారు. వారి చరిత్ర వ్రాయుట కన్యు లెవరును పూనుకొన కున్నారు.

వారి జీవనవృత్తాంతము నా కెక్కువ తెలియుట కవకాశము కలిగినది. నా అక్కగారు బాపయ్యగారి సవతితల్లి. మే మిరువురము శైశవమున మాతృహీనుల మై ఆమెవద్ద పెరిగితిమి. వారు నాకంటె నాలుగు సంవత్సరములు మాత్రము పెద్ద. వారు జీవించి యున్నంత కాలము వారి సహచరుడనయి మిక్కిలి చనువుతో మెలగితిని. వారి జీవిత ముత్తమమయిన దని కనుగొంటిని. అది గ్రంథరూపమున ప్రకటింపబడిన, వారి నెరుగని తోడి దేశీయులకు గూడ నుపయోగపడగల దని నమ్మితిని. కావున నేనే ఆ పనికి సాహసించి యీశ్వరకృపవలన దానిని చేతనయిన రీతిని కొనసాగింప కలిగితిని. నా యసమర్థతవలన గ్రంథరచనయందు అనేక లోపములు చేసియుందును. పాఠకులు వానిని మన్నింప ప్రార్థితులు. సవరణ లేవయిన వారు దయతో తెలిపిన, వానిని రెండవ కూర్పునందు చేసికొందును. క్రొత్త విషయములు తెలుపబడిన, అవియు నందు జేర్చెదను.

దినచర్యపుస్తకములను ఉత్తరములను ఇచ్చియు, సంగతులను తెలిపియు, ధనసాహాయ్యము చేసియు, ఇంక నితర విధముల సాయపడియు, ఈ పుస్తకప్రచురణమునందు నాకు తోడ్పడిన బంధుమిత్రు లెల్లరకు కృతజ్ఞుడను. బాపయ్యగారు వ్రాసిన వని యిందు తెనుగున పొందుపరుపబడిన వన్నియు ఆంగ్లమునకు భాషాంతరీకరణములు. వానిలో నచటచట బ్రాకెట్లలో చేర్పబడిన మాటలును, కొన్ని మాటలక్రింద గీయబడిన గీతలును నావి.

అచ్చుపని స్వల్పకాలములో జరుప వలసి వచ్చినను, ముద్రణాసౌకర్యములను కలిగించి పుస్తకము సకాలమునకు వెలువడు నట్లు జేసిన సరస్వతీ ముద్రాక్షరశాలాధికారులు అద్దేపల్లి లక్ష్మణస్వామి నాయుడుగారికి నా వందనములు.

☞ పుస్తకము చివర నున్న తప్పొప్పుల పట్టికను చదువరులు ముందుగా చూడ ప్రార్థితులు.

స్మృతి గీతము

చిన్న నాటనుండియు నీదు చెలిమి గలిగి,
నిన్నె నా మార్గదర్శిగ నెన్ను కొనగ,
తరలి దివికి, నాత్మకు ధ్రువతార వైతి,
బాపయాఖ్య! సంస్మృతియె నా భాగ్య మయ్యె.

కనుల యెదుట నీ నగుమోము కదలు చుండు,
చెవుల లోన నీ మృదుభాష చెలగు చుండు,
మనమునందు నీ గుణరాజి మసలు చుండు,
నీదు స్మృతి లేక గడచునె? నిమిష మైన.

బంధువులలోన నుత్తమ బంధు వైన,
సహచరులలోన ప్రియతమ సఖుడ వైన,
గురువులందున నుత్కృష్టగురుడ వైన,
నిన్ను స్మరియించి ధన్యుగా నెమ్మి దలతు.

మిన్నగ నిను నాకంటె, ప్రేమించు వారు,
ధర్మదర్శకునిగ మది దలచు వారు,
అనుకరించి సద్వర్తను లయిన వారు,
భక్తి తమ స్మృతు లిం దైక్య పరచి నారు.

మమ్ము నెల్లర, నిను సదా మరువ కుండ,
విశ్వమాతను నిరతము వీడ కుండ,
విమలవర్తన మెప్పుడు విడువ కుండ,
జేయు నీ స్మృతి యభివృద్ధి జెందు గాక!



D. P. Bapaiya
1st. May 1907.

దేశిరాజు పెదబాపయ్యగారి

జీవనస్మృతి

జీవనస్మృతి

౧ వ ప్రకరణము

సూచన

"ఒక పర్యాయం 'నిను సేవింపని పుట్టువ దేటికి?' అనే కీర్తన పాడ్తారా? సీతారామయ్యగారూ!' అని బాపయ్యగారు మంచముమీద పరుండియె అడిగి కరములు జోడించి నిమీలితనేత్రు లయిరి. సీతారామయ్యగారు మృదు మధురస్వరముతో భక్తిరస మొలుక ఈక్రింది కీర్తన పాడిరి.

'నిను సేవింపని పుట్టువ దేటికి? నిఖిలజగదధీశా! ఈశా!
నీ నిర్మితి జూడని కను లేమిటికి? నిష్ఫలములు ధరలోను.

౧. నిను జింతింపని చింత యేమిటికి? నీరము లేని కొల లేమిటికి? నిను బాడని యా కృతు లేమిటికి? నెనరు లేని యా మగతన మేటికి?

౨. నిను గురింపని ముచ్చట లేటికి? నీచులతోడను స్నేహము లేటికి? పని లేకుండెడి బ్రతు కేమిటికి? భక్తి లేని ధ్యానం బేమిటికి?

౩. ప్రత్యుపకారము చేయమి యేటికి? ప్రాణిహింసయు

జేయుట యేటికి? మెతుకులకొర కిచ్చక యేటికి? మిత్తి నిత్యమని తెలియమి యేటికి?

౪. సర్వకర్తను దెలియమి యేటికి? చంచలమతులను గూడుట యేటికి? గర్వము విడువక యుండుట యేటికి? కడకను నిత్యుని గూడమి యేటికి?

మంచముప్రక్క సీతారామయ్యగారును నేనును నిలువబడి బాపయ్యగారి ముఖారవిందమును దర్శించుచుంటిమి. కీర్తన ముగిసిన పిమ్మట కొన్ని నిమిషములవరకు గూడ కన్నులు మూయబడియె యుండెను. నోటినుండి యెట్టి మాటలు వెడలుట లేదు. కాని వదనము అంతకంతకు అద్దమువలె నిర్మలమును తేజోవంతము నయి అంతరభావముల వ్యక్తపరచుచుండెను.

సమయము ప్రభాతము. భాను డప్పుడప్పుడె ఉదయించుచుండెను. నీరెండ నలుదిశల నావరించి హృదయాంతరాళమందలి యంధకారమును సయితము పారద్రోలుచుండెను. వికసించిన కుసుమములు సుగంధము వెదజల్లుచు పరమపురుషుని సాన్నిధ్యము స్మరణకు దెచ్చుచుండెను. పక్షుల కిలకిలారవము లుద్బోధనగీతము లయి వీనులకు విందు గొల్పుచు ఈశ్వరధ్యానము పురిగొల్పుచుండెను.

స్థలము చెన్నపురి జనరల్ హాస్పిటల్. బహువిధవ్యాధి

పీడితులకు శరణ్యమయి ఔషధశస్త్రచికిత్సాదక్షులగు వైద్యశిఖామణులకు నిలయమయి ఆర్తజనబాంధవు డగు సర్వేశ్వరుని యాలయముగ సువిదిత మగుచుండెను. సుందరదృశ్యములు గన్నులకు పండువ సేయు నప్పుడును, సంతోషసల్లాపముల నోలలాడు నప్పుడును, సకలైశ్వర్యములతో తులతూగు నప్పుడును, జగన్మాతను దర్శించు భాగ్యము ఏ కొలది మందికో లభ్యమగును గాని భయంకరవిపత్సమయములందు ప్రేమస్వరూపిణి యగు పరమమాతయె సమస్తోపచారములు చేయుచు ధైర్యోత్సాహముల నొసంగి మరణబాధనయినను మరపించు తరుణమునందు మాత్రము ఎవ రామె చల్లని కరుణాహస్తమును స్పర్శింపకుందురు? హాస్పిటలులోని సేవకులెల్లరిద్వారా పవిత్రప్రేమ ప్రత్యక్షమగుచు తాండవమాడుచుండెను.

కీర్తన పాడిన పిళ్ళారిశెట్టి సీతారామయ్యగారు హరికథలు వీలు కలిగి నపుడెల్ల జెప్పుచు తోడిమానవులయందు దైవభక్తి రవులుకొల్పుచుండిన భక్తాగ్రేసరులు. మానవసేవయె నిరంతరవ్రతముగా గలిగి శోకసాగరనిమగ్నులగు బాలవితంతువులకొరకును, తిన తిండియు కట్ట గుడ్డయు లేక నానాబాధలు పడెడు దిక్కులేని బిడ్డలకొరకును, కష్టసమయములం దసహాయులై యుండిన తమ పరిచితులెల్లరికొరకును,

ఓపికకొలది పాటుపడుచుండిన సేవాధురీణులు. బాపయ్యగారు చాల జబ్బుచేసి చెన్నపురి జనరల్ హాస్పిటలుకు వచ్చిన తరువాత వారి యవసానసమయము సమీపించిన దను దుఃఖకరవార్త తంతిద్వారా బాపట్లలోనున్న వారి బంధువులకు వచ్చినదని వినగానె వారిని దర్శించుట కేతెంచిన పరమమిత్రులు. ‘నాకు తంతివార్త పంపించ లేదేమండి?’ యని తాము ప్రశ్నింప, ‘కబు రేలా తెలిసినా, మీరు తప్పక వస్తారని నా గట్టినమ్మకం. మీకు తంతివార్త పంపడ మనవసర మనియె మానితి’ నని బాపయ్యగారు బదులుచెప్పగా అట్టిప్రశంసకు పాత్రు లయినందులకు సంతుష్టహృదయు లయి వారి యంత్యదినములలో సేవచేయుచు వారిదగ్గిర నుండిన పుణ్యపురుషులు. సీతారామయ్యగారు పాడిన కీర్తన పెదవులనుండి గాక హృదయమునుండి వెలువడి సమయోచిత మయి ప్రాణముల నుజ్జీవింపజేసెను.

బాపయ్యగారు తాము పరుండిన మంచము ధర్మవేదికగను వైద్యశాల ఉపాసనామందిరముగను గలిగి నాటి యుదయమున సీతారామయ్యగారు కీర్తన పాడిన పిమ్మట మౌనరూపమున గావించిన యుపాసన అత్యద్భుతముగ నుండెను. వారు అదివరకు వాగ్రూపమున జేసిన యుపాసనలన్నిటికంటె నది యెక్కుడు ప్రబోధము కలిగించెను. త్రిక

రణశుద్ధి గలవారు కొలది మాటలమూలమున గాని లేక అవియు నక్కరలేకయె కేవల మౌనమువలన గాని అమితోత్సాహకర మగు ఈశ్వరోపాసన చేయగలరని సువ్యక్తమాయెను. శరీరసౌఖ్యములు గాక ఆత్మానందమె శాశ్వతమయిన దని తమ నిశ్చలతమూలమునను, జీవితోపరిభాగముసనె భేదములును వైరములును కలహములును గానవచ్చును గాని జీవితాంతరాళమున నైక్యతయు ప్రేమసంబంధమును సహకారజీవనమును నెలకొనియుండు నని తమ గభీరతమూలమునను, జగజ్జననిని విడిచి జీవనయాత్ర సలుపునప్పు డైహికబాధలు సంతాపకరము లయినను ఆమెకరుణాముఖమును వీక్షించుచు ఆమెప్రేమహస్తములచే లాలింపబడుచు అభయాశ్రయ మయిన యామెయొడియందు శయనించు నప్పుడు మాత్రము ప్రాపంచికదురవస్థ లేవియు బాధింపనేర వని తమప్రశాంతతమూలమునను, బాపయ్యగారు ప్రకటించుచుండిరి. సత్యశివసుందరస్వరూపుని విలాసము నిర్మలమగు వారిమోముద్వారా ప్రకాశించుచుండెను. ‘ఈశ్వరా! నాయిచ్ఛ గాక నీయిచ్ఛయె నెరవేరుగాక!’ యని యుత్తమరీతిని వారు ప్రార్థించుచుండినటుల ముఖమునందు స్పష్టముగ గాన్పించుచుండిన వినమ్రత వెల్లడిజేయుచుండెను. వారివదనమును చూచుచు వారిసమీపమున నిలిచియున్న మే మిరు

పుర మొక విచిత్రనిశ్శబ్దోపాసనయందు పాల్గొనినవారమయి విస్మయము జెందితిమి. పరమేశ్వరునకు ధన్యవాదము లర్పించితిమి.

మృత్యుశయ్యనుండి యీ మౌనోపాసన జరిపినది మన కథానాయకులయిన దేశిరాజు పెదబాపయ్యగారని చదువరు లిదివరకె యూహించియుందురు. వారు ధన్యచరితులు. ఈశ్వరోపాసన వారికి నిత్యకృత్యము. సంధ్యాసమయములందు నిష్ఠతో దైనికోపాసన జరపుకొనుట కభ్యాసపడిన వారగుటచే, అమితబాధపడుచుండిన దినములందు గూడ ఆయభ్యాసము వారు విడువజాలకుండిరి. సరళహృదయముతో ప్రార్థన చేయునప్పు డెవరయినను తమయుత్తమాశయసాఫల్యమునె సహజముగ నభిలషింతురు. ఇక నిష్కపటప్రార్థనశీలురు మృత్యుముఖమున ప్రవేశింప నున్నతరి తమ వాస్తవమయిన అభీప్సితమునె ముఖ్యముగ వెల్లడింతురని వేరుగ జెప్పనక్కరలేదు. కావున పెదబాపయ్యగారు నాడు ప్రార్థనసమయమున వినగోరినకీర్తన వారి జీవితరహస్యమును వ్యక్తపరచుచున్న దని సీతారామయ్యగారికిని నాకును వెంటనే స్ఫురించెను. వారి జీవితము ఈశ్వరార్పితమయి సేవాదర్శమునకు నిదర్శనముగా నుండుటవలన ‘నిను సేవింపని పుట్టువ దేటికి? అను నుద్బోధనసూత్రమె వారిజీవితమును నడిపి ధన్య

తనొందించె నని మాయిద్దరకును మాద్వారా ఈ వృత్తాంతము వినిన మిత్రులకును దోచెను. అప్పటినుండి ‘నిను సేవింపని పుట్టువ దేటికి?’ అను కీర్తన బాపయ్యగారి కీర్తన యని చెప్పుకొనుచు పాడుకొనుట ఆంధ్రదేశమందలి బ్రాహ్మప్రార్థనసమాజసభ్యులకు పరిపాటియయినది. తమ శక్తిసామర్థ్యములకును, అభిరుచులకును, అవకాశములకును తగినటుల ఈశ్వరసేవ సలిపి తరించినఘనులు బాపయ్యగారు. వారిని స్వార్థత్యాగిని చేసినది అనుదినప్రార్థనయె. వారు పూర్వాచారము లనుసరించుచుండినప్పుడు, తప్పక ప్రతిదినము సంధ్యావందనము అతిశ్రద్ధాభక్తులతో సలిపియుండిరి. జీవితము సంస్కరణమార్గమున మరలి నడచుచుండినప్పుడు గూడ, పరిశుద్ధాస్తిక్యభావ మనుసరించి నీమముతో దైనికప్రార్థన జరిపిరి. ఒకదినమున నొక బహిరంగసభలో సంస్కారపరులన సంధ్యావందనాదిపూర్వసదాచారముల విసర్జించువారని యాక్షేపించుచు నొక పూర్వాచారపరాయణుడు మాటాడిన తరువాత బాపయ్యగారు నిలువబడి సంధ్యావందనమనగా సర్వాంతర్యామియగు జగదేకపితయొక్క ప్రార్థనమె యని మీ తాత్పర్య మయినయెడల నే నది ప్రతిదినము అనుష్ఠించువాడనె’ యని చెప్పుకొనగలిగిరి. అవి దంభోక్తు లెంతమాత్రము గావని వారి దైనికజీవితముతో నేపాటి పరిచయముగల

వారయినను గ్రహింతురు. దైనికప్రార్థన వారికి ఆత్మబలము ను కార్యోత్సాహమును సద్వర్తనము నలవడజేసి వారిజీవిత మును పూర్ణముగ వికసించిన యొకసుందరకుసుమమువలె మార్చెను.

౧౯౦౬ వ సంవత్సరము డిశంబరు ౨ వ తేదీన బాపయ్యగారు తమ దినచర్యాపుస్తకమునందు నీదిగువ పొందుపరుపబడినది వ్రాసికొనిరి.

"మా మామగారు బరంపురమునుండి రాజమహేంద్రవరమున కేగుచు త్రోవలో నిచట (విశాఖపట్టణమునందు) దయతో ఆగి సుమారు అరగంటసేపు నాతోడ గడిపిరి. వారి కోపము చాల తగ్గియుండెను. మిక్కిలిచనువుతో మాటాడిరి. 'నీవు నీ ధర్మములన్నిటిని కలిగియున్నప్పటికి, నీవు రాజమహేంద్రవరములో మొదటనుండినవిధమున జీవింపవచ్చును' అని చెప్పుచు పూర్వగాథను తిరిగిఎత్తిరి. 'నీయభిప్రాయములు మనసులో నుంచుకొనుము గాని బాహ్యవేషము దాల్చి బ్రాహ్మణుడ వనిపించుకొను' మనియె వారు నుడివినమాటల యుద్దేశము. వంటమనుష్యునిగాని తమపినతల్లినిగాని లేక మాతల్లినిగాని, నీవు వారిని బెదరకొట్టనియెడల, నీవద్దకు పంపెదను...నాయుడుగా రొసంగెడు భోజనము నేను తినుచుండుట వారి కయిష్టముగా నుండెను. ఈ కారణ

ముచేత ఆ నాయడుగారిని చూచుటను మానిరి. కార్డులుగాక వివరముగ పెద్దయుత్తరములు వ్రాయుమని నన్ను గోరిరి. అదియంతయు మిక్కిలిబాగుగనె యున్నది. కాని ప్రేమపూర్వకముగ చేయదలచిన యీసాహాయ్యములతో నన్ను కొనివేయజూచుట వారి కేమి భావ్యము? ఓ దేవా! నీ కొరకును, నాయాత్మకొరకును, నా దేశముకొరకును నేను నిర్వహింపవలసిన విధికృత్యముల జ్ఞప్తియుంచుకొనులాగున కటాక్షింపుము. తండ్రీ! ఆత్మగౌరవభావమును స్వార్థత్యాగబుద్ధియు నా కనుగ్రహించి నీ యొక్క యథార్థయోధునివలెను సేవకునివలెను సకలశోధనలను కష్టములను నెదుర్కొన నన్ను సమర్థుని జేయుము. నీవు నా పక్షము వహించిన, ఎవరు నా కెదురు నిలుతురు? నేను కోరినచో, తమసైనికులును నాకు పంపెదమని మా మామగారు చెప్పిరి. ఈ ప్రీతిపూర్వకబహుమానముల నంగీకరించియు నేను వారిసంఘమున తిరిగి చేరనిపక్షమున నన్నిం కెంత కృతఘ్నునిగా వా రెంచెదరు? హే ప్రభో! నన్ను ప్రలోభనములకు లొంగనీయకుము. 'ఓ సైతానా! నన్ను భ్రమపెట్టకుము. నావెనుకకు పొమ్ము.' అని పూర్వము క్రైస్తు చెప్పినటుల నేనును చెప్పుటకు శక్తి నిమ్ము. తండ్రీ! అస్థిరములగు ప్రాపంచికవిషయములను నన్నింతగ వాంఛింపనీయకుము. కాని నిజమయిన భక్తునకు లభిం

చెడు ఆధ్యాత్మికసుఖముకొరకును ఆనందముకొరకును నన్ను నిరంతరము పరితపింప నిమ్ము. నన్ను నీనామము కీర్తింపనిమ్ము. నన్ను నీ యాజ్ఞలను పూర్తిగ పాలింప నిమ్ము. అన్యులెవరినిగాక నిన్నె నన్ను సేవింప నిమ్ము. ఆవశ్యకమయినచో, నీ సేవయందు నా ప్రాణమును అర్పింప నిమ్ము."

ఈవాక్యములు గాఢధర్మానురాగమును, అపూర్వకార్యదీక్షను, అద్భుతత్యాగశీలమును, అకుంఠితసేవాతత్పరతయు వెల్లడిజేయుచున్నవి. తమ నమ్మకముల ప్రకారము బాపయ్యగారి మేలుకోరి వారి ప్రియబంధువులు వారిని తమ మార్గమునకు మరల్చుటకు సామదానభేదదండోపాయములన్నియు ప్రయోగించుట సహజము. బాపయ్యగారు వారల నెన్నడును ద్వేషింపలేదు. కాని బంధువు లెన్నివిధముల శోధించినను, సంఘము బహిష్కరించినను, గృహకృత్యములకొరకు సేవకులు కుదురక యెన్నిశ్రమలు పడవలసివచ్చినను, దుస్సహమయిన రోగము పీల్చి పిప్పిచేయుచున్నదినములలో గూడ నిసుమంతయు జంకక తమ విశ్వాసానుగుణమయిన యాచరణమును మాత్రము విడిచినవారు కారు. నిర్మలమైనభక్తియు, సర్వజనసౌభ్రాత్రమును, ఉత్తమదేశాభిమానమును తమజీవితమున దృష్టాంతరూపమున కనపరచి జీవించినకొలదికాలములోనె నూతనధర్మజీవనమునకు ఆంధ్రదేశమునందు ఆదర్శపురుషులు కాగలిగిరి. వారు సుమారు ౨౬ సంవత్సరములు జీవించిరి. ఈస్వల్పకాలములోనె వారి జీవితము ప్రఫుల్లతజెందెను. "కొద్దిసంవత్సరములు జీవించినను, భక్తులు పొందనభిలషింపదగిన పరిపక్వచిత్తమును, యోగులకు నీర్ష్య జనింపజేయునంతటి గభీరప్రశాంతతను, ప్రవక్తలు దృష్టాంతముగ గైకొని యనుకరింప నర్హమయిన దృఢవిశ్వాసమును బడయగలిగినయువకు డీతడు. తనమరణానంతరము జీవించి యుండినవారికి నుత్తమధర్మజీవనము పురిగొల్పు ఆదర్శపురుషుడు కాగలుగునట్లు ఈత డీకొలది సంవత్సరములు జీవించెను." అని చెన్నపురి విశ్వవిద్యాలయముయొక్క ప్రస్తుతపు వైస్‌ఛాన్సెల్లర్, పూజనీయులగు దీవాన్‌బహద్దర్ సర్ డాక్టర్ రఘుపతి వెంకటరత్నమునాయుడుగారు బాపయ్యగారి స్మరణార్థము వారు చనిపోయినసంవత్సరము కాకినాడలో జరుపబడిన యుపాసనాసభయందు ప్రశంసించియుండిరి. ఎల్లెడలను, అటులనె ఆంధ్రదేశమందును, బ్రాహ్మసమాజము, సంఘోద్ధరణమునకు వలసిన బాహ్యసంస్కరణ కార్యములతో గూడి యొకవిధమగురూపమును, హృదయశుష్కత్వము తొలగింపగలిగిన ధర్మజీవనముతో గూడి మరియొకవిధమగు రూపమును దాల్చెననియు, ఆంధ్రదేశమునందు మొదటిది కీర్తిశేషులయిన రావుబహ

ద్దర్ కందుకూరి వీరేశలింగముపంతులుగారియందును రెండ
వది బాపయ్యగారియందును నిదర్శనములుగ మూర్తీభవించె
ననియు వెంకటరత్నమునాయుడుగారు మరియొకసందర్భమున
వ్రాక్రుచ్చిరి. కీర్తిశేషులయిన రావుబహద్దర్ కందుకూరి
వీరేశలింగముపంతులుగా రిట్లు తమ స్వీయచరిత్రమున
వ్రాసిరి. "ఈవిషయమున (ధర్మానుష్ఠానవిషయమున) నా
కాయన మార్గదర్శకులయినందులకు మిక్కిలి సంతోషించి
తిని. అత్యల్పకాలములోనె పరలోకయాత్రకు ప్రయాణము
కట్టుకొనియున్న నా యనుష్ఠానపరత్వమువలన నాయంత
రాత్మతృప్తి తప్ప లోకమునకు మేలు తలుగునని భావింప
లేదు గాని లేఁబ్రాయమువాఁడును, జిరకాలము బ్రదుకవల
సినవాఁడును, నిరుపమానసద్వర్తనుఁడును, సంస్కారదీక్షా
దక్షుండును నయిన బాపయ్యగారి యనుష్ఠానపరత్వమున పరి
శుద్ధాస్తికమతవ్యాపనమునకును, సంఘసంస్కారాభివృద్ధికిని
విశేషప్రయోజనము కలుగునని నేను నమ్మియుంటిని."
ఆంధ్రదేశమునందు మతసంఘసంస్కారోద్యమముల విషయ
మున చిరకాలమునుండి పాటుపడుచు నాయకులని పరిగణిం
పబడుచున్న వీరేశలింగముపంతులుగారియొక్కయు వెంకట
రత్నమునాయుడుగారియొక్కయు స్తోత్రమునకు పాత్రులయి
బాపయ్యగారు ఆంధ్రజాతీయజీవనమున నొకయగ్రస్థానము

బడసిరి. కర్మరూపమున పరిణమింపని భక్తియు, భక్తిప్రేరి
తముగాని కర్మయు అస్వాభావికము లగుటవలన ఆత్మకు
తృప్తి నీయజాలవు. భక్తిని కర్మను సమరసపరచుకొని తమ
జీవితమును సర్వాంగోన్నతి జెందించుకొనుటచే బాపయ్య
గారు భక్తియోగులకును కర్మయోగులకును ఆదర్శప్రాయు
లయిరి.

వీరేశలింగముపంతులుగారు ఆశపడినటుల బాపయ్య
గారు చిరకాలము జీవించుభాగ్యము ఆంధ్రదేశమునకు లభిం
పకపోయినను, వెంకటరత్నమునాయుడుగారు నిరూపించి
నటుల వారు జీవించిన స్వల్పకాలములోనె గొప్పభక్తు లయి
భక్తిబీజములు దేశమందు నలుగడల వెదజల్లుటకెగాక యువి
కొందరిహృదయములలో బాగుగ నాటుకొని మొలకెత్తి పెం
పొందుటకును కృషిసలిపియుండుటచే ఆంధ్రదేశమునకు మ
హోపకారము చేసినవారయిరి. వారు చూపిన ధర్మజీవనము
క్రమక్రమముగా ఒకరినుండి యొకరికి వ్యాపించుచున్నది.

కవిశేఖరుడు రవీంద్రనాధఠాకూరు నుడివిన యీక్రిం
ది యమూల్యవచనములు బాపయ్యగారిజీవితమునందు సార్థ
కములయినవి.

"నిత్యునియొక్క స్వరూపమయిన చిన్నవనపుష్పము
అల్పకాలములోనె క్రింద రాలిపోవునప్పటికి అది యెట్లు చిర

కాలధనము కాగలుగుచున్నదో, అట్లే ఏమనుష్యునియంతరమున ఆత్మ సమస్తబాహ్యోపాదానములను తనవిగ జేసికొని జీవనమును తనదిగ ప్రకాశింపజేయునో ఆయాత్మకు ఖ్యాతియుండినను లేకపోయినను అది కాలమునందు విస్తృతాకారము దాల్చినను దాల్చకపోయినను దానియందు నిత్యుని యొక్క ప్రతిరూపము గాన్పించును. ఖండఖండములుగ నుండి ప్రతిముహూర్తమునను మృత్యుచ్ఛాయామాత్రమయి కన్పట్టు అసంపూర్ణకాలమును ఆయాత్మ జయించును."

బాపయ్యగారి సుందరజీవితకుసుమము ఎవరిహృదయమాకర్షింపకుండును?

జీవనస్మృతి

౧వ ప్రకరణము

వంశము

బెజవాడనుండి చెన్నపురికి రైలుమీద ప్రయాణము చేసినవారు బాపట్లస్టేషను చూచియుందురు. ఆంధ్రదేశమున మతసాంఘికరాజకీయోద్యమములందు జేరిధైర్యముతో పోరాడగల కొందరు వీరులు బయలుదేరిన గుంటూరుమండలములోని గ్రామములలో నది యొకటి. సముద్రమున కనతిదూరములో నుండి ఆరోగ్యవంతమయి నివాసయోగ్యముగా నుండును. తాలూకాకచేరి, మునసబుకోర్టు, సబుకోర్టులు, హైస్కూలు, క్రైస్తవఫాదరీలగృహములు, రైలుస్టేషనుకు సంబంధించిన యిండ్లు, మేడలు, రోడ్లు మున్నగునవి కలిగి యిప్పు డది యొక పట్టణాకారము దాల్చినది. కాని పూర్వము సామాన్యకుగ్రామము. ఊరంతయు తెల్లనియిసుకతో నిండి వెన్నెలరాత్రులందు నెచట నయినను గ్రామవాసులు బట్టలు పరచుకొని పరుండి యానందించుటకు తగియుండెను. దక్షిణదిక్కున సముద్రమునకు బోవు మార్గమధ్యమున విశాలమ

యిన పచ్చికబయళ్ళు, సంగీతపుచెట్లతోపులు, తాళవృక్షములగుంపులు, మొగిలిచెట్లబారులు, దట్టమయిన యడవి మొదలగు చిత్తాకర్షకములయిన ప్రకృతిదృశ్యములు గలవు. ఉత్తరభాగమున కృష్ణానదియొక్క కాలువనీటితో సేద్యము చేయబడు మాగాణిభూములు మానవకృషియొక్క ఫలితములు చూపుచుండును. తూర్పుపడమరవైపులకు నూరినడుమగా కలకత్తా చెన్నపురిపట్టణములకు బోవు కంకర్రోడ్డు గ్రామస్థులితరపట్టణవాసులతో రాకపోకలు గలిగియుండుటకు తోడ్పడును. ఆత్మవికాసమునకును శరీరశక్తులవిజృంభణమునకును సాంఘికజీవనాభివృద్ధికిని మిక్కిలి యనుకూలమయిన యీ బాపట్లగ్రామమున దేశిరాజువారి కుటుంబమొకటి చిరకాలమునుండి నివసించుచుండెను. దేశిరాజువారు ఆరువేలనియోగిబ్రాహ్మణులు; కౌండిన్యసగోత్రులు.

బాపట్లగ్రామసమీపములో అప్పాపురగ్రామమందు 'వెంకయ్యగారిచెరువు' అని పిలువబడు తటాకమొకటి కలదు. ఆకొలను ఎవరిపేర బరగుచున్నదో, ఆయన సిరిసంపదలు గలిగి పరోపకారపరాయణులయి జనులసౌఖ్యమునకు శక్తికొలది పాటుపడినవారని వేరుగ జెప్పనక్కరలేదు. వెంకయ్యగారు బాపట్లగ్రామనివాసులయిన దేశిరాజువారికుటుంబములో నొకవిఖ్యాతపురుషులు. ఆయనకు కలిగిన పుత్రుని

పేరు బాపయ్యగారు. ఈబాపయ్యగారు మనకథానాయకుని పితామహులు. బాపయ్యగారి మనుమ లిరువురకు వారి పేరు పెట్టబడినందున వయసునుబట్టి పెద్దవాడగుటచే మన కథానాయకునికి పెదబాపయ్య యను పేరు వచ్చెను. పితామహులగు బాపయ్యగారి భార్య కణగాలగ్రామములో చెరుకుపల్లివారి కుటుంబమున జన్మించిన నరసమ్మగారు. ఈ దంపతులు సచ్ఛారిత్రము గలవారయి యన్యోన్యప్రేమతో కుటుంబధర్మముల నిర్వర్తించిరి. వీరికి వెంకటప్పయ్యగారు, శ్రీరాములుగారు, భావనారాయణగారు, సుబ్బారావుగారు, వెంకటచలపతిరావుగారు, సీతారామారావుగారు, కృష్ణయ్యగారు అను నేడ్గురు పుత్రరత్నములును మాణిక్యమ్మగారు, వెంకాయమ్మగారు అను నిద్దరు పుత్రికామణులును జన్మించిరి. ఇంతపెద్దకుటుంబభారమును నిర్వహించుటలో బాపయ్యనరసమ్మగార్లు అసామాన్యధైర్యసాహసములు కనపరచి సంతానముయొక్క భావ్యభ్యున్నతికి పాటుపడిరి.

నరసమ్మగారి మేనమామ కస్తూరి అప్పయ్యగారు విశాఖపట్టణము కలెక్టరుకచేరిలో హుజూరుసిరస్తాదారుగా నాకాలమున పనిచేయుచుండిరి. తమ మేనకోడలుయొక్క కుటుంబమునకు సాయపడనెంచి వారు బాపయ్యగారికి విశాఖపట్టణముజిల్లాలో తాలూకాసిరస్తాదారు పని నిప్పించిరి.

ఈకాలములో నెన్ని పరీక్షలో ప్యాసుచేసి ఎందరినో ఆశ్రయిం
చి గుమాస్తాపనియయిన దొరకక నిరుద్యోగులయియున్న
విద్యాధికులకు బాపయ్యగారికి గొప్పచదువులేవియు లేకపో
యినను వెంటనె తాలూకాసిరస్తాదారుపని లభించెనను విష
యము విస్మయకరముగ నుండకమానదు. కాని ఆకాలపు
పరిస్థితు లట్టివి. కొంతకాలము విశాఖపట్టణముజిల్లాలో
నుద్యోగముచేసినతరువాత, బాపయ్యగారు స్వగ్రామము
విడిచి దూరదేశములో బిడ్డలతో నుండుటను సహింపజాలక
బాపట్లకు తిరిగివచ్చి యాగ్రామకరిణీకమునందు ప్రవేశించిరి.
ఆరోజులలో ఈనామ్‌కమిషనర్ కుప్పుస్వామిచెట్టిగారు గ్రా
మోద్యోగస్థులయేర్పాటు జరపుసందర్భమున బాపట్లకు వచ్చి
రి. బాపయ్యగారి పెద్దకుమారుడు వెంకటప్పయ్యగారు చక్క
ని తెలుగుదస్తూరీ వ్రాయగలిగి కరణములు కుప్పుస్వామిచెట్టి
గారికి చూపవలసినలెక్కలు మొదలయినవివ్రాసిపెట్టుచుండిరి.
పిన్నవయస్సులైయున్న వెంకటప్పయ్యగారు అందమైన దస్తూరి
వ్రాయగలుగుటనె గాక కుశాగ్రబుద్ధిసంపన్నులని గూడ
కనిపెట్టి వారిని తమతోడ కోయంబత్తూరునకు తీసికొనిపోయి
కొంత తర్ఫీతుచేసి తగిన యుద్యోగములో చేర్పింపవలెనని
చెట్టిగారు కుతూహలపడిరి. దూరదేశములోనున్న కోయంబ
త్తూరునకు కేవలము పసివాడయి నట్టియు చేతికక్కరకువచ్చు

చున్నట్టియు తమ ప్రథమపుత్రుని పంపుట తల్లిదండ్రులకు
సహజముగ కష్టముగా నుండునుగదా? కాని నరసమ్మగారు
భక్తివిశ్వాసములుగల సాధ్వీమణి యగుటచే సామాన్యులవలె
నధైర్యము జెందక భర్తనుగూడ హెచ్చరించి వెంకటప్పయ్య
గారిని కోయంబుత్తూరునకు బంప నిశ్చయించిరి. నరసమ్మగారి
యీ సాహసకార్యమె దేశిరాజువారి కుటుంబము పొందిన
యభివృద్ధికి ముఖ్యకారణ మాయెను. స్త్రీలు వివేకవంతు
రాండ్రయి ధైర్యసాహసములతో మెలగుచుండినచో, కుటుం
బము లున్నతస్థితికి రాగలవని తెలుపుట కిది యొక నిదర్శనము.

వెంకటప్పయ్యగారును ఏ మాత్రము భయపడక చె
ట్టిగారితో కోయంబుత్తూరున కరిగి యుద్యోగములో జేరి
యాంగ్లభాషనుగూడ నభ్యసించిరి. తరువాత చెన్నపురి రివి
న్యూబోర్డుఆఫీసులో టి. రంగాచారిగారిక్రింద పనిచేసి గొప్ప
మెప్పును పొందిరి. అటుపిమ్మట మైసూరురాజ్యములో ను
ద్యోగముసంపాదించి యచట త్వరలో వృద్ధికివచ్చి తహసిల్
దారుపదవి బడయగలిగిరి. వెంకటప్పయ్యగారు సత్స్వభావు
లగుటచే స్వసుఖాపేక్ష మదినుంచక కుటుంబాభివృద్ధికి పాటు
పడబూనిరి. తాము చెన్నపురిలో నున్నప్పుడు సుబ్బారావు
గారిని చలపతిరావుగారిని సీతారామారావుగారిని ముగ్గురు
తమ్ములను తమవద్దకు పిలిపించుకొని వారికి చదువుచెప్పింప

మొదలిడిరి. చలపతిరావుగారు మాత్రము చెన్నపురిలో నుండుట కిష్టములేక యెవరితో చెప్పకుండ నొంటరిగా నంత దూరమునుండి సముద్రముపై ప్రయాణముచేసి యెటులో యింటికి చేరిరి. ఇట్టివి తగనిదుడుకు పనులని అప్పటికప్పుడు తలంపబడినను, అవి సామాన్యముగ నే మహాకార్యములకే కారణములయి దైవఘటనలుగ తరువాత పరిగణింపబడును. వెంకటప్పయ్యగారికి పుత్రసంతానము కలుగలేదు. తమ తమ్ముడు శ్రీరాములుగారి రెండవకుమారుడయిన చినబాపయ్యగారిని దత్తము చేసికొనిరి. చినబాపయ్యగారు మిట్రిక్యులేషనువరకు చదువుకొని కుటుంబమునందు చిరకాలమునుండి వచ్చుచున్న కరిణీకమును చేయుచు నిపుడు బాపట్లగ్రామమందు పాడిపంటలుగలిగి సుఖజీవనము జేయుచున్నారు.

సుబ్బారావుగారు ఎఫ్, ఏ పరీక్షయం దుత్తీర్ణులయి మైసూరు రాజ్యమున నుద్యోగములో జేరి క్రమముగా వృద్ధిలోనికి వచ్చి తుదకు తహసిల్‌దారుపదవిని బడసిరి. ప్రస్తుతము గుంటూరులో వకీలువృత్తి నవలంబించి విశేషద్రవ్యమార్జించి పిల్లజమీందారుగానున్న దేశిరాజు హనుమంతరావు బి. ఏ; బి. ఎల్ గారు సుబ్బారావుగారి పుత్రులు.

సీతారామారావుగారు కూడ ఎఫ్. ఏ పరీక్షయందు తేరి యింజనీరింగుపరీక్షలో గెల్పొంది మైసూరుసంస్థానము

యొక్క కొలువులో ప్రవేశించిరి. వారు పాలెసుకంట్రోలరుగాను సూపరింటెండెంటు ఇంజనీరుగాను గొప్పగౌరవపదవులను పొంది యైశ్వర్యముతో జీవనము గడపిరి. వారి కుమారులు వెంకటనరసింహారావుగారు ఎఫ్, ఏ; ఇంజనీరింగుపరీక్షలయందు తండ్రిగారివలె జయముగాంచి మైసూరురాజ్యమున ఇంజనీరింగుశాఖయందు పనిచేయుచున్నారు.

శ్రీరాములుగారు బాపట్లలోనె యింటిపట్టున నుండి అన్న వెంకటప్పయ్యగారు వేరెయుద్యోగములో నుండుటచే వారి పక్షమున కుటుంబ వారసత్వమయిన కరణీకమును చేయుచు స్వార్జితమును భద్రపరచి వృద్ధినొందించుచు కుటుంబక్షేమమునకు పాటుపడిరి. వీరు గ్రామపెద్దలలో నొకరుగా నుండి గొప్పయధికారివలె మంచిపలుకుబడితో జీవించిరి. వీరి మొదటికుమారుడు రంగారావుగారు ఎఫ్, ఏ వరకు చదివి బాపట్లబోర్డుహైస్కూలులో నిపు డుపాధ్యాయులుగా పనిచేయుచున్నారు. దేవాలయధర్మకర్తలలో నొకరుగా నుండుచు గ్రామపెద్దయై రంగారావుగారు తండ్రిగారియంశమును నిలువబెట్టిరి.

వెంకటప్పయ్యగారివద్దకు చదువునిమిత్తము వెళ్ళి బాపట్లకు మరలివచ్చిన చలపతిరావుగారు దొరతనమువారిచే కొంతకాలము మిడిల్‌స్కూలుపరీక్షయనియు కొంతకాలము

లోవర్ సెకండరిపరీక్షయనియు జరుపబడిన పరీక్షకు బదులుగా నంతకుపూర్వము గావింపబడుచుండిన అన్‌కవినెంటెడ్ పరీక్షకు చదివి యందు కృతార్థులయిరి. పిమ్మట బందరుకలెక్టరు కచేరిలో నుద్యోగమందు జేరి కొలదికాలములో వర్నాక్యులర్ హెడ్‌క్లార్కుపదవికి వచ్చిరి. తరువాత బెజవాడ డివిజనల్ ఆఫీసరువద్ద హెడ్‌క్లార్కుగాను, తెనాలిలో సబ్ మేజస్ట్రీటుగాను, కోసూరులోను రేపల్లెలోను హెడ్ అకౌంటెంటుగాను, అవనిగడ్డలోను బందరులోను సబ్ మేజస్ట్రీటుగాను, తుదకు పొన్నూరులో డిప్యూటితహసిల్‌దారుగాను పనిచేసిరి. చలపతిరావుగారు తమకనిష్ఠసోదరులగు కృష్ణయ్యాగారి చదువుబాధ్యతను వహించి కరిణీకము చేయుచు బాపట్లలోనున్న శ్రీరాములు అన్నగారికి కుటుంబకార్యములందు సాయపడి స్వగ్రామమందును తెలుగుదేశమందును దే[illegible] రాజువారికుటుంబము గౌరవముగాంచుటకు కారణభూతులయిరి. చలపతిరావుగారు స్వదేశమునకు తిరిగివచ్చుట యీశ్వరయోగమువలననె యని సంతసింప దగియున్నది గదా? వారికి ప్రథమకళత్రమగు అన్నపూర్ణమ్మగారివలన మన కథానాయకులయిన పెదబాపయ్యగారును ద్వితీయ కళత్రమయిన వరలక్ష్మమ్మగారివలన అన్నపూర్ణమ్మయను పుత్రికయు వెంకటప్పారావను పుత్రుడును జన్మించిరి.

వెంకటప్పారావుగారు ఎల్, ఎమ్, అండ్, ఎస్ పరీక్షయందు జయమొంది యిప్పుడు బాపట్లలో సొంతవైద్యశాల పెట్టి వైద్యవృత్తి జేయుచు పరోపకారబుద్ధితో జీవించుచున్నారు. తమవంశమున నందరికంటె ధర్మవిషయమున నధికులయి తమపేరుతో చేర్పబడిన 'పెద' యనుపదము ఘనతను సూచించుబిరుదముగా మనము గ్రహించుటకు తగినరీతిని పెదబాపయ్యగారు జీవించి శాశ్వతకీర్తిని బడసిరి.

కృష్ణయ్యగారు బి. ఏ పరీక్షలో నుత్తీర్ణులయి సెటిల్మెంటు డిపార్టుమెంటునందు దొరతనమువారికొలువు వృద్ధులగువరకు చేసి రావుబహద్దరు బిరుదము బడసి రివిన్యు సెటిల్మెంటుఆఫీసరుపదవిలో నుండగా విశ్రాంతినిగైకొనిరి. వారి ప్రథమపుత్రుడు భావనారాయణరావు బి. ఏ; బి. ఎల్ గారు తండ్రిగారు పనిచేసిన డిపార్టుమెంటునందె అసిస్టెంటు సెటిల్మెంటుఆఫీసరుగాకృష్ణాజిల్లాయందిపుడు పనిచేయుచున్నారు. కృష్ణయ్యగారి తక్కిననలుగురు పుత్రులలో నిరువురు బి. ఎల్ పరీక్షలో తేరి న్యాయవాదివృత్తి నవలంబించి మనప్రాంతములందె గౌరవముగ జీవనము గడపుచున్నారు.

వృద్ధినొందుట కెన్నియవకాశము లున్నను ఏకారణముచేతనో కొందరు వాని నుపయోగించుకొనజాలక వ్యర్థ జీవనము గడపుటను మనము చూచెదము. బాపయ్యగారి

పుత్రులేడ్వురలో నొక్కరుమాత్రము — భావనారాయణ గారు—ఎట్టియభివృద్ధియు గాంచక యీచెప్పబడిన సత్యము నకు దృష్టాంతముగా నున్నారు. అభ్యున్నతి బాహ్యపరిస్థితులమీదనె గాక అంతరచిత్తవృత్తులమీద గూడ నాధారపడియుండును గదా?

చలపతిరావుగారు తమ 38 వ యేట ముగ్గురుచిన్న బిడ్డలను భూమిమీద విడిచి యకాలమృత్యువాత బడిరి. వారి కుటుంబవ్యవహారములు వారిసాహాయ్యమున వృద్ధిలోనికి వచ్చిన వారిసోదరులు కృష్ణయ్యగారు నిర్వహించిరి. పెద బాపయ్యగారును తక్కినయిద్దరుబిడ్డలును యుక్తవయసు బడయువరకు కృష్ణయ్యగారిసంరక్షకత్వమున పెరిగిరి.

పెదబాపయ్యగారి వంశవృత్తాంతము చదివిన తరువాత, ప్రాపంచికైశ్వర్యములందు వృద్ధినొందుట కెన్నియో యవకాశములు వారు కలిగియుండినట్లు చదువరులు గ్రహించియుందురు. కుటుంబమునందు దాదాపుగ నెల్లరు లౌకికజీవనమున ఘనతవహించినవారె. కుటుంబపరిస్థితులనుబట్టి పెద బాపయ్యగారు తమదృష్టిని ధనముమీదను లౌకికాధికారములమీదను నిలుపవలసియుండినను స్వార్థముకొరకు ధనముకూడబెట్టుటయు అధికారము సంపాదించుటయు నీచమని భావించుస్థితికి వచ్చిరి. తమయన్నదమ్ములందరిలోను వారు

మొట్టమొదట బి.ఏ. పరీక్షయందు గెల్పొందిరి. దొరతనము వారికొలువునం దున్నతపదవిలోనుండి తమసంరక్షణబాధ్యత వహించిన కృష్ణయ్యగారు గాని మైసూరురాజ్యమున గొప్ప యుద్యోగములోనున్న తమపినతండ్రి సీతారామారావుగారు గాని తమకు కోరికయె యుండినయెడల లౌకికజీవనమునం దెంతయొ వృద్ధిలోనికి దెచ్చెడివారె యయినను, బాపయ్య గారు తమదృష్టిని పరమేశ్వరునిమీదికి త్రిప్పి తమశక్తులను లోకసంగ్రహమునకు వినియోగింప సమకట్టిరి. తమజీవితమును సార్థకపరచుకొనుటకె వారు నిరంతరము నిరీక్షించుచుండిరి. దొరతనమువారి రాజమహేంద్రవరకళాశాలలో అసిస్టెంటులెక్చెరరుగా పనిచేయుచుండినప్పుడు ఆత్మగౌరవమునకు భంగముకలిగి దొరతనమువారికొలువునె మానవలసిన యావశ్యక మేర్పడగా నాసందర్భమున వారు తమదినచర్య పుస్తకములో 30-౯-౧౯౦౮ తేదీన వ్రాసిన యీక్రింది మాటలు వారిచిత్తసంస్కార మెట్టిదొ స్పష్టముగ చాటుచున్నవి.

"డైరెక్టరుకు నావిజ్ఞప్తిని స్వయముగానె పంపితిని. ఈదినము నాజీవితమున నిజముగ నొకముఖ్యదినము హంటరుగారు అడుగగా, ట్రైనింగుకాలేజిలోని పదవి నే నంగీకరింపనని వ్యవహారరీతిగా తెలిపితిని. దొరతనమువారి కొలువు

నందు నాయుద్యోగము అంతమయినది. నేడు నాజన్మదినము. నేటితో నా ౨౪ వ యేడు పూర్తియగును. నా ౨౪ వ సంవత్సరముయొక్క చివరిదినమున దొరతనమువారికొలువు నందు స్థిరపరుపబడుటకు మారుగ నే నాసేవను, బహుశా శాశ్వతముగానె, విడుచుట సంభవించినది. ఇది వాస్తవముగ ఈశ్వరవిధానము. ఇంతకంటె ఘనకార్యమేదైనను, లేక యితరమార్గముల నేపనియయినను చేయుటకు నేను విధింపబడినట్లు కానబడుచున్నది. నేను సాంఘికముగానె గాక రాజకీయముగా గూడ స్వతంత్రుడనై యుండవలెనని యీసంఘటన సూచించుచున్నది."

పంకమునుండి పద్మము జనించి కొలనుకంతకు శోభను గూర్చినట్లు, మహామహులుగూడ విషయసంసారమునందె జన్మించి వంశమునకంతకు కీర్తిని దెచ్చెదరుగదా! పెదబాపయ్యగారి జననమువలన దేశిరాజువారివంశము వన్నెకెక్కినదనుట నిశ్చయము.

జీవనస్మృతి

3 వ ప్రకరణము

శైశవము

చలపతిరావుగారు బందరులో కలెక్టరుకచేరియందుద్యోగముచేయుచుండగా, హూణశకము ౧౮౮౧ వ సంవత్సరము సెప్టెంబరు ౨౧ తేదికి సరియయిన వృషసంవత్సర ఆశ్వయుజ శుద్ధషష్ఠిరోజున వారిభార్య అన్నపూర్ణమ్మగారు ప్రసవించిరి. జన్మించినది మగశిశువు అగుటవలనను, అంతకుముందు ఒకరిద్దరు బిడ్డలు పుట్టిపోవుటవలనను, అన్నపూర్ణమ్మగారు సుఖముగ ప్రసవించిరను వార్త గృహములోని వారెల్లరకు మహదానందము కలిగించెను. బారసాల యతివైభవముతో జరుపుకొనవలెనని వారువ్విళ్ళూరుచుండిరి. బంధువులందరకు ఆహ్వానపత్రములు పంపబడెను. చలపతిరావుగారి తల్లి నరసమ్మగారును ఇతరబంధువులు నొకరితరువాత నొకరు బారసాలవేడుక చూచుటకు పదునొకండవ దినమునకు పూర్వమె రాదొడగిరి. పదియవరోజు సాయంకాలము పసుపు, నూనె, చక్కెర మొదలగు వస్తువులు పురమందతి

పరిచితుల యిండ్లలో మంగళవాద్యములతో పంచిపెట్టబడెను. పురిటిస్నానమునకై సర్వము సిద్ధముచేయబడెను. నామకరణ మహోత్సవమున కేర్పాటులన్నియు జరిగెను. విందునకు కావలసినసామగ్రియు సమకూర్పబడెను. పాలును పెరుగును తెల్లవారగానె తీసికొనివచ్చుటకు అవి యమ్మువారి కుత్తరువు లీయబడెను. గృహమునచేరిన బంధువులందరు సంతోషమున దోలలాడుచుండిరి. ఉదయము జరుగనున్న యుత్సవమునకై నిరీక్షించుచుండిరి. మనుష్యు డొకటి తలచిన దైవ మింకొకటితలచునను సామెత తరచు వినుచుందుము గదా? చిత్రము! హఠాత్తుగా విరుద్ధపరిస్థితులు సంఘటిల్లెను. దీపములు పెట్టువేళకు అన్నపూర్ణమ్మగా రున్నట్లుండి తలను త్రిప్పుటను అసందర్భముగ మాటాడుటను మొదలుపెట్టిరి. బంధువులు గుమిగూడిరి. ఏదో విపరీతము జరుగనున్నదని భయపడిరి. ఈవార్తను వినినతోడనె చలపతిరావుగారు క్రుంగిపోయిరి. వెంటనె వైద్యులు పిలిపింపబడిరి. తగుచికిత్సలు చేయింపబడెను. గుణము కాన్పించుటలేదు. వ్యాధి అంతకంతకు పెరిగిపోయెను. ప్రాతఃకాలము కాకపూర్వమె పది దినములబిడ్డను తల్లిలేనిబిడ్డను చేసి బంధువులందరను దుఃఖసాగరమున ముంచి అన్నపూర్ణమ్మగారు పరలోకగతులయిరి. ఆమె యాకస్మికమరణమె హృదయములను బ్రద్దలుచేయు

చుండ, దానికి బిడ్డయొక్క యసహాయస్థితి తోడయి చూడవచ్చినవారందరిని దుర్భరవిషాదమునకు లోనుచేసెను. ఉదయమయిన నేమి? వెలుగు అంతటను వ్యాపించిన నేమి? సమావేశమయిన వారందరికి అంతయు అంధకారమయమై పోయెను. సుఖము దుఃఖముగ మారెను. బారసాలకు బదులు అంత్యకర్మలు జరుపుకొనవలసిన యవస్థపట్టెను. అట్టి పరిస్థితులందు ఘనముగ ఆశిశువునకు నామకరణోత్సవము జరుగకపోయినను, శాశ్వతముగ తననామము ప్రపంచమున నిలుపుకొనగలుగుశక్తి యాబిడ్డకు గలదని యెవరికి, అందులో అప్పటిదైన్యమునె ముఖ్యముగ చూచి విలపించెడు బంధువుల కెట్లు పొడగట్టును?

బాపయ్యగారు దురదృష్టవంతులని గృహములోని వారందరు తలచి వారియెడ జాలిపడుచుండిరి. తండ్రి చలపతిరావుగారు వారియందమితానురాగమును జూపమొదలిడిరి; వారిసౌకర్యముల కెట్టిలోటును లేకుండ సర్వవిధములయిన యేర్పాటులు చేయుటకై పూనుకొనిరి. దాదాపుగ పెదబాపయ్యగారి జననకాలమందె బందరులో నొక గొల్లకుటుంబమున ఒకశిశువుపుట్టి వెంటనె మరణించెను. ఆకుటుంబమును చలపతిరావుగారు తమయింటికి రప్పించి పెదబాపయ్యగారిని పాలిచ్చి, పోషణముచేయుటకై ఆకుటుంబమందలిస్త్రీకి అప్ప

గించిరి. ఆమెపేరు మహాలక్ష్మి. ఆమెకు ఒకకొడుకును, ఒక కూతురు నుండిరి. ఆమెభర్త తనవృత్తిని జేసికొనుచు నప్పు డప్పుడు కుటుంబమును చూచిపోవుచుండెను. పెదబాపయ్య గారిని బంధువులుకూడ కొంతవరకు పోషించుచువచ్చినను వారు మహాలక్ష్మికుటుంబమునందె యెక్కువమక్కువ కలిగి యుండిరి. మహాలక్ష్మిని బాయమ్మయనియు, ఆమెకొడుకును అన్నయనియు, ఆమెకూతురును అప్పయనియు, ఆమెభర్తను అయ్యయనియు పిలుచుచు వారితో నతిప్రేమతో మెలగు చుండిరి. మహాలక్ష్మిభర్త తనబిడ్డలకు మిఠాయిపొట్లములను తెచ్చి యిచ్చినపుడెల్లను వారిచేతిలోకూడనొకపొట్లమును పెట్టు చుండెను. మాఅయ్య యిది యిచ్చినాడని యతిసంతోష ముతో నింటిలో నందరికి చెప్పుచు మిఠాయిని తినెడువారు. మహాలక్ష్మియు తనబిడ్డలకంటె నెక్కువగా వారిని ప్రేమించి మూడుసంవత్సరములకాలము చలపతిరావుగా రుద్యోగసంద ర్భముగ బెజవాడ తెనాలిపురముల కరిగినను ఆమె పెద బాపయ్యగారిని కనిపెట్టుకొనియుండి సాకెను. కోసూరునకు బదిలీఅయి చలపతిరావుగా రచ్చటికి పోయినప్పుడు, పెదబా పయ్యగారిని అమితకష్టముతో ఆమె విడిచి స్వస్థలమునకు వెళ్ళెను. పెదబాపయ్యగారు ఆమెకొరకు దిగులుపెట్టుకొనిరి. కాలక్రమమున గాని ఆదిగులు విడిచి సంతోషముగ నింటిలో

తిరుగలేకపోయిరి. వారు పెద్దవారయి బందరులో చదువు చుండినప్పుడు, ఆమె యప్పుడప్పుడు వచ్చి వారిని చూచి యోగక్షేమములు కనుగొని పోవుచుండెడిది. శైశవమునందు వారికి మహాలక్ష్మికుటుంబముతో కలిగిన గాఢసంబంధము వలన వారిమనస్సునం దెట్టిభావములు స్థిరముగ నాటుకొనెనో యెవరును గమనింపలేదు. బీదలను జూచినంతనె కనికరించి వారిని తమతో సమముగ భావించి వారికి వలసినసాహాయ్య ము చేతనయినంతవరకు చేయుస్వభావమున కంకురము బాప య్యగారియందు ఆ కాలమందె నాటబడియుండును గదా?

దాదికి బిడ్డ నప్పగించి బిడ్డముఖమునైన చూడనితల్లి దండ్రులనుగూర్చి మనము వినుచుందుము. చలపతిరావుగారు అట్టి దాగుణస్వభావము కలవారు కారు. తల్లినికోల్పోవుటచే పాలిచ్చి పెంచుటకొకదాది యావశ్యకమని తలంచి వారు పెదబాపయ్యగారిని మహాలక్ష్మియొద్దనుంచిరె గాని వారు తమతోడ నెంతసంబంధము కలిగియుండవలెనో యంతయు పూర్తిగ కలిగియుండుట కవకాశమిచ్చిరి. అత్యంతగారాబ ముతో వారియెడ చరించుచుండిరి. ఇంటివద్ద కచేరిచావడిలో తాము కూర్చుండి యితరులతో మాటాడుచు పనులను చూ చుకొనుసమయములందు తాము కూర్చుండియున్న తివాచి మీద కూర్చుండి తా మూనుకొనిన బాలీసును ఆనుకొని

బాయమ్మ పాలియ్యవలెనని పట్టుపట్టి పెదబాపయ్యగారేడ్చుటకలదు. బిడ్డను ఏడ్పించుట కిష్టములేక వారు వెంటనె చావడిని విడిచి మరొకచోటికి పోయి యావిధముగా పాలిచ్చుటకు మహాలక్ష్మికి చెప్పెడువారు. ఈ తీరున పెదబాపయ్యగారేది కోరిన, అది నెరవేర్చుచు తల్లిలేనిబిడ్డ గదాయని మనసును సమాధానపరచుకొనుచు వాతిని మిక్కిలి ముద్దుతో చూచుకొనిరి. చలపతిరావుగారతిగంభీరస్వభావము గలిగి యధికధైర్యసాహసములతో తమవ్యవహారములు జరపుకొనువారు; అధికారశీవిని నెక్కువగ చూపువారు. వారితోడిసంపర్కము పెదబాపయ్యగారి మనోఫలకముమీద జీవితముయొక్క గాంభీర్యమును గౌరవమును ఆధిక్యతయు ముద్రితములగుటకు తోడ్పడెననుటకు సంశయములేదు; మరియు చలపతిరావుగారి ధైర్యసాహసములు కూడ వారియందు ప్రసరించెనని నమ్మదగియున్నది.

చలపతిరావుగారు ద్వితీయవివాహము చేసికొనిరి; వరలక్ష్మమ్మగారు కాపురమునకు వచ్చిరి. రేపల్లెలో పెదబాపయ్యగారికి అయిదవయేట అక్షరాభ్యాసము జరగెను. తరువాత వారు సుమారు ఆరేండ్లప్రాయము కలిగియున్నప్పుడు తండ్రిగారితో బందరుకు వచ్చి యచట ఆంగ్లభాషను నేర్చుకొన మొదలిడిరి. అది నేర్పుటకు ఒకయాచారిగారు ప్రత్యే

కముగా నియమింపబడిరి. ప్రస్తుతము నందిగామతహసిల్దారుగా నున్నట్టియు, వరలక్ష్మమ్మగారి అన్నయు నయిన కామరాజు వెంకటప్పయ్య బి. ఏ. గారు అరోజులలో చలపతిరావుగారివద్దనుండి బందరులో చదువుకొనుచు పెదబాపయ్యగారి చదువువిషయమున కొంతశ్రద్ధపుచ్చుకొనిరి. చలపతిరావుగారీతూరి రమారమి ఒకసంవత్సరకాలము బందరులోనుండి యచటనుండి బదిలీఅయి పొన్నూరుకు వెళ్ళిరి. ఇచ్చటగూడ పెదబాపయ్యగారి చదువునకు తగినయేర్పాటులు చేయబడెను. మేనమామ వెంకటప్పయ్యగారు కూడ బందరునుండి వచ్చి పొన్నూరుకు సమీపమున గుంటూరులో చదువప్రారంభించుటచే, శని ఆదివారములలో పొన్నూరుకు వచ్చి పెదబాపయ్యగారి చదువునుగూర్చి విచారించెడివారు. ౧౮౯౭ వ సంవత్సరములో ఎనిమిదవయేట పెదబాపయ్యగారికి ఉపనయనము చేయబడెను. సంధ్యావందనము చక్కగ నేర్పింపబడెను. కుమారుడు క్రమముగా సంధ్యావందనము సలుపునట్లు చేయుటకు చలపతిరావుగారు శ్రద్ధతీసికొనిరి. వారు ప్రతిదినము రామాయణపారాయణము చేయువారు; దేవతార్చన నిత్యము జరిపించెడువారు; హరికథలు చెప్పించెడువారు. వారొకవిధమగు భక్తియు నిష్ఠయు గలిగియుండిరి. పుత్రుడు గూడ మతనిరతి కలిగియుండవలెనని అభిలషించిరి.

వారిమామగారు, కామరాజు శింగరయ్యగారు పూర్వమత సాంప్రదాయమునకు జెందిన దైవభక్తులు; గొప్పవిరాగులు; ఏకపత్నీవ్రతపాలకులు. వారెల్ల వేళల భగవన్నామసంకీర్తనము సలిపెడువారు. ఇతరులు రచించిన కీర్తనలనె గాక తమ భక్త్యావేశముకొలది స్వయముగ చేసిన వివిధములయిన కీర్తనలు గూడ పాడుచు తోడివారలను ఆనందమున నోలలాడించుచుండిరి. వారు తరచు చలపతిరావుగారి గృహమున వసించుచువచ్చిరి. వారిసాంగత్యమున మెలగుట బాపయ్యగారికి తటస్థించెను. మతవిషయమున తండ్రిగారు పుచ్చుకొనినశ్రద్ధయు, గృహమందలి మతవిషయిక వాతావరణమును, తాత శింగరయ్యగారి భక్తిప్రబోధమును పెదబాపయ్యగారి కోమలహృదయమున ధర్మాభినివేశము కలిగించుటకు కారణభూతములు గాకుండునా?

చలపతిరావుగారికి వరలక్ష్మమ్మగారివలన జన్మించిన అన్నపూర్ణమ్మకు మూడవసంవత్సరములును వెంకటప్పారావుకు కొలదిమాసములును ప్రాయమువచ్చెను. రమారమి తొమ్మిదిసంవత్సరములవయస్సు పెదబాపయ్యగారికి వచ్చెను. సంతానమును, సంపదను గలిగి చలపతిరావుగారు పొన్నూరులో అధికారపదవియందు ఘనముగ జీవించుచుండిరి. కాని దుర్దినములు రానున్నవి. వారిశరీరము వ్యాధిగ్రస్తమయి

క్రమముగా నీరసింపదొడగెను. బాపట్లగ్రామమునకు సకుటుంబముగ వచ్చిరి. పెదబాపయ్యగారు మెట్రిక్యులేషను పరీక్షకు బాపట్లలోనె హాజరయి యందు కృతార్థులయిరి. ఈసంతోషవార్త విని చలపతిరావుగారు కుమారుడేదో పెద్దపరీక్షలో గెలుపొందినటుల అమితానంద మొందిరి. తరువాత కొద్దిరోజులలో అనగా 1891 వ సంవత్సరము జనాభా తీయబడిన దినము ఫిబ్రవరిపదునొకండవ తేదీన చలపతిరావుగారు పరమపద మొందిరి. పెదబాపయ్యగారి కప్పుడప్పుడె బుద్ధి తెలియుచుండెను. తండ్రిగారి మరణము వారికి మేరలేనిదుఃఖము తప్పక కలిగించియుండును. లేబ్రాయములో నుండగానె ఈ మహావిపత్తు కూడ సంప్రాప్తమాయెను. కష్టముల వేడిమిచేత గాని హృదయము పరిపక్వము గానేరదు. ఆపద అనుభవించినవారె ఆపదలందు చిక్కుకొని బాధపడువారియెడ సానుభూతి చూపగలరు. తల్లిదండ్రుల గోల్పోయినబిడ్డలను ఆదరించుప్రేమస్వభావము పెదబాపయ్యగారి జీవితములో కానబడిన, అందునకు హేతువు ఆయన యట్టిమరంతదుఃఖమునకు లోనగుటగాక మరియొకటి యేది?

చిన్నతనములో పట్టుపడినగుణములును అభ్యాసములును తరచుగ ఆజన్మాంత ముండును గదా? శైశవమున పెదబాపయ్యగారు బడసిన గుణములును అభ్యాసములును మిక్కిలి

ముఖ్యమయినవి. ఐశ్వర్యమునందు పుట్టిపెరిగుచు దారిద్ర్యముతో చెలిమిచేసిరి. అధికారముయొక్క ఆదరముతోను సేవయొక్క పోషణముతోను వర్థిల్లిరి. కన్నతల్లిని గోల్పోయినను, ప్రేమతో పాలిచ్చిపెంచు తల్లిని కనుగొనిరి. విద్యను చవిజూచిరి. భక్తిరసముగ్రోలిరి. జీవితము క్షణభంగురమని కన్నులారగాంచిరి. తొమ్మిదియేండ్లలోపుననె పెదబాపయ్యగారి కీవివిధానుభవములు కలిగెను. చిన్నతనమందె చిత్తమెట్టిసంస్కారమందెనో చదువరు లూహింపగలరు. ఈశ్వరవిశ్వాసమును, సర్వమానవసోదరత్వమును, సేవాధికారపదవుల సమానత్వమును, ఆత్మగౌరవమును, జ్ఞానభక్తివైరాగ్యములను వారుగ్గుపాలతో గ్రహించిరని చెప్పవచ్చును. వారియందవి యావయసున స్పష్టముగ గాన్పింపకపోయినను, బీజరూపమున తప్పక యుండెనని యంగీకరింపక తప్పదు. ఈచిన్నతనమునందు గూడ నవి కొంచెముకొంచెము కాన్పించుచునె యుండెను. పొన్నూరులో నొకరోజున పంతులుగారు వచ్చి పెదబాపయ్యగారికి చదువుచెప్పుచుండిన సమయములో వారిమీద నింటిలోనియాడువా రేదోయల్లరి చేసిరని పితూరిచేయగా పంతులుగారు వారిని బెత్తము తీసికొని కొట్టిరి. వా రాబెత్తము లాగుకొని దానితో పంతులుగారికి రెండంటించిరి. పంతులుగారు చలపతిరావుగారియొద్దకు

వెళ్ళి ఫిర్యాదు చేసికొనవలసివచ్చెను. "ఇదేమిరా, ఈలా చేశావు?" అని తండ్రిగా రడుగగానే, "పంతులుగారు నన్ను అన్యాయంగా కొట్టినారు. చదువకపోతే, వ్రాయకపోతే, చదువులో వారు చెప్పిం దేదైనా చేయకపోతే, వారు కొత్తే కొట్టవచ్చుగాని యింట్లోవా రేదో చెప్పినదానికి నన్ను కొట్టడ మెందుకూ?" అని పెదబాపయ్యగారు వాదించమొదలుపెట్టిరి. తండ్రిగారు కుమారుని ఆవలకుపంపి "చిన్నపిల్లలకు కొట్టి చదువుచెప్పుట పనికిరాదు. అందులో తల్లిలేని పిల్లవాడు. కఠినముగా చూడకండి." అని పంతులుగారితో చెప్పిరి. అన్యాయమున కెదురుతిరుగుస్వభావము పెదబాపయ్యగారియం దాయుల్పవయస్సునందె కానబడుచుండెను. తమవలెనె పితృవాత్సల్యమునకు దూరులయిన తమ చెల్లెలు అన్నపూర్ణమ్మను, తమ్ముడు వెంకటప్పారావును వా రమితముగ ప్రేమింప మొదలిడిరి. చవతితల్లియయినను, వరలక్ష్మమ్మగారిని సొంతతల్లివలెనె ప్రేమించి యామెతో చరింపనారంభించిరి. నానాల్గవయేట నాతల్లిని గోల్పోయి నాయక్కగారును వారి తల్లియునైన వరలక్ష్మమ్మగారియండను నేను చేరవలసినవాడ నైతిని. మాతృవిహీనుడనైన నాయందును వారు సహజముగ నెంతయొ ప్రేమ కనపరచిరి. చిన్నతనమందు వా రెవరెవరిని ప్రేమించిరో వారందరిని

నిరంతరాయముగ ప్రేమించియుండుటనుబట్టి పసితనమందే వారిహృదయము యథార్థప్రేమకు నిలయమయ్యెనని విశ్వసింపదగును. వేళలకు సంధ్యావందనము సలుపుచు నొకవిధమయిన మతనిష్ఠను గూడ వారు శైశవమునందే యలవరచుకొనగలిగిరి. ఈమతనిష్ఠ యేదోరూపమున వారిజీవితము నెల్లప్పుడంటియేయుండెను.

మొగ్గయందు కొంతవరకైనను పువ్వుయొక్క లక్షణము లెట్లు కాన్పించకుండును?

జీవనస్మృతి

౨వ ప్రకరణము

బాల్యము.

చలపతిరావుగారి మరణానంతరము వారికుటుంబము స్వస్థలమయిన బాపట్లలోనె యుండిపోయెను. ఇంటిలోనన్న బిడ్డలు, పెదబాపయ్యగారును వారికంటె పిన్నవయస్కులమయిన వారిచెల్లెలును తమ్ముడును నేనును, వరలక్ష్మమ్మగారిచేతను ఆమెబావ భావనారాయణగారిభార్య భవానమ్మగారిచేతను పోషింపబడుచుంటిమి. శింగరయ్యగారు తరచు బాపట్లలోనుండి గృహకృత్యములందు తోడ్పడుచుండిరి. ఉద్యోగకారణమున గ్రామాంతరమం దుండినను కృష్ణయ్యగారు కుటుంబయాజమాన్యము వహించిరి. శ్రీరాములుగారికుటుంబమును ఇతరబంధువులకుటుంబములును అచట గలవుగాన, పలువురురక్తబంధువులతో కలసిమెలగుటకు పెదబాపయ్యగారి కవకాశమేర్పడెను. ఆదరించువారెందరుండినను, తల్లిదండ్రులు లేనికొరత నెవరు దీర్పగలరు? అయినను ప్రేమాస్పదులగు బంధుకోటినడుమ జీవించుచు హృదయము

శాంతిని బడసి విశాలప్రేమయందు పెదబాపయ్యగారు పెరుగనారంభించిరి.

ఆయన బాపట్లగ్రామమందు ౧౮౯౧, ౧౮౯౨, ౧౮౯౩ సంవత్సరములు మూడును ఒక్కపట్టున మొదట గడపెను. ఈమూడుసంవత్సరములలో ఆయనవయస్సు పది, పదునొకండు, పండ్రెండు ఏండ్లు పూర్తియగుచుండెను. అది కేవలము బాల్యకాలమయినను, మొదటినుండి క్రమశిక్షణమున పెరిగియుండుటవలనను, సదభ్యాసములుగొన్ని యంతకు బూర్వమె కలిగియుండుటవలనను, సూక్ష్మబుద్ధిసంపన్నులగుట వలనను, ఆయన తోడిబాలురకంటె నెక్కుడుతీరుగా నడచుకొనగలిగియుండెను. ప్రతివిషయమునను విధికృత్యముల నిర్వర్తించుచుండెను. స్నానము, సంధ్య, చదువు మొదలగునవి వేళలకు జరపుకొనుచుండెను. అనావశ్యకమయిన ప్రసంగములకుగాని సహవాసములకుగాని పోక తనపనులయం దెక్కువదృష్టి గలిగి చరించుచుండెను. ఇట్టిక్రమవర్తనముగల ఆయనజ్ఞానమును వికసింపజేయుటకు బాపట్లగ్రామపరిసరములందలి సృష్టివైచిత్ర్యములును తప్పక తోడ్పడియుండును. ఇసుకలో ఆటలాడియుండును. పచ్చికబయళ్ళలో బరుగులిడియుండును. సంగీతపుచెట్ల శ్రావ్యగాన మాలించియుండును. సముద్రమునం దుప్పొంగుతరంగములలో స్నానములు చేసియుండును. బాలునికానందము కలిగించుటకు నివి యెంతయో సాయపడియుండునుగదా! ప్రకృతివైపునకు ఆయనమనసు మరలియుండుననియు, సృష్టితో చెలిమిచేసినకొలది సంతోషమధికము కాగలదని ఆయన తెలిసికొనెననియు నమ్మదగును. మరియు కృషికులు సేద్యముచేసి పంటలు పండించుటకు పడుశ్రమను గాంచి తీవ్రమయిన ప్రయత్న ముండినగాని మానవుని యాశయములు సఫలీకృతములు గాజాలవని ఆయన గ్రహించియుండునని కూడ చెప్పవచ్చును.

బాపట్లకు వచ్చినప్పటినుండి ఆయన పాఠశాలలో జేరి చదువ మొదలుపెట్టెను. ఆ మూడుసంవత్సరములలో వరుసగా మొదటిఫారమును రెండవఫారమును మూడవఫారమును జదివి లోవర్ సెకండరీపరీక్షయందు కృతార్థుడయ్యెను. ఆయన గృహసంబంధములయిన కొన్నివిచారములకు లోను గావలసివచ్చినను, తన చదువువిషయమయి తగినవిచారణ చేయగల్గ మగవారెవరు నింటివద్ద లేకపోయినను ఏదియు తప్పకుండ మొదటిమూడుఫారములను ముగించుకొనగలుగుట వలన చిన్నతనమందె ఆయనకు విద్యయెడ నమితశ్రద్ధ గలదని స్పష్టమగుచున్నది. ఇంటివద్దకూడ ఆయనకు ప్రత్యేకముగ చదువు చెప్పింపబడెను. చదువులో మంచిపునాది యాకాలములో పడినదని చెప్పవచ్చును. బాపట్లలో ఆదినములందు

లోవరుసెకండరీవరకె పాఠశాలలో చదువు చెప్పబడుచుండెను. ఆతరగతియందు చదువు విద్యార్థులు సంవత్సరాంతమున గుంటూరుకు వెళ్ళి పరీక్షకు హాజరై ప్రశ్నపత్రములకు జవాబులు వ్రాయవలసియుండెను. మంచి రోడ్డుండుటవలన ప్రయాణసౌకర్యము కొంత యేర్పడియున్నను బాపట్లనుండి గుంటూరుకు ఎద్దుబండిమీద పోవుటకు సుమారు మూడు పూటలు పట్టుచుండెను. ౧౨ సంవత్సరముల లోపువయస్సుగల బాలురు అట్టిపరీక్షకు చదువదలచిన నెంతప్రయాసకును ఆదుర్దకును లోనుగావలసివచ్చునో యోచించుకొనుడు. ఎటువంటి సామాన్యపరీక్షకు హాజరుకావలసినను పిల్లలు మిక్కిలి భయపడుదురు. ఏదో గవర్నమెంటువారుజరపుపరీక్షయనియు, దూరపట్టణమునకు వెళ్ళి హాజరుకావలసిన పరీక్ష యనియు, ఉపాధ్యాయులు చెప్పుచు అందునకు వారెంతో కష్టపడుచు త మెంతో తంటాలు పెట్టునప్పుడు, బిడ్డలకనావశ్యకమయిన భీతి యమితముగ కలుగుననుటకు సంశయము లేదు. పరీక్షకు వెళ్ళిన తప్పక కృతార్థులగుదురను నమ్మకముండిన, బాలురంతగా బాధపడరు. పలువురలో చాలకొలదిమంది మాత్రమె గెలుపొందుదురు. ఎంతచదివినను తనకు జయము కలుగునో లేదో యని ప్రతిబాలుని హృదయము దడదడ కొట్టుకొనును. నాగరకతజెందిన యేదేశమందును బిడ్డలీతీరున

చదువునిమిత్తము హింసింపబడరు. పరీక్షలనగా నిటువంటివె యను విశ్వాసము కుదిరినవారై మనదేశమందలి పాఠశాలలయొక్కయు కళాశాలలయొక్కయు నధ్యక్షులు స్వదేశస్థులయినను పైయధికారులు జరపుపరీక్షావిధానమునందు మార్పులు కలిగించుటకెట్టిప్రయత్నములు సలుపకపోవుటయెగాక తాము జరపుపరీక్షలయందును నతిక్రూరముగ నడచుకొనుచు పరీక్షలను గొప్పజాతరలుగ మార్చివేయుచున్నారు. ఇట్టి యద్భుతవిద్యాధికులమూలమున దేశమందు విద్యావ్యాపన మెన్నటికయినను కాగలుగునని యాశించుట వట్టిభ్రమ. పెదబాపయ్యగారు లోవర్ సెకండరీపరీక్షసంబంధముగ నెంత భీతిల్లియుండినను, మనస్థైర్యము కలవారగుటచే మొదటితూరియె యందు జయముగాంచిరి. బుద్ధి తెలిసిన తరువాత ఆయన మేడలు, మిద్దెలు కలిగి కొంతవరకు పట్టణాకారము దాల్చినయూరును దర్శించినది పరీక్షకొరకు గుంటూరుకు వెళ్ళినప్పుడే. గుంటూరుకు కొంతదూరములో మార్గమధ్యమం దుండగానె కాన్పించు గుంటూరుకళాశాలాశిఖరమును ఆయన జూచి యది యెట్టిదోయని యూహించుకొనుచు తుదకు దగ్గరకుపోయి పూర్తిగగాంచి కొంతవిస్మయము జెందియుండును. అచటి రైలుస్టేషనుకు వెళ్ళి రైలుబండ్లను ఇంజనులను కనుగొని యద్భుతపడి తమబాపట్లకు

గూడ నెప్పుడు రైలు వచ్చి బండ్లప్రయాణమువలని బాధలు తొలగునాయని తలపోసియుండును. అక్కడి లోతుబావులలో తొంగిచూచినప్పుడు కండ్లు తిరిగి ఆయనకు గుంటూరునెడ కొంతయసూయ పుట్టి తమబాపట్లే మంచిదని తోచియుండ వచ్చును.

బ్రాహ్మసమాజమునందును సంఘసంస్కరణమునందును అభిమానము గలిగియుండిన వల్లూరి నరసింగరాయడు గారు బాపట్ల లోవరు సెకండరీస్కూలుకు ప్రధానోపాధ్యాయులుగ పెదబాపయ్యగారు లోవరు సెకండరి చదివిన సంవత్సరమంతయు నుండిరి. నరసింగరాయడుగారి కిటీవల కొంత కాలమునుండి యభిప్రాయములందు మార్పుకలిగి యెట్టి మతసంఘసంస్కరణోద్యమములతోడ సంబంధము లేకపోయినను, పూర్వము వారు మతసాంఘికవిషయములనుగురించి మహోపన్యాసము లొసంగుచు సంస్కారభావములను వెదజల్లుచుండెడువారు. కీర్తిశేషులయిన బొప్పూడి వెంకటప్పయ్యగారిచే ౧౮౭౮ వ సంవత్సరములో బాపట్లయందు స్థాపింపబడి యప్పుడు నడచుచున్నట్టి బ్రాహ్మసమాజముయొక్క యుపాసనాసభలయందు నరసింగరాయడుగారు పాల్గొనుచుండిరి. చక్కనిబోధనాశక్తి గలిగి బాలురకు నేర్పుతో విద్యగరపుచు తమకును బాలురకును సంబంధము

పాఠశాలలో నున్నంతవరకె యని తలంపక బాలురతో నతిసఖ్యముగ బయటను మెలగుచుండిరి. విద్యార్థులు వారిగృహమునకు మిక్కిలి స్వేచ్ఛతో వెళ్ళి వారితో చదువువిషయములోనె గాక యితరవిషయములలోను ముచ్చట లాడెడువారు. పెద్దపులివలె కనబడి పిల్లలను దరికి రానీయకుండ భయపెట్టినగాని తమ పెద్దరికమునకు లోటువచ్చునని భ్రమపడు నుపాధ్యాయులకును నరసింగరాయడుగారికిని నెంతయొ వ్యత్యాసము కలదు. ఇతరబాలురతో బాటు పెదబాపయ్యగారు కూడ వారిగృహమున కరిగి వారితో విశేషకాలము గడపుచుండిరి. వారియెడ పెదబాపయ్యగారు అందరికంటె నెక్కువయభిమానము కలిగియుండిరని యితరవిద్యార్థులనుకొనుచుండిరి. ఇప్పుడు బాపట్లలో న్యాయవాదిగానున్న రామరాజు చెంచు రామయ్యగారు పెదబాపయ్యగారి సహపాఠకులై ఆరోజులలో వారితో నెక్కుడు స్నేహము కలిగియుండెడివారు. నరసింగరాయడుగారి ప్రేమస్వభావముచే నాకర్షింపబడి వారితో నెక్కువ చేరిక యగుచున్న బాలుర కోమలహృదయములందు వారి సంస్కరణభావములు కానరాకుండ కొంతవరకు ప్రవేశించెనని నమ్మదగియున్నది. అప్పుడు నాటుకొనిన యభిప్రాయములె చెంచు రామయ్యగారియందు నెట్టి యాటంకమునకు లోనుగాక త్వరలో వారి

హృదయమును కొంతవరకు వశపరచుకొనగలిగి వారిమూలమున బ్రాహ్మసమాజోద్యమమునకు గుంటూరులోను బాపట్లలోను ఆ ప్రాంతమున నితరచోట్లను కొంతవ్యాపనము కలిగెను. పెదబాపయ్యగారు పూర్వాచారబద్ధులై యుండుట వలన అంతసులభముగ మార్పుజెందలేదు. అదిగాక నవీన భావము లెక్కుడ నంటిపోవునో యని యింటివద్ద పెద్దవారు ఆయనవిషయమున నెక్కుడు శ్రద్ధతీసికొనిరి. ఆయన చురుకయినవాడుగాను, ప్రత్యక్షముగ కాన్పించు త్రికరణశుద్ధికలవాడుగాను మొదటినుండియు నుండెనని వృద్ధులయి విశ్రాంతి గైకొని ప్రకృతము రాజమహేంద్రవరములో నివసించుచున్న నరసింగరాయడుగారు ఆయననుగురించి మాటాడుచు నాతో అనిరి.

ఈ బాల్యకాలములో సహితము పెదబాపయ్యగారు స్వతంత్రబుద్ధితోనె చరించుచుండిరి. నరసింగరాయడుగారు దాక్షిణాత్యులయిన ఒకఅయ్యరుకు బదులుగా బాపట్లపాఠశాలలో నుపాధ్యాయులుగా నియమింపబడిరి. నరసింగరాయడుగారు పనిలోచేరిన కొన్నిమాసములకు ఆ అయ్యరు తిరిగివచ్చునని తెలిసెను. నరసింగరాయడుగారిని విడుచుటకు గ్రామములోని పెద్దలకును, పాఠశాలవిద్యార్థులకును ఇష్టము లేకుండెను. వారిని నిలుపుకొనుటకు పెద్దలు చేయవలసిన

ప్రయత్నములు పెద్దలు చేసిరి. పిన్నలుకూడ తమకు తోచినట్లు తాము ప్రయత్నించిరి. ఒక మహజరును తయారుచేసిరి. చాలమంది బాలురు సంతకముచేసి దానిని పెదబాపయ్యగారి యొద్దకు తీసికొనివచ్చి సంతకముచేయుమని కోరిరి. అది యంతయు ఆయనచదివి, 'ఈకోరిన యేర్పాటు నాకిష్టమె. నరసింగరాయడుగారిని మిక్కిలి ప్రేమింతునని మీకూ తెలుసును. కాని యీ మహజరుపనికి బాలురమైన మనం పూనుకోకూడదని నాకు తోస్తున్నది. నేను సంతకం పెట్టజాలను' అని చెప్పి మహజరు పట్టుకొని వచ్చినవారిని పంపివేసెను. ఆ కాగితముమీద రామరాజు చెంచురామయ్యగారును పెదబాపయ్యగారితోపాటు సంతకముచేయలేదు.

బాల్యమునందె తమకు న్యాయమని తోచినవిషయమున నింత మనోదృఢత్వము కనపరుపగలిగిన పెదబాపయ్యగారు భావిజీవితమందు ధర్మవిషయములందెంత ధైర్యస్థైర్యములతో నడచుకొనునో చదువరులె తెలిసికొనగలరు.

జీవనస్మృతి

౫వ ప్రకరణము

కళాశాలవిద్య

ఉన్నతవిద్యాసంపాదనమునకై బాపట్ల విడిచి యితర పట్టణములయందు ౧౮౯౮వ సంవత్సరము మొదలుకొని ౧౯౦౮వ సంవత్సరమువరకు పెద్దసెలవలు తప్ప యావత్కాలమును పెదబాపయ్యగారు గడపియుండిరి. ఆ కాలములో, అయిదువత్సరములు బందరులోను, ఒకసంవత్సరము గుంటూరులోను, నాలుగుసంవత్సరములు చెన్నపట్టణములోను, ఒకసంవత్సరము రాజమహేంద్రవరములోను ఆయన నివసించెను.

మేనమామ వెంకటప్పయ్యగారు బి. ఏ. చదువుట[illegible] బందరులో నుండవలసియుండుటచే వారితో పెదబాపయ్యగారచట నుండి విద్య నభ్యసించునట్లు మొదట నేర్పాటుచేయబడెను. నోబిలుకాలేజిలో జేరి నాలుగవ ఫారమును అయిదవఫారమును చదివిరి. తరువాత వెంకటప్పయ్యగారు బందరు విడువ తటస్థించుటచే, ఆయన బాపట్లసమీపమందున్న

గుంటూరులో ఒకసంవత్సర ముండి మెట్రిక్యులేషనుపరీక్షకు చదివి హాజరాయెను. కాని ఆయేడు పరీక్షలో తప్పిపోయెను. అందునకు ఊరునువిద్యాలయమును మారుట ముఖ్యకారణమై యుండవచ్చును. కాని ఆయపజయ మాయనకు అమితవిచారమును నలుగిరిలో తలయెత్తుకొని తిరుగలేనంత సిగ్గును కలిగించెను. నూటికింతమందిని ప్యాసుచేయవలెనని ముందుగ నిర్ణయించుకొని ఆనిర్ణయమున కనుగుణముగ పరీక్షకాగితములమీద దయాదాక్షిణ్యములు లేకుండ మార్కులువేసి విద్యార్థులయుత్సాహమును చంపుట కలవాటుపడిన పరీక్షాధికారులకు వారివిచారముగాని సిగ్గుగాని తెలియనేరదు. పరీక్షలలో తప్పిపోవుటవలన కలుగు నిరుత్సాహము ఎందరి తెలివితేటలను పూర్తిగ నాశముచేసి యుండునోగదా! పెదబాపయ్యగారు ఆసంవత్సర మతివైభవముతో గావింపబడిన చెల్లెలువివాహసంబంధమైన వేడుకల[illegible] పాల్గొనక యెవరికిని కనబడకుండ ఉగ్రాణపుకొట్టువద్ద వంటసామానులను ఇతరవస్తువులను అందిచ్చుచు ఆపెండ్లిదినములు గడపెను. ఎంతపరితాపము జెందెనో చూడుడు! కాని ఆయన దుఃఖముచే క్రుంగిపోక మరుసటిసంవత్సరము చదువునందు శ్రద్ధ నినుమడింపజేసెను. వెంకటప్పయ్యగారు బందరులో నుద్యోగమై అచటికి మరలవచ్చుటచే వారియధీ

నమం దుండి నోబిలుకాలేజిలో ౧౮౯౮ సంవత్సరమందు మెట్రిక్యులేషను తిరిగిచదివి పరీక్షలో మొదటితరగతిని తేరెను. పిమ్మట ఎఫ్. ఏ జ్యూనియరును సీనియరును అచటనె చదివెను. కారణాంతరములవలన ఎఫ్. ఏ పరీక్షకు పూర్వము కొంతకాలము కాలేజిహాస్టలులో భోజనము చేయుచు అచటనె నివసించెను. ఆపర్యాయము ఎఫ్. ఏ పరీక్షయందు కృతార్థుడు కాకపోయెను. స్వగృహములందు ఒకవిధమగుపద్ధతిని పెరిగినపసివారు విద్యకొరకు నితరగ్రామములకు పోయి యచట తగినసౌకర్యములు లేక ఆరోగ్యము చెడి చదువు సాగక పరీక్షలయందు తప్పిపోవుటను మనము సామాన్యముగ చూచుచుందుము. విద్య నేర్చుటకు మనదేశ సౌందర్యయు నాటంకములే; పెదబావయ్యగారుకూడ నిటువ టికష్టములకు లోనవుచు చదువునందు కొంత వెనుక పడవలసినవా రయిరి. కాని ఆయన మిగులపట్టుదల కలవాడగుటచే తాను చదువదలచిన విద్యనంతయు చదువగలిగెను. ఎఫ్. ఏ తప్పిపోయినతరువాత, ఆయన బందరులో నుండుట కిష్టపడక చెన్నపట్టణమునకు వెళ్ళి క్రిస్టియను కాలేజిలో ప్రవేశించి చదువనారంభించెను.

౧౯౦౦, ౧౯౦౧, ౧౯౦౨, ౧౯౦౩ సంవత్సరములు నాలుగును ఆయన చెన్నపట్టణమందు విద్యనార్జించుచు గడపెను. మొదటిసంవత్సరములో ఎఫ్. ఏ పరీక్షయందును, తరువాత రెండుసంవత్సరములలో బి. ఏ. పరీక్షయందును జయముగాంచెను. బి. ఏ లో తత్వశాస్త్రము చదివి మొదటి తరగతిని కృతార్థు డాయెను. ప్రకృతిశాస్త్రము ఉపాధ్యాయవృత్తికి మిక్కిలి యుపయోగముగా నుండునని తలచి అది మరియొకసంవత్సర మభ్యసించి యందును పట్టముబడసెను. ౧౯౦౩ సంవత్సరము ముగియునప్పటికి డబుల్‌గ్రాడ్యుయేటు అనగా రెండుశాస్త్రములందు పట్టభద్రుడాయెను. కళాశాలవిద్య ప్రారంభించినప్పటినుండియు తా నేవృత్తి నవలంబింపవలయు నని తనలోతాను విచారించుకొనుచుండెను. తోడిజనుల కెక్కువ యుపయోగకరమయిన వృత్తియందు ప్రవేశింపవలయునని ఆయన యాశయము. నానావిధములయిన వ్యాధులచే బాధపడుచు ఆదరపూర్వకముగ వైద్యసాహాయ్యము చేయు వైద్యులకొరకు నిరీక్షించురోగులు మనదేశమున నెందరో గలరు. వైద్యముద్వారా మానవసేవ చేయుటకు నెక్కుడవకాశ మున్నది కావున, వైద్యవిద్య నేర్వవలయునని ఆయన మొదట తలపెట్టెను? కాని తనకు తగినంత దేహారోగ్యము లేదని డాక్టరులు చెప్పినందున ఆచదువు మానుకొనెను. పిమ్మట ఉపాధ్యాయవృత్తియందు జేరుటకు నిశ్చయించెను. వృత్తి నిర్ణయించుటలో తన కెక్కువడబ్బు

వచ్చుసాధనముగ నది యుండవలెనని ఆయన యెన్నడును తలపోసియుండలేదు. అటువంటి వృత్తులనుగురించిన యాలోచన ఆయనమనస్సులోనికి రాలేదనియె నుడువవచ్చును. దేశపురోవృద్ధి ముఖ్యముగ నెవరిపై నాధారపడియున్నదో యట్టి యువకులతో నధికసంబంధము గలిగి వారికి విద్య గరపుటకే గాక సద్వర్తన మలవడజేయుటకును ఉపాధ్యాయవృత్తి మిక్కిలియనుకూలముగ నుండునుగాన ఆయనదృష్టి దానిమీదికి మరలెను. అందునకు వలసినవిద్య నభ్యసించెను. మరియు ౧౯౦౪ వ సంవత్సరములో రాజమహేంద్రవర బోధనాభ్యాసనకళాశాలయందు ఎల్. టి పరీక్షకు జదివి యాసంవత్సరాంతమున నందు తేరెను.

విద్య నేర్చుచుండినకాలములో తా నొంటరిగా చెన్నపట్టణమువంటి పెద్దపట్టణములో వసించినప్పుడు గూడ ఆయన తనకర్తవ్యములందు అమితశ్రద్ధ గలిగి నియమానుసారముగ జీవితముగడపెను. తన కక్కరలేని యితరవిషయములలో నేమాత్రము జోక్యము కలిగించుకొని తనకాల మెప్పుడును వ్యర్థముచేసికొనలేదు. తనకాల మొకక్రమపద్ధతిని వినియోగించుచు నేవేళల కేపనులు జేయ నిర్ణయించుకొనునో నాయా వేళల కవి తప్పక జేయుచుండెను. సంవత్సరము మొదటిదినమున కెన్నిగంటలు చదువునో సంవత్సరాంతమున పరీక్ష

సమయములో సహితము దినమున కన్నిగంటలె చదివెడువాడు. పరీక్షసమీపించుచున్న దను నాతురతతో విద్యార్థులు సాయంకాలసమయములందు మేడలమీద పుస్తకమొకచేత పట్టుకొని చదువుచు తలదిమ్మెక్కి నొప్పిపెట్టుటచే రెండవచేతితో నొక్కుకొనుచు బాధపడుచుండ, ఆయన ప్రతిసాయంకాలము షికారుకు వేళకాగానె బయలుదేరి వెళ్ళుటను వారు జూచి యెంతయు నాశ్చర్యమును ఈర్ష్యయు జెందుచుండిరి. ఎల్. టి. పరీక్షకుముందు ఆయన కెక్కువ జబ్బుచేసి చివరిమాసములలో నేమియు చదువుటకు వీలుగాక పరీక్షకు వెళ్లుటకును అశక్తుడుగా నుండియున్నప్పుడు, పరీక్షకు వెళ్ళి బాధపడవద్దని మిత్రులు సలహాచెప్పినను, సంవత్సరారంభమున పుస్తకములు చదివి తాను వ్రాసిపెట్టుకొన్న విషయములను పరీక్షదినమున నొకపర్యాయము చూచుకొని పరీక్షకు హాజరయి యాసంవత్సర మందు గెల్పొందగలిగెను. వేళతప్పకుండ రాత్రులందు ౯ గంటలకో ౧౦ గంటలకో పరుండి చీకటితో నిద్రలేచి కాల్యకృత్యముల తీర్చుకొనువాడు. ఆవశ్యకమయినంత నిద్రయు పరిశ్రమయు కలిగియుండి మనస్సు నిర్మలముగాను ఉత్సాహవంతముగాను నుంచుకొన్నప్పుడు ఒకడు ఒకగంట చదివినది వాడె అలసి విసుగుజెంది యున్నప్పుడు కొన్నిగంటలు చదివినదానితో సమాన

మగునని ఆయన తరచుచెప్పునట్టి సదుపదేశము. ఈవిషయము విద్యార్థులు ముఖ్యముగ గమనింపవలయును. ఆయన యెవరెవరివద్ద విద్యనభ్యసించెనో వారెల్లరి ప్రేమకును గౌరవమునకును తనపరిశుద్ధవర్తనముచే పాత్రుడగుచుండెను. లోవరుసెకండగి చదివినప్పుడు నరసింగరాయుడుగారికి కలిగిన సదభిప్రాయమె ఆయనయెడ నితరగురువులందరు కలిగియుండిరి. చెన్నపురి క్రిష్టియన్ కాలేజీలో ఆయన కధ్యాపకులుగా నుండిన మఫాట్ గారును స్కిన్నరుగారును మెస్టన్ గారును డాక్టరు మిల్లరుగారును ఆయనయందమితానురాగమును కలిగియుండిరి. ఆయన ఆకాలేజి విడిచినతరువాత ఆయనబంధువులు ఆయనతో తమకుగల బంధుత్వమును కళాశాలాధ్యక్షులకు తెలుపుకొనినంతనె సులభముగ నందు చదువుకొనుటకు ప్రవేశమును బడయగలిగిరి. తనగురువుల సన్మానమునకు తగియుండుటకు ఆయన వారి గుణవిద్యావిశేషముల గ్రహించి వారియెడల నమితశ్రద్ధాభక్తుల జూపుటయె యని వేరుగ జెప్పనక్కర లేదు. తన శరీరమందు అస్వస్థతగా నుండియు, డాక్టరు మిల్లరుగారు స్కాట్లెండుదేశమునకు పోవనైయున్నతరి ౬-౩-౧౯౦౭ తేదిన వారిని దర్శించి నాడు ఆసందర్భముగ తన దినచర్యపుస్తకమునం దీక్రిందివిధమున వ్రాసికొనెను.

"డాక్టరు మిల్లరుగారిని దర్శించితిని. వారు స్కాట్లెండుకు పయనమగుచున్నారు. వృద్ధాప్యమున తమకార్యక్షేత్రమును విడిచిపోవుటకు తమ యయిష్టమును కనపరచుచు వృద్ధులగు నామహామహునకు నుడివిన నుడువు లాలకించు టెంతయు విచారకరముగనుండెను. వారియందలి మృదుస్వభావము సువ్యక్తమగుటను కూడ గాంచితిని. నేను దుఃఖము నాపుకొన లేకపోతిని. యథార్థమయిన మహాపురుషుల నెరుంగుభాగ్యము నాకు ప్రసాదించినందులకు ఈశ్వరునకు ధన్యవాదములు."

పెదబాపయ్యగారు తమగురువులయెడ నిట్టిసద్భావము కలిగియుండుటవలననె ఆయన వారిమన్ననలకు పాత్రులగుటయె గాక వారినుండి గ్రహింపవలసిన సద్విషయములను గ్రహించి తమబుద్ధిని వికసింపజేసికొన గలిగెను. ఆయన పూర్వాచారములందు మొదటినుండయు దృఢవిశ్వాసము కలిగియుండి వానిని హృదయపూర్వకముగా ననుసరించుచుండెను గాన, తమగురువులు తెలిపినయభిప్రాయములెంతయుత్కృష్టము లయినవయినను విచక్షణముచేయక యెప్పుడును స్వీకరింపలేదు. స్వకీయములయిన విశ్వాసములు లేనివారు తామెవరి ననుసరించి జీవింతురో వారివలె నంధప్రాయముగ మారిపోవుదురు. పెదబాపయ్యగా రట్టితెగకు

జెందినవారు కారు. **మొదటినుండియు** ఆయన తనవ్యక్తిత్వము కాపాడుకొనుచునె యుండెను. వల్లూరి నరసింగరాయుడుగారివద్ద బాల్యమునందును సర్ డాక్టర్ రఘుపతి వెంకటరత్నమునాయుడుగారివద్దను ప్రస్తుతము పిఠాపురము రాజాగారి కళాశాల ప్రిన్సిపాలుగా నున్న డాక్టర్ వేమూరి రామకృష్ణరావుగారివద్దను కొంతవయసు వచ్చినప్పుడును విద్యనభ్యసించుట తటస్థించి వారియందు భక్తిశ్రద్ధలు కలిగి యుండినను వారియొక్క బ్రాహ్మసమాజాభిప్రాయములను మాత్రము స్వీకరించియుండలేదు. మీదుమిక్కిలి వారి శుశ్రూష సలుపుకాలములో వారియభిప్రాయములను విమర్శించి ఖండించుచుండెను. అటులనె క్రిస్టియన్ కాలేజిలో గొప్ప క్రైస్తవమతప్రచారకులదగ్గర చదివినప్పుడు వారి నెంతగౌరవించినను వివేచనాశూన్యముగ వారి ననుకరింపలేదు. తమకు భక్తిభాజనులయినవారు భిన్నమతావలంబికులయి తా మంగీకరింపజాలని పద్ధతులు కలిగియున్నను వారిని భక్తితో సన్మానించు స్వభావు లగుటచే పెదబాపయ్యగారు వివిధాభిప్రాయములను పరిశీలించుచు సత్యాన్వేషణముచేయుట కెక్కువ యవకాశమును బడయగలిగిరి. ఆయన పొందిన జ్ఞానాభ్యున్నతి కంతకును అదియె ముఖ్యకారణము. స్వాభావికమగు అభివృద్ధి నభిలషించువారు పెదబాపయ్యగారి

మార్గమునె యనుసరింపదగును.

నియమపూర్వకముగా చదువుకొనుటకు అలవాటు పడియుండుటచే ఆయన పరీక్షలకు కావలసిన పుస్తకములనే గాక జ్ఞానాభివృద్ధికి తోడ్పడు నితరగ్రంథములనుగూడ చదువుటకు కాలము కలిగి యుండగలిగెను. కొన్ని నిమిషములయినను ఆయన యెప్పుడును వ్యర్థముగ గడపియుండ లేదు. ఏదో సద్గ్రంథ మాయన చదువుచుండని దినములు లేవని చెప్పవచ్చును. తమబంధువులును మిత్రులును సెలవుదినములలో చీట్లపేక ఆడుచు కాలయాపనము సేయుచుండ, తా నొకగదిలో ప్రత్యేకముగ గూర్చుండి నిశ్చలమనస్సుతో గ్రంథపఠనము గావించుచుండెడివాడు. ఆయన వర్తనము మొదట కొంతవిపరీతముగ తోడివారలకు గాన్పించినను, వారెల్లరు ఆయన దీక్షను కనుగొని ఆయనయం దతిగౌరవము చూపియుండిరి. కొందరు అన్నివేళల చదువుచు పుస్తకముల నంటియుండు పురుగులవలె నుండి యితర వ్యాపారములన్నియు కట్టిపెట్టి తుదకు ఆరోగ్యమును కూడ చెడకొట్టుకొందురు. ఆయన యెప్పుడు నటుల చదువలేదు. ప్రతిదినము నిర్వర్తింపవలసిన దేహపరిశ్రమ, స్నానము, సంధ్య, సాంఘికసేవ మొదలగు విధులలో చదువు ఒకటియని తలంచెను. దేని కెంతకాలము వినియోగింపనగునో యంతకాలమె వినియోగించుచు

ఆయన సమగ్రమయిన యభివృద్ధిని బడసెను. బుద్ధినిమాత్రమె పెంపొందించి శరీరమును ఆత్మను ఆయన కృశింపజేయలేదు. సర్వాంగోన్నతి జెందుచుండుటచే, ఆయనజీవితము విద్యార్థి దశనుండి కూడ రమ్యముగనుండి యితరుల కాకర్షకముగ నుండెను. కేవలము పరీక్షలకు వలసిన గ్రంథములనె చదివి చదివి వానియం దున్నతశ్రేణీయం దుత్తీర్ణులయినవారు ఇతర విషయములం దెట్టియభ్యున్నతియు పొందకుండుటను చూచుచుందుము. వారిజీవితములు వికృతాకారములుదాల్చి హృదయరంజకములుగ నుండవు. పెదబాపయ్యగారు పట్టపరీక్షల కావశ్యకమయిన చదువుతోపాటు ఎట్టియన్యవిధమయిన చదువునుకూడ గలిగి జీవితమును అందముగ పరిణమింపజేసి కొనెనో దానిని గురించి ప్రత్యేకముగ పాఠకులు విన నభిలషింతురుగాన రాబోవు ప్రకరణమున నది కొంత వివరింపబడును.

జీవనస్మృతి

౬వ ప్రకరణము.

సర్వాంగపరిజ్ఞానము.

బాపయ్యగారికి మొదటినుండియు ఆంగ్లభాష నేర్చుటలో నభిరుచి మెండు. ఆయన పరీక్షలకు నేర్పరుపబడిన పుస్తకములు మాత్రమెగాక తనంతట తాను చదివి అర్థము చేసికొనగల కథలపుస్తకములను జీవనచారిత్రములను ఇతర గ్రంథములను క్రిందితరగతులనుండి గూడ పఠించుచుండెడువాడు. ఆంగ్లభాషాపరీక్షలందు మంచిమార్కులు తెచ్చుకొనువాడనియు, సంభాషణమునందు వ్యాకరణయుక్తముగను అలంకారసహితముగను స్వచ్ఛమయినయాంగ్లమును చిన్నప్పటినుండియు నుపయోగించువాడనియు, ఆయన బాల్యమిత్రులు చెప్పుదురు. ఈయభినివేశము సుప్రసిద్ధ గ్రంథకర్తలును కవులును ఆంగ్లమున రచించిన గ్రంథములను తన మనోవికాసమనుసరించి యెప్పటికప్పు డాయనను చదువునట్లు చేసినది. మతము, తత్వము, భక్తి, నీతి, సంఘము, రాజ్యాంగము, కేవలభాష మొదలగువిషయములకు సంబం

ధించిన జ్ఞానము ముఖ్యగ్రంథములను జదివియు గురువరేణ్యుల నాశ్రయించియు ఆయన బడసెను.

ఆయన బందరులోనున్నప్పుడు అచటి హిందూమత బాలసమాజములో సభ్యుడుగా నుండెడివాడు. వల్లూరి నరసింగరాయుడుగారిద్వారా ఆయనకు సంస్కరణాభిమానమేమయిన నలవడియుండిన ఆకొంచెమును వెంటనె తొలగించుటకు మామ వెంకటప్పయ్యగారు ఆయన బందరుకు రాగానె హిందూమతబాలసమాజముతో సంబంధముపెట్టుకొనునట్లు చేసిరి. ప్రాచీనహిందూవిశ్వాసములందును ఆచారములందును అదివరకె ఆయనకు మనసు కుదిరియున్నది కావున, ఆసమాజమునందు పేరునకుమాత్రము సభ్యుడుగా నుండక యెంతయొ యుత్సాహముతో పాటుపడెను. ఆసమాజమునందు ప్రధానహిందూమతగ్రంథములు సమకూర్పబడెను. ఆయన వానిని బహుశ్రద్ధతో చదివెను. తత్సమాజాధ్యక్షులుగ నుండినట్టియు, స్కూళ్ళయిన్స్పెక్టరుగా పనిచేసి కొలదికాలము క్రిందట కీర్తిశేషులయినట్టియు కలపటపు సుదర్శనరావుగారు, రాజమహేంద్రవరములో బాపయ్యగారి వర్థంతిసందర్భముగా ఒకసంవత్సరము జరుపబడినసభయందుమాటాడుచు, బాపయ్యగారు జ్ఞానసంపాదనమునందు కలిగియుండిన యాకాంక్ష అసాధారణమనియు, బందరు హిందూసమాజపుస్తకభాండా

గారములోని మంచిపుస్తకములన్నియు ఆయన చదివెననియు, పుస్తకములు చదువునప్పు డేవైనసందేహములు తోచిన వానిని తీర్చుకొనుటకు ఆయన తమవద్దకు వచ్చి ప్రసంగించుచుండిన సమయములలో తాము ఆయనకు క్రొత్తగా నేర్పిన దానికంటె ఆయనవద్దనుండి తాము నేర్చుకొన్నదె యధికముగా గలదనియు, తమకంటె చిన్నవాడె యయినను ఆయనయందు తమకుగురుభావము జనించినదనియు, ఆయనకు కాలక్రమమున మతవిశ్వాసములందు తాము అంగీకరింపజాలని కొన్ని మార్పులు వచ్చియున్నను, నమ్మినప్రకారమాచరించు స్వభావము చనిపోవువరకు ఆయన నిలుపుకొనగలుగుటచే తమ కాయనయందు గౌరవము లేశమయినను తగ్గక హెచ్చినదనియు, ప్రశంసించిరి. మరియు మిత్రులు పింగళిలక్ష్మీనారాయణగారు బాపయ్యగారికి హిందూమతబాలసమాజముతో సంబంధమున్న దినములనుగురించి యీక్రిందివిధముగ తెలుపుచున్నారు.

"దేశిరాజు పెదబాపయ్యగారిని నేను ౧౮౯౪ సంవత్సరమున బందరులో గలిసికొంటిని. నే నింగ్లీషు చదువుటకు బందరు చేరితిని. బాపయ్య బాపట్లనుంచి వచ్చి తన మేనమామ యగు కామరాజు వెంకటప్పయ్యగారితో నివసించుచుండెను. అపు డాయన నాల్గవఫారము చదువుచుండెను.

నా కది స్కూలుకు బోవుదారి గనుక మధ్యాహ్నము కలియుచుంటిని. మరుసటిసంవత్సరము నేను కూడ నోబిలు కాలేజిలో ప్రవేశించితిని గనుక వీలగునపుడెల్ల కలియు చుంటిమి. ౧౮౯౭ సంవత్సరమున నన్ను ప్రోత్సాహపరచి హిందూమత బాలసమాజములో జేర్చెను. ఆ కాలమందు క్రయిస్తుమతమును పట్టుదలతో బాలురకు నేర్పుచుండెడి వారు. మన సనాతన ధర్మమును మాటిమాటికి నిరసించు టయే గాక మనపూర్వులను కడునీచముగా చులకన చేయు చుండిరి. గనుక మేము చదివెడు విద్యకంటె మతదూషణ, జాతిదూషణ ఎక్కువ నేర్చుకొనవలసి వచ్చినది. ఇట్టి క్లిష్ట సమయమున మాకు హిందూమతబాలసమాజము శరణ్య మైనది. మా కాలేజిలో నపుడు సి. డబ్లియు. ఎ. క్లార్కు దొరగారు ప్రిన్సిపాలుగా నుండిరి. రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు ప్రార్థనసమాజమును వెలకొల్పి శిష్యవర్గమును పోగుచేయుచుండిరి. వీరును మన మతమును నిరసించుచుండిరి. బాలసమాజములో బాపయ్యగారు ఒక వత్సరము లైబ్రేరి యనుగను తరువాత సెక్రెటరిగను నియమింపబడిరి. ఆయన మొట్టమొదట మోక్షముల్లరుగారి 'ఇండియ—అది మన కేమి చెప్పగలదు' (India—what it can teach us) అనెడు గ్రంథమును బాగుగ చదివెను. బ్రాడ్లాగారి వ్యాస

ములుకూడ ఆయనచింతనము దిట్టపరచినవి. కాని నావలె పాదిరీలతో విరోధము పెట్టుకొనుట కిష్టపడలేదు. బాపయ్య లాగులు వేయుచుండెను. బ్రాహ్మణబాలురలో లాగు లానాడు అరుదు. చిన్నతనములో బాపయ్యకు దుస్తులందు, ఆటలందు కడుప్రేమ. పరమపవిత్రమగు హృదయమును గల్గియు గంభీ రత లేకుండెను. ఆయనయందు నిరుపమానమగు తేజోవికాస ముదయించునని నేను తలచియుండలేదు. కాని వెంటనె ఒక చిన్నసంగతి సంభవించినది. తన గోళ్ళు పిప్పిపట్టి నానాటికి రక్తవిహీనమై, గుల్లలై పిప్పిచే కృశించిపోవ నారంభించెను. అపుడె తన దృష్టిని బాహ్యలోకమునుండి తన శరీరమునకు మరల్చుకొనవలసి వచ్చెను. తనతండ్రి పిన్నవయసుననె మృతి జెందెను. జాడ్యము, అందవికారము, మృత్యుభయము మనసును గట్టిగా దట్టియుండనగు. బాలసమాజములోని సత్సాంగత్యము, నాయుడుగారి ప్రబోధము, తన శరీరదౌర్బ ల్యము, వీ టన్నిటికంటెను ఆయనను పక్వముచేసిన యాత్మ శక్తి మరియొకటి గలదు. ఆనాడు బందరులో సబుజడ్జిగా నొక బ్రాహ్మణోత్తము డుండెను. పవిత్రతకు, జ్ఞానమునకు, నిరా డంబరజీవనమునకు ఆదర్శకుడని చెప్పతగు మహానీయుడు. ఆయన ఉదయము మూడుగంటలకె లేచి కోర్టుతీర్పుల నైదిం టికి వ్రాసి తన నిత్యకృత్యములను పదింటికితీర్చుకొని తొమ్మిది

న్నర గంటలవరకు మాకుమతబోధచేయుచుండిరి. సనాతన ధర్మమును నూరిపోసి మాయందు ఆత్మచింతనము గలుగజేసిరి. ఈమహాత్ముని ఇప్పుడు అడయారులో జూడనగును. వీరు మనయాంధ్రులలోకెల్ల గొప్పవారని నానిశ్చయము. ఈపావన మూర్తిస్పర్శచే బాపయ్యయందు జ్ఞానాగ్ను లుదయించినవి. సత్యాన్వేషణ మారంభమైనది. నామరూపముల నతిక్రమించిన దివ్యదృష్టి కలిగినది. సాధ్యాసాధ్యముల లెక్క జేయని ధైర్యస్థైర్యము లాయన హృదయమందు బ్రతిష్ఠింపబడినవి. సత్యము, నీతి నిత్యజీవనాభిలాష ఆ హృదయమందు జ్వాలలై వెలుగ సాగెను."

హిందూమతప్రముఖులవలనను, హిందూమతగ్రంథములవలనను బాపయ్యగారెట్లు ధర్మజ్ఞానము సంపాదించినదియు, ఎంతటి యాత్మాభివృద్ధి గాంచినదియు పైని వివరింపబడినయంశములు సూచించుచున్నవి. బందరులోనున్న ఆకాలమందు బ్రాహ్మసమాజికులతో సంబంధముగలిగి వారి ద్వారా బ్రాహ్మసమాజమునుగురించియేమియునేర్చుకొనకపోయినను వారికి దూరముగ నుండి విమర్శనాపూర్వకముగ వారు చెప్పు సిద్ధాంతములు గ్రహించెను. ఆయన నోబిలుకాలేజిలో చదివెనుగాన, క్రైస్తవులకు వేదతుల్యమగు బైబిలు

గ్రంథమును పఠించుటయు, విద్యాధికులగు క్రైస్తవమతబోధకుల ప్రసంగములు దినదినము వినుటయు ఆయనకు విధాయకమాయెను. మన ప్రాంతములందున్న యితరక్రైస్తవ పాఠశాలలోవలె గాక నోబిలుకాలేజిలో మతబోధవిషయమున నెక్కువశ్రద్ధ తీసికొనబడును. ప్రతిదినము కాలేజి తెరువబడినతోడనే బైబిలునుండి యేదోముఖ్యభాగము చదువబడి దానినిగురించి పదునైదునిమిషములు ప్రసంగింపబడును. ఆ ప్రసంగములు ప్రార్థనలతో ముగింపబడును. వానిని వినుటకు విద్యార్థులందరు తప్పక రావలెను. ఇవిగాక బైబిలుపాఠములు దినమున కొకగంట చెప్పబడును. క్రైస్తవమతమందెంతయసూయ గలవారైనను, ఆకాలేజిలో చేరినతరువాత జీససుక్రీస్తుయొక్క సందేశమును గూర్చియు, ఆయన యద్భుతచారిత్రమును గూర్చియు, బైబిలుగ్రంథములోని యితరముఖ్యవిషయములనుగూర్చియు తెలిసికొనకుండ తప్పించుకొనుటకు వలనుపడదు. బాపయ్యగారు క్రైస్తవపాదరీలతో విరోధముపెట్టుకొనక సహనశీలురై చరించియుండిరిగాన, బైబిలును బాగుగచదివియు, పాదిరీల బోధలను చక్కగ నాలకించియు, ఇతర క్రైస్తవ గ్రంథములను పరిశీలించియు ప్రధానములైన క్రైస్తవాదర్శములను మనోగతముచేసికొనిరి. బందరునుండి చెన్నపట్టణమునకు వెళ్ళినతరువాత

డాక్టరు మిల్లరు, మొదలగు క్రైస్తవ మహామహుల శుశ్రూష సలిపియుండిరి. వారితో నత్యంతమైత్రి గలిగి వారి జీవితములయందే క్రైస్తవమత ప్రభావమును కనుగొనిరి. క్రైస్తవమతమునందు ద్వేషము చూపకపోవుటయె గాక యభిమానము కనపరచుస్థితికి వచ్చిరి. తాము చదువు ముగించి క్రిస్టియన్ కాలేజిని విడిచినతరువాతకూడ ఆ కాలేజితో సంబంధము మానలేదు. ౧౯౨౫ సంవత్సరము డిశంబరు ౨౭ వ తేదిని జరగిన ఆ కళాశాలయొక్క యుత్సవదినమున చెన్నపట్ణమునకు వెళ్ళి యందు పాల్గొని యావజ్జీవితసభ్యులుగ జేరిరి. క్రైస్తవమతసారము బాపయ్యగారు పూర్తిగ గ్రోలిరని నిస్సంశయముగ జెప్పవచ్చును. ఆంగ్లభాషయం దున్నయభిగుచియేమి, ధర్మచింతనమందుగల యాసక్తియేమి బైబిలును ఇతర క్రైస్తవగ్రంథములను కూలంకషముగ వారు చదువుటకు కారణములయి జీససుయొక్క ప్రబోధమును వ్యక్తపరచుటయందును, బైబిలులోని మహావాక్యముల నుదాహరించుటయందును అనర్గళశక్తిని వారికి సమకూర్చినవి.

బాపయ్యగారికి ప్రొఫెసర్ లక్ష్మీనరసునాయుడుగారి పరిచయముగూడ చెన్నపురిలో గలిగినది. వారియెడ భక్తి భావము గలిగి వారిని దర్శించుచు వారివలన కొంతప్రబోధము బడసిరి. లక్ష్మీనరసునాయుడుగారు బౌద్ధమతాభిమానులయి తద్గ్రంథపరిశోధనము విశేషముగ సలిపిన వారనియు, సంస్కరణాభిమానులనియు చదువరులు విని యుందురు. బాపయ్యగా రప్పుడు నూతనముగ వ్యక్తపరచుటకు మొదలిడిన సంస్కరణాభిలాషకు గౌతమబుద్ధుని జీవితాశయములు తోడ్పడియుండును.

కందుకూరి వీరేశలింగముపంతులుగారితో వారివద్ద విద్య నభ్యసించుటమూలమున గాని యింకేవిధమున గాని తమకు సాంగత్యము కలుగకపోయినను, తమంతట తాము వారు చెన్నపురిలో నున్నసమయమున వారివద్ద కేగి వారి పరిచయము చేసికొనిరి. అచట స్థాపింపబడియున్న దక్షిణ హిందూదేశబ్రాహ్మసమాజముతో సహితము సంబంధము పెట్టుకొనిరి. తత్సమాజోపాసనలకు పోవుచు, బ్రాహ్మ సమాజకుల ప్రసంగముల నాలకించుచు స్వయముగ బ్రాహ్మసమాజగ్రంథముల పఠించుచు, పరిశుద్ధాస్తికభావమును నవయుగమున ప్రచారముచేయుచున్నది బ్రాహ్మ సమాజమని గుర్తించిరి. వీరేశలింగముపంతులుగారు తమ స్వీయచరిత్రయందు వ్రాసిన యీక్రిందివాక్యములు బాపయ్యగా రానాడు కలిగియుండిన చిత్తవికాసమును స్వతంత్ర బుద్ధిని స్పష్టీకరించుచున్నవి.

"ఈకాలములో దేశిరాజు పెదబాపయ్యగారు నాకు

పరిచితులయి మాయింటికి కించుమించుగాఁ బ్రతిదినమును వచ్చుచుండెడివారు...... నేను దక్షిణహిందూస్థానబ్రాహ్మసమాజమునకుఁ బ్రధానాధ్యక్షుఁడను. బాపయ్యగారు బ్రాహ్మసమాజాభిమానులయి చెన్నపట్టణములో విద్యార్థులలో నొకసమాజమును స్థాపించి దానికి నన్ను తఱచుగాఁ దీసికొని పోవుచుండెడివారు. ఈసంబంధమునుబట్టి బాపయ్యగారు పలుమాఱు మాయింటికివచ్చుచు నాయం దత్యంతగౌరవము గలవారయి నేను చెప్పినపని నత్యాదరముతోఁ జేయుచుండెడివారు. ఇటువంటి కార్యములయందు వీరిట్లు నాకు సాయపడుట నేను చెప్పితినన్న హేతువుచేతనే కాదు. సమస్త సత్కార్యములయందును స్వతంత్రముగా నీయనకే యత్యంత ప్రీతి యుండెను. ఈయన యుత్సాహమును సుగుణసంపదను గార్యైకతత్పరతను జూచి యీతడు ముందు నేను పూనిన సంస్కారకార్యమును సమర్థతతో నిర్వహింపఁగలవాఁ డగునని తలఁచితిని.''

పంతులుగారు తెలిపిన యంశములనుబట్టి బ్రాహ్మసమాజముతోడను తమతోడను సంబంధముగలిగి బాపయ్యగారు ఉదారధర్మజీవనము నలవడజేసికొనుటకు చెన్నపురిలో విద్యనభ్యసించుకాలముననె ప్రారంభించిరని నిర్ధారణయగుచున్నది.

మతవిషయమునగాని నైతికవైజ్ఞానికసాంఘికరాజకీయాదివిషయములందుగాని బాపయ్యగారు చదివినపుస్తకముల పేరు లిచ్చుటకు ఇట్టిగ్రంథరచన వారు మృతినొందిన కొలదిదినములలోనె ప్రారంభింపబడిన సాధ్యమైయుండెడిది. తాము చదివిన ప్రతిగ్రంథమునందు ముఖ్యములయినభాగములకు పెన్సిలుగుర్తులు పెట్టుటయు, ప్రక్కను అచటచట నేమయినవ్రాయుటయు వారికి అభ్యాసము. అంతియెగాక ముఖ్యమయిన గ్రంథములందలి భావములను సంక్షిప్తముగ వ్రాసిపెట్టుకొనెడువారు. అట్లు పఠించినగ్రంథములు సామాన్యముగ సొంతమునకు కొనినవెయగుటచే అవియన్నియు నొకబీరువాలో జాగ్రత్తగ కాపాడువారు. వారిమరణానంతరము అవి వదిలపరుపబడకపోవుటచే దాదాపుగ నన్నియు పోయినవి. అవి యుండినయెడల వారు చదివినగ్రంథములలో ముఖ్యమయినవి పేర్కొనుట సులభముగ నుండెడిది. కాని వారు గ్రంథసారాంశములు వ్రాసికొన్న నోటుబుక్కులలో నొకదానియందలి చినిగినకాగితములుకొన్ని లభ్యమయినవి. ఆకాగితములద్వారాను దినచర్యపుస్తకముద్వారాను వారీక్రిందిపుస్తకములు చదివినట్లు తెలియుచున్నది. (1) జాన్ స్టూవర్టుమిల్లు రచించిన స్త్రీలయొక్కదాస్యము (The Subjection of women) (2) డాక్టర్ చార్లెస్ బియర్డు

రచించిన మార్టిన్‌లూథర్ సంస్కరణము (Martin Luther and reformation) (3) జాన్ స్టూవర్టు మిల్లుగారి స్వీయ చరిత్ర (Autobiography) (4) ప్లేటో విరచితమయిన 'ప్రజాప్రభుత్వము' (Republic) (5) కార్లైలు వ్రాసిన ఫ్రాన్సుదేశవిప్లవము (French revolution) (6) జేమ్సు సేత్ లిఖించిన నైతికసిద్ధాంతము (Principles of Ethics) (7) తియడోరుపార్కరుయొక్క ధర్మోపదేశములు (Sermons) (8) బాలగంగాధరతిలక్, బిపినచంద్రపాలు మున్నగు రాజ్యాంగసంస్కర్తల రాజకీయ ప్రచురములు. (9) సర్ హెచ్. జె. ఎస్. కాటన్ ప్రకటించిన నవీనభారతవర్షము (New India) (10) జపానుచరిత్రము (11) ఫ్రాన్సిస్ పనరుకాబుయొక్క స్వీయచరిత్రము (12) బ్రహ్మానంద కేశవచంద్రసేనుని జీవనవేదము (13) వాషింగ్టన్ ఇర్వింగు రచించిన మహమ్మదుయొక్క జీవితము (14) దైనికశక్తి (Daily strength) (15) టెనిసనుకవిరచనలు (16) ప్రతాపచంద్ర ముజుందారు రచించిన ఆత్మనివేదనలు (Heart beats)- ఈపుస్తకములు వారుచదివినవానిలో చాలకొలదియై యున్నను వారి విద్యావ్యాపకము సర్వతోముఖముగ నుండెనని స్పష్టముగ తెలుపుచున్నవి. సాంఘికరాజకీయాది సర్వవిషయములనుగురించియు జ్ఞానము సంపాదించుటకు

వారు సదా కృషిసలిపిరి. మతసాంఘికరాజకీయపత్రికలను తెప్పించుకొని చదివెడువారు. నటరాజన్‌గారు ప్రచురించు ఇండియన్ సోషల్ రిఫార్మరు వారు శ్రద్ధతో చదువుచుండిన పత్రికలలో నొకటి. తమ చివరిసంవత్సరములలో రాజకీయయాందోళనము తీవ్రముగ జరుగుచుండినప్పుడు వందేమాతరమ్ పత్రికయం దెక్కుడాదరము జూపియుండిరి.

చెన్నపురిలో మహనీయులు తరచు గొప్పవిషయములను గురించి యుపన్యాసము లిచ్చుట తటస్థించును. బాపయ్యగారు వానిని తప్పకుండ విని వానిసారాంశములు వ్రాసియుంచుకొనెడువారని వారి మిత్రులవలన తెలియుచున్నది. ఈ యభ్యాసము వారిజీవితములో తుదివరకుండినటుల గాన్పించుచున్నది. దినచర్యపుస్తకమందు వారట్లు వ్రాసిపెట్టుకొన్న యుపన్యాససారాంశములుకొన్ని గలవు. ఆయుపన్యాసములలో వెంకటరత్నంనాయడుగారును పండిత శివనాథశాస్త్రిగారును బిపినచంద్రపాలుగారును ఒసంగినవి ముఖ్యమయినవి. భక్తిభాజనులయిన మహనీయులందరితో తమకు వీలయినంతవరకు పరిచయముచేసికొని వారితో సంభాషించుచు వారిద్వారా జ్ఞానముబడయుటయు బాపయ్యగారికిఅలవాటు. వారు కలకత్తాకు వైద్యముకొరకొకసారియు జాతీయసభల జూచుటకొకతూరియు వెళ్లి యచట ౧౯౦౭ సంవత్సరము అక్టోబరు నవం

బరు డిశంబరు మాసములును ౧౯౦౭ సంవత్సరము జనవరి ఫిబ్రవరి మాసములలో సుమా రొక నెలపదునైదురోజులును గడపినప్పుడు పండిత సీతానాథతత్వభూషణులతో నెక్కువ సాంగత్యము చేసి వారిద్వారా కలకత్తాలోని బ్రాహ్మసమాజ ప్రముఖులందరిని దర్శించి యుండిరి. కలకత్తా బ్రాహ్మసమాజికుల జీవనమునుండి యనేక సద్విషయములు గ్రహించిరి. గ్రంథములు నిర్జీవములయినవి. సత్పురుషుల జీవితములన్ననో సజీవగ్రంథములని చెప్పనొప్పును. ఈ జీవనవేదములను పఠించుటలో బాపయ్యగారికి చాలనేర్పుగలదు.

“నేడు మీవంటి సంపూర్ణ ఆత్మోన్నతి జెందిన పుణ్యపురుషుని కలసికొని పరమానందభరితుడ నైతిని” (I am happy for having met a whole-souled man like you to-day) అని ఒకపెద్దమనుష్యుడు బాపయ్యగారిని గురించి ప్రశంసాపూర్వకముగా నుడివిన వచనము యథార్థమని యెవ రంగీకరింపరు? కళాశాలవిద్య ముగియగానే విద్యార్థులు సాధారణముగ జ్ఞానార్జనమునుమాని ధనార్జనములో మునిగిపోవుదురు. బాపయ్యగా రట్లుగాక యావజ్జీవితమును విద్యార్థిగనె యుండి తమ యాత్మ వివిధాంగ పరిజ్ఞానముతో చిరనూతనత్వము జెందునట్లు కృషిసలిపిరి. వారి జీవిత మెవరి కానంద మొనగూర్పదు?

జీవనస్మృతి

౭వ ప్రకరణము

శారీరక నైతిక సాధనలు

బాపయ్యగారి యంతరధీశక్తి సమగ్రముగ వికాసము గాంచుటకు వారు విద్యావిషయమున సలిపిన మానసిక కృషియే ముఖ్యకారణమయినను, వారి నందులకు తగినవారినిగా జేసినది శరీరపరిశ్రమ యని చదువరు లిదివరకే గమనించియుందురు. ‘శరీర మాద్యం ఖలు ధర్మసాధనం’ అను నార్యోక్తియందు ఆయనకు పరమవిశ్వాసము గలదు. శరీరము ఆరోగ్యముగాను దృఢముగాను నున్నపుడే, మనసు గూడ ఆరోగ్యముగాను దృఢముగాను ఉండి జ్ఞానవిషయమున నెక్కువకృషి సలుపగలిగియుండునని ఆయన యనుభవపూర్వకముగ గ్రహించెను. శరీరవ్యాయామమును ఆయన జీవితములో రుగ్మతవలన అసాధ్యమయినప్పుడుతప్ప నెన్నడును మానలేదు. దేహపరిశ్రమ చేయుటకు ఆయన యువకులను సదా హెచ్చరించెడువాడు. శరీరసాధన లాయన యెట్టివి యేతీరున జేసియుండెనో యించుక తెలుపుట ప్రయో-

జనకరము. విద్యావ్యాసంగమున తగుల్కొని యన్నిసమయములందు తదేకదృష్టితో పాటుపడి విద్యయందు ప్రవీణత గాంచలేకపోయినను పరీక్షలం దుత్తీర్ణులగుటకు మాత్రము శక్తిని విద్యార్థులుపలువు రీకాలములో బడయుచున్నారు. వా రంతటితో తృప్తిజెందుచున్నారు. తాము పడెడుశ్రమ పూర్ణముగ ఫలప్రదమగుట లేదనియు మీదుమిక్కిలి తన్మూలమున శరీరము కృశించి తా మల్పాయుష్కు లగుచున్నామనియు వారు గ్రహించుటలేదు. అట్టివారలు బాపయ్యగారు శరీరనియమములందును వ్యాయామవిషయమునను తీసికొనిన శ్రద్ధను గమనించి జాగరూకు లగుదురు గాక! బాపయ్యగారు అనారోగ్యమయిన శరీరమునె పుట్టుకవలన పొందియుండిరి. జన్మించినదిమొదలు తల్లియొక్క పోషణము లేకపోవుటచే, ఆయన మరింత శరీరదౌర్బల్యమునకు లోనయ్యెను. సుమారు అయిదుసంవత్సరముల ప్రాయము వచ్చువరకు ఆయన తరచు దగ్గుతో బాధపడుచుండెను. కొంతవయసు వచ్చినతరువాత పుప్పిగోళ్ళ వ్యాధివలన నీరసపడెను. మొదట బలహీనశరీరమును కలిగియు ఆయన కాలక్రమమున దృఢకాయుడయి యెట్టిరోగమును లేని యారోగ్యస్థితి బడసి మనస్సుతో నధికకృషిచేయ సమర్థుడగుటకు కారణములు శారీరకనైతికసాధనలె.

తనకు బుద్ధితెలిసి యారోగ్యము పొందవలెనను సంకల్పము కలిగిననాటనుండియు, ఆయన శరీరవ్యాయామవిషయమున నెప్పుడు నేమరియుండ లేదు. దేశీయకసరతు నేర్చెను. డంబెల్సుతోను, సాండోడెవలెపరుతోను పరిశ్రమచేయ నభ్యసించెను. టెన్నిసు బాగుగ ఆడగలిగెను. షికారుకు పోవుఅభ్యాసముకూడ కలిగియుండెను. ఉదయమును సాయంకాలమును తనశరీరదార్ఢ్యమునకు తగినట్లుగా వీలునుబట్టి నియమితకాలములందు ఈవ్యాయామములలో నేదియొ తప్పక చేయుచుండెడువాడు. ప్రాతఃకాలమున పరిశ్రమ అయినతరువాత చన్నీళ్ళస్నానము చేసి సంధ్యానుష్ఠానము తీర్చుకొని యితరవిద్యార్థు లింకను పక్కలమీద నుండగానె పెందలకడ ఆయన చదువునకు సిద్ధముగా నుండును. సాయంకాలము వ్యాయామసమయము కాగానే ఆయన షికారుకు బయలుదేరును, లేక టెన్నిసుఆటకు పోవును. పొద్దుపోవువరకు రాత్రులందు మిక్కిలి అవసరము వచ్చినప్పుడుతప్ప ఎప్పుడును మేల్కొనువాడు గాడు. నిద్రపోవువేళకు తానెవరితో మాటాడుచున్నను, తా నిక మేల్కొనజాలనని చెప్పి వారివద్ద సెలవుపుచ్చుకొని వెళ్ళి పరుండును. తాను పెట్టుకొనినవేళకు పూర్వ మొకప్పుడును నిద్రపోక అంతవరకు ఏదోపని చేయుచు మేల్కొనును. రాత్రి పెందల

కడ పరుండి యుదయమున పెందలకడనె లేచును. నిద్రవిషయమున నెటులనో ఆహారవిషయమునను నీమము పాటించును. తనశరీరస్థితికి తగినట్లు తన కెప్పటికప్పుడు తోచిన రీతిని ఏ యాహారము, ఏ వేళలకు తినవలయునో నిశ్చయించుకొని ఆయేర్పాటుప్రకారము నడచుకొనును. లూయికూని తొట్టిస్నానముల వైద్యము చేసినంతకాలము ఆయన చెప్పిన విధమున ఉప్పుకారము లేకుండ నూరక నుడుకపెట్టబడిన వస్తువులనె తినియుండెను. అవసరమునుబట్టి యెటువంటిపథ్యమునైనను జేసియుండెను. నిద్రాహారములందింతజాగ్రత్త కలిగి శరీరపరిశ్రమ చేయువానికి ఆరోగ్యమునందు కొరత యేమి? బాపయ్యగారు కళాశాలవిద్య ముగించువరకు మంచి యారోగ్యముతో నుండిరి.

౧౯౦౪ వ సంవత్సరమధ్యభాగమున ఆయన విశాఖపట్టణప్రాంతములకు వెళ్ళి తిరిగివచ్చినతరువాత కొంచమస్వస్థతగా నుండెను. ఆసంవత్సరాంతమునకు జబ్బు హెచ్చెను. దగ్గుతో చాల బాధపడెను. మృత్యుభయముకూడ కలిగెను. కాని యీశ్వరానుగ్రహమున ప్రాణాపాయము తొలగి ఆయన క్రమముగా తిరిగి స్వస్థతజెందెను. ఇట్లున్న సమయమున పూర్వమువలెసాండో కసరతులు మొదలయినవి చేయప్రారంభించెను. శరీరమప్పటి కింకను బలహీనముగ

నుండుటచే, ఆకసరతులు ఆయనకు అమితహానిని కలుగజేసినవి. అది తెలుపుచు పాలపర్తి నరసింహముగారికి కసరతు విషయములో సలహాపూర్వకముగ ఆయన యీక్రింది యుత్తరము ౬-౧౨-౧౯౦౭ తేదిన వ్రాసెను.

“నేను నీయెడల పూర్తిగ సానుభూతి చూపగలిగి యున్నాను. కాని నీకు నేను సలహా చెప్పగలనో లేవో తెలియదు. చెప్పగలిగియె యున్నయెడల, ఏమి చెప్పవలెనో తోచకున్నది. నీ జీర్ణశక్తి మంచిస్థితిలో లేదని వ్రాయుచున్నావు. నీశరీరమును నీగుండెయు బలహీనమగుచున్నవని దానివలన తెలియుచున్నది. ఆసందర్భములో సాండోకసరతువలన మేలుకంటె నెక్కువకీడె కలుగునని నేను భయపడుచున్నాను. బలహీనస్థితిలో సాండోకసరతును తెలివితక్కువగా చేసి నాకు నేను శాశ్వతమయిన హానిని చేసికొన్నాను. నాగుండె యుండవలసిన చోటునుండి శాశ్వతముగ తొలగిపోయినది. నీవ్యాధు లున్నటువంటివానికి ఉదయము చీకటితో దూరముగా షికారుపోయివచ్చుట యుత్తమమయిన వ్యాయామమని నాయభిప్రాయము. ఆయాసము కలుగకుండ, పరిశుద్ధమయిన మంచిగాలియందు, నీవు నడువగలిగినంత దూరము నడువుము. ఆయాసము వచ్చినతరువాత నడువ వద్దు. ఒకపక్షమొ నెలో అయినతరువాత నీ మల

బద్ధకము సహితము పోవును. ప్రయత్నము చేసి చూడుము"

ఈయుత్తరమువలన బలహీనస్థితిలో నున్నప్పుడును ఆయన మామూలుప్రకారము సాండోకసరతు చేసియుండె నని తెలియుచున్నది. ఆ కసరతుచేయుట ప్రయాసకరముగ నున్నను దానివలన నష్టము కలుగునని తెలియకపోవుటచే పట్టుదలతో శ్రమనంతయు నోర్చుకొనుచు దానినిచేసి ఆయన తన యారోగ్యమునె చెడగొట్టుకొనెను. శరీరపరిశ్రమ యిప్పు డీవిధముగ పరిణమించినను, మొదటనుండియు ఆయన కెంతో మేలును కలిగించెను. శరీరపరిశ్రమవిషయమున ఆయన కనపరచినదీక్ష యద్భుతము. అందునకు ఇతరులను కూడ ఆయన ప్రోత్సాహపరచుచుండెను. చదువునకుగాని సంధ్యావందనమునకుగాని యెంత ప్రాముఖ్యత నిచ్చెనో అంత ప్రాముఖ్యతయు ఆయన శరీరవ్యాయామమున కొసంగెను. షికారుకు పోవునప్పుడు శరీరమునకు పరిశ్రమ యగుటయె గాక చిత్తము ప్రకృతిదృశ్యముల గాంచి యీశ్వరచింత నము నతిసహజముగ సలుపగలుగునని ఆయన జెప్పుచుండు వాడు. దేహపరిశ్రమను ఆధ్యాత్మికసాధనగా ఆయన విని యోగించుచుండె ననుటకుసందేహింప నక్కరలేదు.

శరీరపరిశ్రమ చేయువారు వేళలకు బలమయిన యాహారమును గైకొనుచుండవలెను. బాపయ్యగారు ఆహారవిష

యమునను నెంతయొశ్రద్ధ జూపి పాలు మొదలయిన బల మిచ్చుపదార్థములను తినెడువారు. పథ్యముచేయవలసి వచ్చి నప్పుడు కఠినముగ పథ్యముచేయు వారని యిదివరకె తెలుప బడినది. ఆహారనియమముల పాటించుటలో ఆయన యెట్టి ధర్మదృష్టితో మెలగెనో సూచించుటకు ఆయన ౨. ౭. ౧౯౦౬ తేదిన తన దినచర్యపుస్తకమునందు వ్రాసికొనిన యంశ మీక్రింద పొందుపరుపబడినది.

"హర్నియా అపాయకరమయినవ్యాధి యనియు, ఇక ముందు దానివిషయమయి నేను జాగ్రత్త వహింపవలసియుం డు ననియు గ్రహించినాను. నేటినుండి మిక్కిలి కఠినమయిన పథ్యమును చేయవలయును. కఠినపథ్యమును చేయుటకును, నాడాక్టర్ లూయికూని చెప్పినవిధమున నడచుకొనుటకును, ఈశ్వరుడు నాకు తగినంత బలమును ప్రసాదించును గాక! ఇది పవిత్రమయిన ప్రతిజ్ఞ; ఆచరణయందు నిష్ఠతో పాలింప వలెను. పరిపూర్ణపవిత్రస్వరూపుని సమక్షమున నేను తీసికొను చున్న యీ దీక్షను ఆయన యాశీర్వదించును గాక!"

చిన్న విషయములం దింతధర్మబుద్ధిని నిలుపువారు చాలయరుదు. సత్సంకల్పము లందరికిని కొన్ని పరిస్థితు లందు కలుగునుగాని పలువు రాసంకల్పములను కార్యరూపము నొందింపలేరు. గొప్పవిషయములలోనె గాక సామాన్యదైవిక

కృత్యములందు సహితము అనుకొనినరీతిని నడచుకొనుటకు చాలమంది యశక్తులుగా నుందురు. వారిసంకల్పములు బలహీనములు. సంకల్పములు ఈశ్వరశక్తిద్వారా ప్రతిజ్ఞలుగ మారినప్పుడె యమితబలమును పొంది యమోఘములు కాగలుగును.

శరీరము ఈశ్వరునియొక్క ఆలయ మనుపరమసత్యము బాపయ్యగారికి హృద్గోచరమయ్యెను. ఆహార వ్యాయామ నిద్రాది విషయములందు శ్రద్ధగలిగి శరీరమును దృఢముగ నుంచుటకు ప్రయత్నించుటయె గాక యింద్రియములను వశపరచుకొని నీతిమార్గమున నడపి శరీరమును పవిత్రముగ నుంచుటకు గూడ ఆయన పాటుపడెను. మనోవాక్కాయకర్మలన్నియు పరిశుద్ధములుగ జేయుటయె ఆయనయొక్క యాదర్శము. స్వచ్ఛముగ దీపము వెలుగుచున్నను దానిని చుట్టియుండు చిమ్నికి మసిపట్టినయెడల, ఆదీపపుకాంతి యెట్లు మాలిన్యముజెందునో అటులనె శరీరముయొక్క యపవిత్రత మూలమున అంతరమందలి యీశ్వరతేజము నిర్మలముగ ప్రకాశింప నేరదనుట నిశ్చయము. పరమేశ్వరుని సత్యజ్యోతి ప్రకాశించుటకు తగినట్లు శరీరమును నిర్మలముగ నుంచుటలో బాపయ్యగారు వహించినశ్రద్ధ యమితము. దుష్టవర్తనముచే గాని, దుర్భాషలచేగాని ఆయన తన బాహ్యజీవనమును కళంకితము చేసికొనకుండుట ఆయనతో పరిచయము గలవారెల్లరకు సువిదితము. బాహ్యశరీరవ్యాపారములకు నాధారములై యున్న యింద్రియములు మనోనిగ్రహముద్వారా గాని సరళతను జెందవు. మనస్సును సదా సచ్చింతలందు నిమగ్నము చేయుటయె ఆయనయత్నము. సద్గ్రంథములను చదువుచునో సద్విషయములను యోచించునో, సత్కార్యములనుచేయుచునో మేల్కొనియున్న కాలమంతయు మనసు పని గలిగియుండునట్లుగా ఆయన తన దినచర్యను ఏర్పాటు చేసుకొనువాడు. సోమరితనము ఆయన యం దెంతమాత్రము గాన్పించదు. మనోనిగ్రహమును తద్వారా జితేంద్రియత్వము కలిగి ఆయన తనజీవితము పూర్ణముగ శాసనబద్ధము చేసెను.

> "Self-reverence, self-knowledge, self-control. These three above lead life to sovereign power yet not power (power of herself would come uncalled for) but to live by law. Acting the law we live by without fear. And, because right is right, to follow right were wisdom in the scorn of consequence."

ఆత్మగౌరవము, ఆత్మజ్ఞానము, ఆత్మసంయమము, ఈ మూడును జీవితమునకు మహాశక్తిని చేకూర్చుననియు,

అయినను అవి కలిగియున్నతరువాత శక్తి దానియంతటదియె వచ్చునుగనుక అవి శక్తిసంపాదనముకొరకుగాక ధర్మశాసనప్రకారము జీవించుటకె యభ్యసింపనగుననియు, ధర్మశాసనమును నిర్భయముగ ననుసరించుటవలన మనము సజీవులమై యుందుమనియు, ధర్మము ధర్మమనుహేతువుచేతనె ఫలితమెటువంటిది రానున్నను లెక్కసేయక దాని ననుసరించుట యుత్తమజ్ఞానమనియు, అర్థమిచ్చు టెనిసన్ మహాకవియొక్క యీపైనివచనములు ౧౨-౩-౦౭ తేదిన బాపయ్యగారు దినచర్యపుస్తకమందు వ్రాసిపెట్టుకొనుటలో ఆయనమనోగతి యెట్టిదో స్పష్టపడుచున్నది. ఏ నీమములను పాటింపక స్వేచ్ఛావిహారము సలుపుటయె స్వాతంత్ర్యమను భ్రమయందు కొందరు తగుల్గొనుచున్నారు. వాస్తవమునకు వారిది స్వాధీనత గాక పరాధీనతయె; గాలిలో కొట్టుకొనిపోవుటయె. అట్లుగాక, బాపయ్యగారు జీవితమును పూర్తిగ శారీరకనైతికవిధులకు లోబరచెను. గడియారమెంతక్రమముగా తిరుగునో ఆయన యంత్రక్రమముగా చరించువాడను ప్రతీతి గలదు. ఆయన జీవితమునకు సౌందర్యము దెచ్చినది క్రమవర్తనమె.

జీవనస్మృతి

౨ వ ప్రకరణము

వక్తృత్వము

వక్తృత్వమునందు బాపయ్యగారికి మొదటినుండియు అభినివేశము గలదు. కళాశాలలందు విద్యార్థులుచర్చలు జరపు సభలలో విధిగ పాల్గొనుచు వక్తృత్వశక్తిని ఆయన పెంపొందించుకొనెను. సులభశైలిని మృదువుగను ధారాళముగను ఆంగ్లభాషలో ప్రసంగింపగల సామర్థ్యమును సంపాదించెను. ఈసామర్థ్యమును బట్టియె తనకు ఉపాధ్యాయవృత్తి తగియుండునని ఆయన నిశ్చయించుకొనినట్లు తలంపవచ్చును. తమ సామర్థ్యములను విచారించుకొనక ప్రవేశించుట కవకాశముగల వృత్తులందు జేరి తాము బాధపడుచు నితరులను బాధపెట్టుబుద్ధిమంతులగణములో బాపయ్యగారివంటి స్వభావముగల వారిని జేర్చుటకు వీలు లేదు గదా? వృత్తినిమిత్తమె గాక, తన జీవితసందేశమును వ్యక్తపరచుటకు వక్తృత్వమును సాధనభూతముగా గూడ ఆయన జేసికొన సంకల్పించెను.

వక్తలు కాదలచినవారు మహావక్త లొసంగు నుపన్యాసములు వినుట ముఖ్యవిధిగా జేసికొందురు. జ్ఞానసంపాదనముతో బాటు తన్మూలమున నుపన్యాసధోరణియు కుదురును. చెన్నపురియం దున్న కాలములో బాపయ్యగారు గొప్ప యుపన్యాసకుల ప్రసంగములను వినుచు వాని సారాంశములు వ్రాసియుంచుకొను వారని యిదివరకె తెలుపబడినది. అవియన్నియు వినిన తరువాత తన సహజ పద్ధతిని అవకాశములు తటస్థించినప్పుడు ప్రసంగములు గావించుటకు నభ్యసించువాడు. మిక్కిలి పెద్దదియగు చెన్నపురి ఆండర్సన్ హాలులో ఆయన అప్పుడప్పుడు ప్రసంగించుట కలదు. ఆ సమయములు ఆయన ప్రయత్నమున కెట్లు తోడ్పడినవో చూడుడు. ఆయన కంఠము కొంచము తగ్గుస్వరముగా నుండును. విషయమును, భాషను అమర్చుకొని చక్కగ నుపన్యసించుటకె గాక కంఠస్వరము సాధ్యమయినంతవరకు పెద్దది చేసికొనుటకును ఆయన యత్నించుచుండెను. ఆండర్సన్ హాలులో తా నొక తూరి నుపన్యసింపబోవుచు ముందుగా తన మిత్రులయిన రామరాజు చెంచురామయ్యగారిని ఆ పెద్ద హాలులో చివర నిలువబడి తన మాటలు వినబడువరకును ‘హియర్, హియర్’ అని కేకవేయుట కేర్పాటు చేసికొనెను. చెంచురామయ్యగారు కేక వేయక పోవుటచే,

తాను హాలంతయు వినబడునట్లు ప్రసంగింప గలిగితినా యని ఆయన చెంచు రామయ్యగారిని ఉపన్యాసానంతర మడుగ, ‘నీ గొంతు వినబడ లేదు. అప్పటికే యెంతో ఆయాసపడుతున్న నిన్ను ఇంకా శ్రమ పెట్టడానికి ఇష్టం లేక నేను కేక వేయ లేదు.’ అని చెంచు రామయ్యగారు బదులు చెప్పిరట. దీనిని బట్టి బాపయ్యగారు తా ముపన్యాసములను బాగుగ నియ్య గలుగుటకు వలసిన శిక్షణమును తమకు తామె కల్పించుకొనుచు తమ భావికర్తవ్యమునకు సంసిద్ధులైరని గ్రహింపనగును.

౧౯౦౩ సంవత్సరమునుండి వివిధపట్టణములకు బోవుచు విద్యార్థులయొక్కయు విద్యాధికులయొక్కయు జనసామాన్యముయొక్కయు ఉపయోగమునకు ఆయన యుపన్యాసములొసంగ ప్రారంభించెను. అవసరమునుబట్టి తెనుగులో గూడ ప్రసంగించుచుండెను. ఆయనయుపన్యాసములు యుక్తియుక్తము లయి పండుబలిచి చేతిలో బెట్టినట్లుండు ననియు, ప్రతిపక్షుల క్రోధానలమును చల్లార్చగల ప్రశాంతవర్షధారలవలె నుండుననియు, శ్రోతలు నూతనోత్సాహము బడసి నవజీవనము ప్రారంభించుటకు మిక్కిలి తోడ్పడుచుండు ననియు, వానిని వినిన వారందరు ప్రశంసించునంతగా ఆయన తన వక్తృత్వశక్తిని వృద్ధిజేసికొనెను.

చీరాల ప్రార్థనసమాజవార్షికోత్సవమున కాయన అగ్రాసనాధిపతిగా నుండుటకు కోరబడి యాగ్రామమునకు ఒక సంవత్సరము వెళ్ళియుండెను. గ్రామవాసులు పలువురు సమావేశమయిరి. ఆయన తన యధ్యక్షోపన్యాస మిచ్చిన తరువాత కొంత యాయాసము జెందుటచే దగ్గరనున్న వారిని త్రాగుటకు మంచినీళ్ళు తెచ్చి యిమ్మని కోరెను. ఒక బ్రాహ్మణేతరప్రముఖుని యింటివద్దనుండి నీళ్ళు తీసికొని రాబడి ఆయన కీయబడెను. ఏమియు నాలోచింపక ఆయన వెంటనె మామూలువరుసను ఆ నీటిని త్రాగెను. సభలో కలవరము బయలుదేరెను. బ్రాహ్మణులకు పట్టరాని యాగ్రహము వచ్చెను. "బ్రాహ్మణకులాన పుట్టి, దేశిరాజువారి వంటి గొప్ప కుటుంబానికి జెంది, ఇంతమంది బ్రాహ్మణులము చేరియుండగా, మమ్ము అవమానపరుస్తూ, నీ కులానికి, నీ వంశానికి అపకీర్తి తెస్తూ, ఆచారవిరుద్ధంగా ఏదో మాట్లాడడమె గాక, బహిరంగముగా మాయెదుట శూద్రుల చేతినీళ్ళు తాగుతావా? నీ కిది తగునా?'' అని యొక బ్రాహ్మణోత్తముడు కోపావేశపరవశుడయి బాపయ్యగారిని ప్రశ్నించుచు పరుషవాక్యములు పలికెను. పల్లెటూరిలో ఆచారపు పట్టుదల హెచ్చుగా నుండును గదా? అందులో ఇది సుమారు ఇరువది యయిదు సంవత్సరముల క్రిందటి

సమాచారము. ఆ కాలములో బస్తీలలో కూడ కులకట్టుబాటులను మీరుట కెవరును సాహసించువారు గారు. బాపయ్యగారి వర్తన చీరాల గ్రామవాస్తవ్యులకు విపరీతముగ దోచుటలో నాశ్చర్య మేమియు లేదు. బాపయ్యగారు తమ సహజప్రశాంతవచనములతో బదులుచెప్పి బ్రాహ్మణులను సమాధానపరచి అల్లరిని అణచి సభను తుదవరకు చక్కగ నడుపగలిగిరి. నాటి సభాచర్య చీరాల పౌరులకు నేటివరకు జ్ఞాపక ముండి విస్మయము గొల్పుచున్నది. బాపయ్యగార యుపన్యాసములు జనవశీకరణశక్తి నంతగా గలిగియుండెను.

గుంటూరు పట్టణమున నొక పర్యాయ మాయన సాంఘికపారిశుద్ధ్యమునుగురించి యుపన్యసించెను. విద్యార్థులు చాలమంది సభకు వచ్చిరి. బోగము మేళములనుగురించియు, అవినీతికరములయిన యితరసాంఘికదురాచారములనుగురించియు శ్రోతలకు విచారము పుట్టించి వానినుండి విముఖత పూర్తిగ కలిగించు హృదయపూర్వకవచనము లాయననోటి నుండి వెలువడెను. ఉపన్యాసాంతమున కొందరువిద్యార్థులు తాము బోగము మేళములు చూడమనియు, ఇతరదురభ్యాసములకు దూరముగా నుందుమనియు వ్రాతమూలముగా ప్రతిజ్ఞలను గైకొనిరి. ఇటువంటి నైతికప్రబోధము ఇతరపట్టణ

విద్యార్థులందును కలిగించెను. గుంటూరు విద్యార్థులలో నొకరు నాడు తమకు కలిగిన యనుభవమును మార్పును ఈ విధముగ జెప్పుచున్నారు—"ఆయన ఉపన్యాసంలో ఉపయోగించిన కొన్ని మాటలు నాచెవిలో ఇప్పటికీ వినబడుతున్నట్లున్నవి. ప్రతిజ్ఞాపత్రముమీద నేను కూడ సంతకం చేసి అదివరకు వేసుకోడానికి బాగా అలవాటు పడివున్న తాంబూలాన్ని సయితం ఆరోజునుంచీ మానుకున్నాను. దగ్గుకు వైద్యంగా ఇటీవల ఒకరు తాంబూలం వాడుమని చెప్పగా ఇప్పు డప్పుడప్పుడు వేసుకుంటున్నానే గాని అనేకసంవత్సరాలు తాంబూలం మానివేసితిని. నా ధార్మికజీవనానికి నాటి ఆయనయుపన్యాసము ఒక మూలకంద మయిం దనుకుంటున్నాను." ఈ మాటలు నుడివినవారు సంఘసంస్కరణము కొరకును, రాజ్యాంగసంస్కరణముకొరకును విశేషముగ పాటుపడి సంఘబహిష్కారము కఠినకారాగృహవాసదండనము మొదలయిన కష్టములకు లోనయి నేడు గుంటూరులో ఆంధ్ర మహాజనుల తోడ్పాటుతో శారదానికేతనసంస్థను నడపుచున్న ఉన్నవ లక్ష్మీనారాయణగారు. బాపయ్యగారి యుపన్యాసము లీతీరున జీవితములను పరివర్తనము నొందింపగల శక్తిని గలిగియుండెను.

ఉపన్యాసములద్వారా బాపయ్యగారు ధర్మప్రచారము చేయగలిగి యుండిరనియు, అవి హృదయపరివర్తనమునకు తోడ్పడుచుండెడి వనియు సూచించుటకు మాత్రమె యీ యొకటి రెండు అంశములు వ్రాయబడినవి. వక్తలె వక్తలను బాగుగ మెచ్చుకొనగలరు. మహావక్తల యుపన్యాసములను ఆయన వినినప్పుడు వారిని ప్రశంసించుచు వారినుండి ప్రబోధము బడయువాడు. ప్రబోధము బడయగలిగి యుండుటచేతనె ఆయన యితరులకు ప్రబోధ మీయగలిగెను. ఇతరవక్తలను ఆయన యెట్లు స్తుతించి వారివలన జ్ఞానము పొందెనో అదియు తెలిసికొనుట ముఖ్యము.

౨౯-౩-౧౯౦౭ మొదలు ౨-౪-౧౯౦౭ వరకు జరిగిన కార్యములక్రింద బాపయ్యగారు ఈక్రిందివితమదినచర్యపుస్తకములో వ్రాసికొనిరి. "ఆంధ్రఆస్తికసంఘసంస్కరణమహాసభలకు వెళ్ళితిని. పిఠాపురము రాజాగారు మిక్కిలియుత్సాహముతోడను, అధికాసక్తితోడను సభాచర్యలన్నిటియందును పాల్గొనిరి. ఈశ్వరు డాయనను సర్వదా ఆశీర్వదించునుగాక! పండిత శివనాథశాస్త్రిగారి యుపన్యాసములు(Simply excellent) మహోత్కృష్టములుగ నున్నవి. భూమి బల్లపరుపుగానున్నదని యింటిలోను, గుండ్రముగా నున్నదని పాఠశాలలోను చెప్పుధోరణి తగదు. పూర్ణమయిన సచ్చారిత్రమునకు మూడు శక్తులు ప్రధానముగ నుండవలెను.-(1)సత్య

మును గ్రహింపజాలినంత బుద్ధి. (౨) సత్యమును ప్రేమింప గలిగినంత హృదయబలము (౩) తదనుగుణముగ నాచరించుటకు వలసిన యిచ్ఛాశక్తి. నీకు భుజించుటకు కూడ వేళ లేనంతగా నీదేశమును ప్రేమింపుము. రావె యను మహమ్మదీయభక్తుడు ప్రవక్తనుగురించి యోచించుటకె కాలము లేనంతగా దేవుని ప్రేమించెను. సర్వమానవులయెడ సానుభూతిని, స్వీయజీవనమున భక్తిభావమును మనమందర మలవరచుకొని విశ్వాసమును ఆశను మిళితము చేయవలెను. ధర్మము మూలమును, సంఘము ఫలమును పోలియున్నది.'' ఈవాక్యములందు మహావక్త యని పేరుపొందిన పండిత శివనాథశాస్త్రిగారి యుపన్యాసము శ్లాఘింపబడినది; మరియు అందలి భావములు చక్కగ వ్యక్తపరుపబడినవి. వక్తను వక్తయె బాగుగ మెచ్చుకొని అర్థముచేసికొనగల డను న్యాయమును బట్టి బాపయ్యగారును వక్తయని గ్రహింపనగును.

వక్త యన నేర్పుగ మంచిశైలిలో మాటాడువా డని సామాన్యముగ తలంపబడును. అట్టివాని యుపన్యాసము వినుచున్నంత సేపు శ్రోతలకు ఆనందముగను వినోదముగను ఉండును. ఆ యుపన్యాసకుడు తరలిపోగానె ఆయనయుపన్యాసము కూడ ఆయనతో సెలవుపుచ్చుకొనును. శ్రోతల హృదయములందే భావములు నాటబడవు. వారిజీవితము

లుజ్జీవింపబడవు. ఆ యుపన్యాసము ప్రాణములేని అందమైన బొమ్మవంటిది. ఉపన్యాసము సజీవమై యుండినయెడల అది హృదయములో చొచ్చుకొనిపోయి మోడువారిన జీవితమునందు నూతనజీవము పోయును. ఉపన్యాస మాశక్తిని కలిగియుండుటకు ఉపన్యాసకుడు తాను ప్రకటించు భావములను భాషలో చక్కగ పొదుగనేర్చుటయె గాక తన జీవితమునందు రూపము తాల్చునట్లు వర్తింప సమర్థుడయి యుండవలెను. విశ్వసించినట్లు ఆచరింపగలవాడె ధర్మజీవనమును తోడిమానవులందు వ్యాపింపచేయగలడు. అట్టివాడె నిజమయిన వక్త. విషయములను జ్ఞాపకముంచుకొనుటకు ఎవరి యుపన్యాససారాంశమునైన మనము వ్రాయుచుందుము. బాపయ్యగా రావిధముగ కొందరిప్రసంగములు వ్రాసినవ్రాసియుండును. కాని ఆయన తన దినచర్యపుస్తకమునందు తన మననకాలమున వ్రాసికొన్నవి మాత్రముఅట్టివిగాక ఆయన జీవితమున పేరూనిన వని నిశ్చయముగ చెప్పవచ్చును. యథార్థవక్తలమహాప్రసంగములను వినుటచేఆయనయందు ధర్మప్రబోధముకలిగి నిజమయినవక్తృత్వశక్తి పొడసూపెను. ఆయనమహనీయులయుపన్యాసములువినుటమూలమునధర్మోత్తేజము పొందెనని సూచించుటకు మరియొక నిదర్శనము కలదు. ౨౨-౭-౧౯౦౮ తేదిన వెంకటరత్నమునాయుడుగారి ధర్మ

ప్రసంగము వినినతరువాత తన దినచర్యపుస్తకమందు ఆ తేదినె యీవిధముగ వ్రాసికొనెను. "వెంకటరత్నముగారు పురమందిరమున గావించిన యీశ్వరోపాసనకు వెళ్లితిని. 'పరమేశ్వరునకు ఆత్మసమర్పణము' అను విషయమునుగురించి వారు ప్రసంగించిరి. ఒకక్రైస్తవాలయములో సొమ్ము వసూలుచేయు సమయమున పైకముసంచి అందరివద్దకు తీసికొనిపోబడి నప్పుడు ఒక యువకుడు సంచిలో ఏనాణెమును వేయక ఒక వైపున తనపేరును రెండవవైపున 'నాఆత్మను' అను మాటయు గల ఒకకార్డును పడవేసెను. ధర్మమండలియొక్క సేవనిమిత్తము వాడు ఆత్మసమర్పణము గావించెను." వెంకటరత్నమునాయుడుగారి ప్రసంగమందలి యీభావము బాపయ్యగారి మనమున ప్రతిఫలించెనని నుడువవచ్చును. ఈశ్వరార్పితమయిన జీవితమును కలిగి ధర్మోత్సాహము పురిగొల్పగలశక్తిని సంపాదించి యుండుటచేతనె బాపయ్యగారు వక్త యని పిలువబడుటకు ముఖ్యముగ నర్హులై యున్నారు. ఆయనయొక్క యాత్మసమర్పణాశీలమునుగూర్చి ప్రత్యేకముగ వివరించుట యుచితము.

జీవనస్మృతి

౫ వ ప్రకరణము

పరివర్తనము

వృక్షము నందుద్భవిల్లి దాని నంటియున్నంతవరకె ప్రాణము కలిగి పెంపొందునదియయినను, వృక్షముద్వారానె పుష్పము పూర్ణముగ వికసించుటకు వలసిన శక్తి నంతయు బడయజాలదు. నిర్మలవాయువును, చల్లనిమంచును, సూర్యరశ్మియు దాని వికాసమునకు తోడ్పడును. అది స్వచ్ఛమయిన గాలిని పీల్చుచు, శీతలహిమకణములచే తడపబడుచు, భానునికరములచే తుడిచి విప్పబడుచు నుండవలెను. బాపయ్యగారు సద్వంశమున జన్మించి యావంశముద్వారా కొంతయభివృద్ధిని బడసిరి. కాని, ఆయన యభ్యున్నతికి ఆయన పెరిగిన పరిస్థితులును, పొందిన సర్వాంగపరిజ్ఞానమును, సలిపిన శారీరక నైతికసాధనలును విశేషముగ సాయపడినవి. ఆయన జీవితము స్వల్పకాలములోనె సమగ్రముగను సుందరముగను పుష్పమువలె వికాసము గాంచినది.

ఈశ్వరభక్తి ఆయనకు చిన్నతనమునుండికలదని తెలుప

బడెను గదా? ఆభక్తి కాలక్రమమున వర్ధిల్లి పరిశుద్ధతజెందెను. ఇతరులు చేయుడని చెప్పుటవలనను, పరులను చూచుచుండుట వలనను, మనయందు జ్ఞానము తీక్షణముగ లేనప్పుడు, మనము కొన్ని భక్తిసాధనలును మతకర్మలును అనాలోచితముగ సలుపుచుందుము. బాల్యమునందు సాధారణముగ అందరి కీయవస్థ తప్పదు. అప్పుడు అనుకరణస్వభావమె మనయందు హెచ్చుగా నుండును. మన యాత్మయందలి జ్ఞానము ప్రజ్వరిల్లినకొలది, అనుకరణజీవితమంతయు నందు పుటము వేయబడి స్వచ్ఛ మగుచుండును. మన్నుతోను దుమ్ముతోను చేరిన బంగారమె మనకు ప్రకృతియందు దొరకును. ఆ మలిన బంగారమును తెచ్చి అగ్నియందు పుటములు పెట్టి శుభ్రము చేయుదుము. ఇతరులనుండి గ్రహింపబడు భక్తియు కొంత మౌఢ్యముతోను, కొంత భ్రమప్రమదాదులతోను కూడి యుండును. ఆత్మజ్ఞానముద్వారా, ఆభక్తిని పరిశుద్ధము చేయ గలుగుదుము. బాపయ్యగారు పూర్వాచారసంబంధమయిన భక్తి బాల్యముననె బడసెను; తరువాత క్రమశిక్షణము వలన జ్ఞానోద్దీపనము గాంచి యాభక్తిని వినిర్మలము గావించుకొనెను. నమ్మినట్లు ఆచరించు స్వభావము మొదటనుండియు కలిగి యుండెను. ఆయన యొక్క తెల్లవారుజాము స్నానములు, తడిబట్టలతో తులిసెమ్మదగ్గరి జపములు, మంత్రోప

దేశములు, పిలకజుట్టు, గూడకట్టు, విభూతిరేఖలు చూచిన వారు చాల కొలదిమంది యుందురు. ఎట్టి పూర్వాచారపరాయణుని యందైనను అంత నిష్ఠ గాన్పింపదు. తనతోనున్న వారిని గూడ తన పద్ధతుల నవలంబించుటకు హెచ్చరించువాడు. నన్ను తల్లి గారాబముగ పెంచి యిచ్చవచ్చినట్లు చరించుటకు చిన్నతనమున వదలియుండుటవలనను, నాలుగైదు సంవత్సరముల ప్రాయమునుండి యామె మరణానంతరము అక్కగారివద్ద చేరి భయభక్తులు లేకుండ పెరుగుటవలనను, నేను ప్రథమమునుండి చదువునందుగాని, సంధ్యయందుగాని, ఎట్టి యితర సదభ్యాసమునందుగాని శ్రద్ధగలవాడను గాను. ఆటపాటలందును, పోట్లాటలందును, స్వేచ్ఛావిహారమందును నాకెక్కువ ప్రీతి యుండెడిది. బడికి సరిగా పోవువాడను గాను. సంధ్యావందనము నేర్పిన బ్రాహ్మణునకె యది యొప్పగించి దాని ప్రసక్తి మానుకొంటిని. బాపయ్యగారి క్రమజీవితమునకు నాది సూటిగా వ్యతిరేకముగ నుండెను. నేను ఆయనతో పసితనమునుండి కలసి జీవించుట తటస్థించినది. అది యొక చిత్రము. నేను ఆయనను గాని మరెవ్వరిని గాని లక్ష్యపెట్టి వారు చెప్పినట్లు నడచువాడను గాను. కాని ఆయన నాయందు ఎందువలననో యమితప్రేమ చూపుచుండెను. నే నది యెరిగియు, ఆయనమాటలను పెడ

చెవిని పెట్టువాడను. ఒక దినము సాయంకాలము బాపట్ల
లో పచ్చికబయళ్ళమీదికి ఆయనతో కలసి షికారుకు వెళ్ళి
తిని. అచట మంచినీళ్ళదొరువు లుండెను. సూర్యాస్తమయ
సమయము కాగానె ఆయన దొరువులో దిగి కాళ్ళుచేతులు
కడుగుకొని సంధ్యవార్చుటకు మొదలుపెట్టెను. దొరువు
గట్టున నే నది చూచుచు కూర్చుంటిని. కొంత సే పయిన
తరువాత, ఆయన నన్ను పిలిచి ‘ఒరే, సంధ్య వార్చ రాదు
ట్రా. అట్లా ఎందుకు కూర్చుంటావు?’ అని చెప్పెను. నేను
వెంటనే దొరువులో దూకి గబగబ సంధ్యావందనమంత్రములు
వల్లించుచు వ్రేళ్లతో నీళ్ళు అటునిటు విదల్చితిని. నే నది
యంతయు తమాషాకు చేయుచుంటిని. నేను చల్లుచుండిన
నీళ్ళుకొన్ని తనమీద పడుటచే, జపము చేసికొనుచున్న
ఆయన కళ్ళు తెరచి నావంక చూచి “గోళ్ళనీళ్లు ఇతర్లమీద
పడేస్తే పాపంరా” అని మాత్రము నిదానముగ నుడివి తిరిగి
జపముకొరకు కళ్ళు మూసికొనెను. ఆ మాటలవలన నేదో
కొంతభయము వేయగా, సంధ్యను కట్టిపెట్టి చప్పుడు చేయ
కుండ గట్టునుచేరి మెల్లగా కూర్చుంటిని. తన సంధ్య ముగి
సినతరువాత ఆయనయు బయటికి వచ్చెను. నేను దొరువు
లో చేసిన అల్లరినిగురించి ఆయన మరల ప్రస్తావించి యుండ
లేదు. ఏవోకబురులు చెప్పుకొనుచు ఇద్దరము కలసి యింటికి

పోతిమి. ఆ రోజులలో ఆయనకు కొన్ని పనులు చేయుట
పుణ్య మనియు కొన్ని పనులు చేయుట పాప మనియు దృఢ
విశ్వాస ముండెడిది. పాపపుణ్యములను గురించి అప్పుడాయన
యెట్టి విచారణ చేయలే దని చెప్పవచ్చును. ఒకకార్య మెం
దువలన పుణ్యమొ, మరియొకకార్య మెందువలన పాపమొ,
హేతువులద్వారా ఇతరులకు నచ్చచెప్పుట కాయన ఆదిన
ములలో ప్రయత్నించెడు వాడు గాడు. తన విశ్వాసమంత
యు స్పష్టపడురీతిని ‘ఇది పాపము, అది పుణ్యము’ అను
మాటలుమాత్ర ముచ్చరించుచుండెను. ఆయన ధర్మజీవన
మందలి ప్రథమస్థితి యిట్టిది.

ఈ యనుకరణజీవనము క్రమక్రమముగ స్వతంత్ర
జీవనముగ పరివర్తనము జెందెను. ఆయన జ్ఞానమునందు
పెరిగినకొలది తనపద్ధతులను తానె మార్చుకొనెను. మొదట
నుండిన యనుకరణస్వభావము ఆయనయందు పూర్తిగ అంత
రించిపోయినది. పూర్ణస్వాతంత్ర్యవ్యక్తి కాగలిగెను. ఉన్న
తములయిన నవీనాచారము లవలంబించు వారిలో కూడ
పలువురు అనుకరణస్వభావమునకు దాసులై యుందురు.
స్వతంత్రముగ యోచించుటకు వారు పూనుకొనరు. ‘ఆరు
నెలలు సహవాసము చేసిన, వారు వీ రగుదు’రను సామెతయె
వారియందు సార్థక మగుచుండును. వా రెవరితో కలసి

జీవించుచుండిన, వారి యభిప్రాయములు తాము బడయు
చుందురు; వారి పద్ధతులు తా మవలంబింతురు. వారి
వేష భాషలు కూడ తా మను కరింతురు. ఏ సమస్య
విషయమున అభిప్రాయము తెలుపవలసి వచ్చినను,
తమ యాదర్శపురుషు లావిషయమున కలిగియుండు అభి
ప్రాయము తెలియువరకు ఆగి తెలియగానె అదియె తమదిగా
వెలిబుత్తురు. ఆ పూజ్యపురుషుల వర్తనము తమ జీవితములకు
ఒరవడి యైనట్లు, ఏ చిన్నపని చేయవలసి వచ్చినను, వారి
నడవడికవంక చూచెదరు. ఈ యనుకరణజీవనము మన దేశ
విద్యాధికులలో సహితము ప్రబలముగా నుండుటవలన స్వా
తంత్ర్యముకొరకు సలుపబడు మతసాంఘిక రాజకీయోద్యమ
ములలో నేదియు జయము గాంచుట లేదు. అనుకరణము
నుండి స్వాతంత్ర్యములోనికి పెరుగుట ప్రతివ్యక్తియొక్క
లక్ష్యమై యుండవలెను. బాపయ్యగారు స్వతంత్రవ్యక్తి కా
గలుగుటచేతనె, తనకు దారి చూపువా రెవరు లేకపోయినను,
తనకు తానె ఆత్మజ్ఞానసాహాయ్యమున నూతనమార్గము
నందు నడచి తనకంటె పెద్దలయినవారికిని తోడియువకుల
కును మార్గప్రదర్శకు డాయెను. ఆయన నవజీవనము ప్రారం
భించినతరువాత, ౨-౬-౧౯౦౬ తేదిన తన దినచర్యపుస్తక
ములో తన స్వాతంత్ర్యాభిమానము వ్యక్తపరచుచు నీ క్రింది

విధమున వ్రాసికొనెను.

"నేను ప్రాయశ్చిత్తము చేయించుకొందునని విచిత్ర
ములయిన వదంతులు వ్యాపించుచున్నట్లు తెలిసినది. అట్టి యే
యవమానమునుండియైనను పరమేశ్వరుడు నన్ను కాపాడును
గాక! కేశవచంద్రుని జీవితము చదువుటకు నేను నిన్న ప్రా
రంభించితిని. స్వాతంత్ర్యమునుగురించిన ఆయన 'జీవనవేదము'
లోని యీ క్రిందివాక్యములు గమనింపదగి యున్నవి 'బాని
సత్వము ప్రపంచమునకు విషమువంటిది; అది యనేక నరక
బంధనములకు హేతువు. మొదటినుండియు బానిసత్వము
మీద నేల యింతవిరక్తుడ నైతినో నేను చెప్పజాలను. కామ
క్రోధాది రిపువులను జయించుటకు మానవులు ప్రయత్నిం
తురు; కాని బానిసత్వశత్రువునుండి తప్పించుకొనుటకు నెవ
రును తీవ్రప్రయత్నము సలుపుటలేదు...స్వాతంత్ర్యమె నాకు
ఆదిమశబ్ద మాయెను...ఏ మానవుని పదతలమున పడను,
నాపైని యధికారులకు నాయాత్మ నెప్పుడును విక్రయింపను,
ఏ గ్రంథమునకును బానిసను గాను, ఏ ప్రత్యేక సంప్రదాయ
మును గూర్చియు నిరంతర యశోఘోషణము సలుపను...
ఈ స్వాతంత్ర్యభావము నాలో పెరుగుచుండ, అన్నివైపుల
ను విగ్రహపూజయు జాతిభేదమును రాజ్యము చేయుచుండు
టను గాంచితిని; వెంటనె వానిశృంఖలములను భేదించుటకు

నేను నిశ్చయించుకొంటిని... నేను ఘనతను సంపాదించుకొనుటకు గాని, మానవులలో నున్నతపదవి నాక్రమించుటకు గాని స్వాతంత్ర్యము నన్వేషింపలేదు... నేను స్వాతంత్ర్యమును ప్రేమించితినె గాని దానిచేత నేను బంధింపబడలేదు. గురుత్వము, గిరుత్వము ఎగిరిపోవును గాక! నే నస్వాతంత్ర్యమును అసహ్యింతును."

కేశవచంద్రుని యీ యుత్తమవచనములు బాపయ్యగారికి రుచించుటనుబట్టి ఆయన స్వాతంత్ర్యశిఖర మధిరోహించె నని చెప్పవచ్చును. ఆయన మొదట కలిగియుండిన యనుకరణ జీవనము సంపూర్ణ స్వతంత్రజీవనముగా మారిపోయెను.

ఆయన యేసంబంధముగ నెవరితో కలసియున్నను, వారికిని తనకును గల యభిప్రాయభేదములు విస్పష్టముగ వ్యక్తపరచుకొనుచు తనవ్యక్తిత్వమును కాపాడుకొనుచుండెను. భిన్నాభిప్రాయము కలవారితో నతిసఖ్యముగా మెలగినను, ఆ మైత్రి యాయన తన స్వాతంత్ర్యమునకు భంగకరముగ పెరుగ నిచ్చువాడు గాడు. మోమోటమువలన గాని, గౌరవమువలన గాని, భయమువలన గాని, ఆయన తన యంతరాత్మప్రబోధమునకు వ్యతిరేకముగ నడచుకొనుట తన జీవితమున కానరాకుండ జేసికొనెను. బ్రాహ్మసమాజకుల

తోడగాని క్రైస్తవులతోడగాని స్నేహముచేసినప్పటికి, వారిభావములు వెంటనె స్వీకరింప లేదు. విరివియయిన గ్రంథపఠనము, పరభావవిమర్శనము, సత్యాన్వేషణపూర్వకమగు సమాలోచనము—వీని సాహాయ్యముతో తన యంతరాత్మ తనకెప్పటి కేది సత్యమని తెలిపినో దానినిమాత్రమె యనుష్ఠించియుండెను. వర్ణభేదము అనర్థదాయక మని గుర్తించిన తరువాత ఇతర కులస్థులతోడను, వితంతువివాహములు ప్రోత్సాహపరుప దగినవియని గ్రహించినతోడనే యట్టి వివాహములు చేసికొనినవారితోడను, కలసి భుజించుటకు ప్రారంభించెను. బ్రాహ్మసమాజికప్రార్థనలు ప్రయోజనకరములుగ నుండుట నెరిగినవెంటనె వానియందు పాల్గొన మొదలిడెను. ఈరీతి పరివర్తనము చూచి ఆంధ్రదేశమున ప్రచారము చేయుటకు ౧౯౦౮ సంవత్సరములో మొదటిపర్యాయము వచ్చియున్న బాబు హేమచంద్రసర్కారు బాపయ్యగారు బ్రాహ్మసమాజమున జేరుటకు ప్రథముడుగా నుండునని యాశపడి యాయనతో ఆవిషయమై ప్రస్తావించగా, మాంసభక్షణవిషయమున బ్రాహ్మసమాజికులు కనపరచు నుదాసీనత సమంజసముగా లేదనియు, తాను వారి కోరిక నీడేర్చుటకు సిద్ధముగా నుండలేదనియు, ఆయన బదులుచెప్పెను. సంస్కరణకార్యములందు ఆయన ముందంజ వేయుచుండు

టను పరికించి క్రైస్తవమిత్రులు ఆయన క్రైస్తవు డగునని యెంతయొ యభిలషించిరి. ఈ సంబంధమయిన ముచ్చట ఆయన దినచర్యపుస్తకమున నించుక కాన్పించును. ౨౯-౩-౧౯౦౬ తేదిన ఆయన యిట్లు వ్రాసికొనెను.

"చెన్నపట్టణమునకు బోవుచు రైలులో, రాత్రి మా ఫెట్ దొరగారితోడను వారి సతీమణితోడను భోజనముచేసితిని. అమాయకత్వమువలనను, అజ్ఞానమువలనను మా ఫెట్ దొరసాని నన్ను క్రైస్తవుడను కావలసిన దని కోరెను. మాటలసందర్భములో నటుతరువాత ఆమె నాస్థితిని కనిపెట్టి యాతురతతో మాటాడ నారంభించెను. ఈశ్వరుడు వారికి నిర్మలమయిన దృష్టిని ప్రసాదించి నాయెడ సానుభూతి కలుగున ట్లనుగ్రహించును గాక! దృఢముగను ధైర్యముగను జీవింపవలసినదని ఆమె నన్ను హెచ్చరించెను. మార్గము చూపుటకు నావంక చూచుచు నా యనుష్ఠానజీవనము చాల మంచిదని తలంచునట్టి యనేకయువకు లున్నారని ఆమె చెప్పెను. నేను వారిని తప్పుత్రోవను పెట్టగూడదు. అది నాకు విధింపబడిన గొప్పబాధ్యతయైయున్నది. ఈశ్వరుడు నాకు సాయపడునుగాక!"

తనకు చదువుచెప్పిన ప్రొఫెసరుగారును వారి భార్యయు తమ చిరకాలపరిచయమును పురస్కరించుకొని పైవాక్య

ములందు సూచింపబడినట్టి మతవిషయిక సంభాషణమునందు తనను దింపినప్పుడు, బాపయ్యగారు తనకు వారియెడ గల గౌరవమునకు భంగము లేకుండ తన యభిప్రాయము వెల్లడిచేయుటలో నెంతయొ మనోస్థైర్యము చూపియుండవలెను. బాప్టిజము పుచ్చుకొని క్రైస్తవుడ ననిపించుకొనుట కాయన యిష్టపడక పోయినను, గొప్ప స్వార్థత్యాగముతో సేవావ్రతమును గైకొని హిందూదేశాభివృద్ధికొరకు పాటుపడుచున్న క్రైస్తవప్రొఫెసర్ల సహవాసము చెన్నపురిలో ఆయనకు లభించినతరువాతనె ఆయన వారినుండి యెన్నియొ సద్భావములను, సదభ్యాసములను బడసెను; జీసస్ క్రైస్టు బోధించిన యున్నతాదర్శములు తన జీవితమున నలవరచుకొనెను.

ఆయన తన జ్ఞానము వికసించినకొలది బ్రాహ్మసమాజనాయకులు కనపరచిన యాదర్శములు మిక్కిలి యుదారములయిన వని గ్రహింప దొడంగెను. మన ప్రాంతములందు ప్రారంభింపబడిన బ్రాహ్మసమాజోద్యమమునందు జేరి పాటుపడ మొదలిడెను. వీరేశలింగము పంతులుగారితోడను, వెంకటరత్నము నాయుడుగారితోడను చెలిమిచేసి సంఘసంస్కరణోద్యమప్రయోజనమును పారిశుద్ధ్యవ్రతవిశేషమును తిలకించెను. ఈశ్వరోపాసనలు సమాజమునందు శ్రద్ధతో జరుపుచుండెను. పరిశుద్ధజీవనమునుగురించి యుప

న్యాసము లిచ్చుచుండెను. సంస్కరణమునం దమితోత్సాహము కనపరచుచుండెను. ఆంధ్రదేశమందు బ్రాహ్మసమాజ యువకులలో నగ్రగణ్యు డాయెను. ప్రపంచమున గల వివిధ మతములకు తోడుగ మరియొక ప్రత్యేకమతమును స్థాపించుటకు బ్రాహ్మసమాజము వచ్చియుండ లేదని ఆయన తలంచెను కాన, ఏదో నూతనమతమున చేరబోవు వారు సలుపవలసియుండునట్టి బాప్టిజమ్‌వంటి తంతు తన కనావశ్యకమని నిశ్చయించుకొనెను. బాబు హేమచంద్రసర్కారు అడిగినప్పుడే కాక తరువాత నెన్నడును కూడ బ్రాహ్మసమాజములో జేర్చుకొనుటకు కలకత్తా బ్రాహ్మసమాజికులు జరపునట్టి దీక్షాతంతునకు సహిత మాయన లోనుగాలేదు. ఆయన తన యనుచరుల నెవ్వరిని దీక్షపుచ్చుకొను డని కోరియుండ లేదు. ఏ సమయమున కే సత్యము పొడగట్టునో దాని ననుష్ఠించుచు మానవాత్మ ధర్మమార్గమున అనంత యాత్ర సలుపవలసియుండు నని ఆయన యభిమతము. ఈశ్వరోపాసనను సాధనముగా జేసికొని సర్వమానవులు సంపూర్ణ సత్యము గ్రహించుటకు కృషి సలుపునిమిత్తము తోడ్పడుటకే బ్రాహ్మసమాజము ప్రతిష్ఠింపబడుటను ఆయన చక్కగ గమనించెను. తనయం దెన్నిమార్పులు కలిగినను, తన మతాభిప్రాయము లెంత యుదారత జెందినను, ఆయన

యేనూతననామము ధరింపక తనకు జన్మతో వచ్చిన దేశసంబంధమైన 'హిందూ' అను పేరునే నిలుపుకొనెను. పాలపర్తి నరసింహముగారు ఒక దరఖాస్తులో తన మతమును గురించి యేమి వ్రాసికొనిన బాగుండు నని బాపయ్యగారిని సలహా నడుగుచు వ్రాసిన యుత్తరమునకు బాపయ్యగారు ౨౫-౮-౧౯౦౭ తేదిన వ్రాసిన ప్రత్యుత్తరమునందు ["The best thing is to say casteless Hindu or a Hindu Brahmo. There shall be no objection to the word Hindu. I am myself no authority on the point......Do as you think best."] "వర్ణభేదము పాటింపని హిందు వని కాని హిందూ బ్రాహ్మ డని కాని చెప్పుట సముచితము. హిందూశబ్దమునకు నెట్టి యాక్షేపణయు నుండకూడదు. ఈవిషయమై నిశ్చితాభిప్రాయము తెలుపుటకు నాకును తగినయధికారము లేదు. నీకు మంచి దని తోచినట్లు చేయుము." అని తెలిపియుండిరి. ఏ జాతి విత్తనమునుండి ఆజాతి మొలకయె ఆ జాతి వృక్షమె బయలువెడలి అవి ఆ జాతియొక్క పేరుననె పిలువబడుటను గమనించిన వారెల్లరు బాపయ్యగారి యభిప్రాయ మెంత యుక్తియుక్తముగా నున్నదో గ్రహింపగలరు. ఆయన మొదట అవలంబించియున్న హిందూమతమె క్రమవికాసము జెంది పరిశుద్ధరూపము దాల్చెను.

జీవనస్మృతి

౧౦వ ప్రకరణము

సర్వతోముఖవికాసము

జాన్ స్టూవర్టు మిల్ రచించిన 'స్త్రీల పరాధీనత' (The subjection of women) యను గ్రంథమును చదివి బాపయ్యగారు నోటుబొక్కులో వ్రాసిపెట్టుకొనిన భావములలో 'After the primary necessities of food and raiment, freedom is the first and strongest want of human nature.' అనునది యొకటి. ముఖ్యమయిన యక్కర లగు తిండి, బట్ట తరువాత మానవప్రకృతి కావశ్యకమయిన మొదటి బలవత్తరమయిన యక్కర స్వాతంత్ర్యము—అని దాని యర్థము. ఆ సూత్రము తెలుపుచందమున బాపయ్యగారు అన్నపానీయముల తరువాత స్వాతంత్ర్యమును ప్రథమమున పొందదగిన దానిగా జేసికొనె ననుట కిసుమంతయు సందేహములేదు. ఆకలిదప్పు లేలాటివో స్వాతంత్ర్యాభిలాష ఆలాటిది. క్షుత్తు ఆహారముకొరకును, దాహము జలముకొరకును మానవుల పరితపించునట్లుచేయును.

స్వాతంత్ర్యవాంఛ జనించినతరువాత అదియు స్వాతంత్ర్యము కొరకు మానవహృదయములు తీవ్రముగ తపించునట్లు చేయును. బాపయ్యగారి స్వాతంత్ర్యజీవన మిట్టి పరితాపముతో గూడి యాయన జీవితముయొక్క సకలకార్యముల లోనికి వ్యాపించినది.

మతమునకును సంఘమునకును సంబంధించిన సంకుచితాదర్శములకు, ఆచారములకు, కర్మలకు, దాస్యము సలుపుటను ఆయన మానెను. జందెమును విసర్జించిన సందర్భమును ఆయన దినచర్యాపుస్తకమునం దీతీరున ౨౧-౮-౧౯౦౫ తేదీన వ్రాసికొనెను.—"ఈరోజు నా కొకసుదినము ఏలయన, నాకు సత్యమని తోచినదానిని ఆచరించుటకు దయామయు డగు పరమేశ్వరుడు నా కెక్కువవెలుతురును కటాక్షించియుండెను. రాత్రివేళ ఈశ్వరాదేశప్రోద్బలముచే నేను జందెమును తీసివేసితిని. జందెమును తీయునప్పుడు, నా చేతులు వణకెను. కాని ప్రార్థనతోడను, ప్రార్థనపూర్వకమయిన యంతఃకరణముతోడను, జందెమును ఆవల నుంచితిని. సర్వకారుణికు డయిన పరమేశ్వరుడు తాను చూపు మార్గమున నడచుటకు నా కధికముగ శక్తిని అనుగ్రహమును ప్రసాదించును గాక!" జందెము నిట్లు త్యజించి గభీరమనస్కుడై ఆయన యుండినతరి, బంధువులందు కలవరము

బయలుదేరెను. వారిలో ముఖ్యులు, ఆయన పినతండ్రి సీతారామారావుగారు మొదలయినవారు, ఆయనను అది జరిగిన వారముదినములలోనె కలసికొని ఆ మార్గమునుండి తప్పించుటకు ప్రయత్నించిరి. ఏయభిప్రాయములు కలిగియున్నను, పైకి నలుగురితోపాటు నడుచుకొను మని వా రాయనను ముఖ్యముగ కోరిరి. వారివాదములు గాని, ఆగ్రహావచనములు గాని, జాలిమాటలు గాని ఆయనను చలింప లేదు. "Oh God! save me from hypocrisy and insincerity."—ఓ దేవా! కాపట్యమునుండియు, ఆత్మద్రోహమునుండియు నన్ను కాపాడు మని ఆయనప్రార్థన యై యుండెను. జందెము తీసినతరువాత సుమారు రెండుమాసములలో ఆయన తల్లియొక్క యాబ్దికము జరుపవలసి వచ్చెను. దానిని జరిపిన నవీనవిధానము ౧౬-౧౦-౧౯౦౬ తేదిక్రిందను ఆయన యిట్లు వివరించెను. "నేడు నాతల్లియొక్క యాబ్దికము పరిశుద్ధాస్తికపద్ధతిని జరుపబడెను. కొంచెము బియ్యము తగినబీదలకు పంచిపెట్టబడెను. యథార్థమానవుడనుగా జనులదృష్టికి నచ్చునట్లు జీవింప ఈశ్వరుడు నాకు వలసినంత యనుగ్రహమును ప్రసాదించు గాక! నన్ను శక్తివంతునిగాను పరిశుద్ధునిగాను జేయును గాక! ఉదయము ఏడున్నర గంటలకు ఈశ్వరోపాసన యేర్పరుపబడెను. వీరేశ

లింగము పంతులుగారు ఆ శ్రాద్ధసంబంధమయిన యుపాసనను సలిపిరి. ఈదిగువ పేర్కొనబడినవారు అందునకు వచ్చియుండిరి. (పదునార్గుర పేరులు గలవు). ఉపాసనావిధానము పండిత శివనాథశాస్త్రి ఎమ్. ఏ గారు వ్రాసి పంపిరి. ఉపాసన చాలభక్తితో గూడియుండెను. కొద్దిమాటలుమాత్రమె చెప్పుటకు నేను నోరు తెరచినప్పుడు నాచెక్కిళ్ళమీదికి కన్నీళ్ళు బొటబొట కారెను. పూర్వ మెన్నడును నే నంత భక్త్యావేశము జెంద లేదు. ఈశ్వరుడు నన్నును నాతల్లియొక్క యాత్మను ఆశీర్వదించును గాక!" ఈవిధముగ తల్లి యాబ్దికము జరిపిన సుమారు నాలుగుమాసములకు ౧౨-౨-౧౯౦౭ తేదిన తండ్రిగారి శ్రాద్ధమును ఆయన యిటుల జరిపినట్లు వ్రాసికొనెను.---"పంతులుగారు ఈశ్వరోపాసన గావించిరి. ఉపాసనానంతరము జాతిమతవివక్షత లేమాత్రము పాటింపని (cosmopolitan) విందొకటి యేర్పరుపబడెను. ఈదిగువ పేర్కొనబడిన పదిమందియు ఆవిందునకు వచ్చిరి. (౩ బ్రాహ్మణుల యొక్కయు, ౪ వైశ్యుల యొక్కయు, ౨ శూద్రుల యొక్కయు, ౧ క్రైస్తవునియొక్కయు నామములు పొందుపరుపబడినవి)...ను,...ను మరికొందరు విద్యార్థులును ఉపాసనకు మాత్రము వచ్చిరి. వంటనేర్చిన యొకరు దయతో చేసిన సాహాయ్యముతో వంటయంతయు నేనే చేసితిని. ఈచిన్ని

కార్యమును జయప్రదముగ నిర్వహింప నాకు శక్తిని ప్రసాదించి నందులకు ఈశ్వరుని స్తుతించుచున్నాను.'' ఈవిందును గురించిన వృత్తాంతము సత్యవాదినిపత్రిక ప్రచురింపగా, విందునకు వచ్చిన యొకరు తనను ప్రార్థనసమాజికునిగా జనులు భావింతురని తలచి, తన విశ్వాసములు ప్రార్థన, లేక బ్రాహ్మసమాజమువంకకు తనను మరల్చుట లేదనియు, సాంఘిక విషయములలోనె గాక మతవిషయములందు గూడ సంపూర్ణవ్యక్తిస్వాతంత్ర్యమునకై తాను పోరాడువాడననియు సత్యవాదిని పత్రికకు ఒక లేఖను వ్రాసిరి. అందునకు జవాబుగా సాంఘికవిషయములలోనె గాక మతవిషయములందు గూడ వ్యక్తిస్వాతంత్ర్యమునకై రాజీకొరకు చూడక ధైర్యముతో పోరుసలుపునట్టిసంస్థయె ప్రార్థనసమాజముకూడ నని బాపయ్యగారు వ్రాసినది, సత్యవాదినిలో సంపాదకీయముగ ప్రచురింపబడెను. ఈచర్చవలన, వ్యక్తిస్వాతంత్ర్యమున కవకాశమిచ్చునది యగుటచేతనే, బాపయ్యగారు ప్రార్థనసమాజమునందు పాటుపడబూనిరని స్పష్టపడుచున్నది. వ్యక్తి స్వాతంత్ర్యాభిలాష వలన ఆయన మతసాంఘికవిషయములం దెటువంటి మార్పునొందెనో చూడుడు. విగ్రహారాధనను విడిచి యేకేశ్వరోపాసకుడుగను, జాతిభేదమును మాని సర్వమానవకోటికి జెందినవాడుగను మారెను. పూర్వాచారమును ఎంతభక్తితో ననుసరించెనో యంతభక్తితోనె యీ నవీనపద్ధతినికూడ ఆయన యవలంబించినట్లు పాఠకులు గమనించియె యుందురు.

ఇక రాజకీయవిషయములం దెంతస్వాతంత్ర్యవాంఛను ఆయన కనపరచెనో చూతము. ౧౯౦౭ వ సంవత్సరములో భారతదేశము నుర్రూతలూగించిన రాజకీయాందోళనము ఆయన కెట్టిభావములు స్ఫురింపజేసెనో, ఆయనను ఎట్టికార్యములు చేయుటకు పురికొల్పెనో, వానినిబట్టి ఆయనయొక్క రాజకీయస్వాతంత్ర్యాభిమానము మనము కొంత గ్రహింపగలము. దినచర్యపుస్తకమందు ఆయన వ్రాసికొనిన యంశములు కొన్ని సందర్భానుసారముగ నిచట సమకూర్పబడును. "శ్రీజత్ బిపిన్‌చంద్రపాలు నేటి (౧౯-౪-౧౯౦౭) యుదయము (రాజమహేంద్రవరమునకు) అరుదెంచిరి. జనులు ముఖ్యముగా విద్యార్థులు కనపరచిన సంతోషము, ఆతురత, ఉత్సాహాము అమితముగా నుండెను. సమితివారిచే వారికి స్వాగతోపన్యాస మీయబడెను. పాలుగారు వందేమాతరముయొక్క యంతరార్థమును వ్యక్తపరచిరి. మాతయందు ప్రత్యక్షమగు ఈశ్వరకారుణ్యమె (ఆమంత్రమందలి మూలభావము). నా కెంతోకష్టముగా నున్నను ఊరేగింపుతోడ నడచితిని. పాలుగారితో భోజనము చేసితిని. *ఒక జాతీయ

*భిన్న జాతిమతములకు జెందిన వారి నాహ్వానించి ఆవిందును బాపయ్యగారు జరిపించిరి.

విందును ఏర్పాటుచేయుటకు నుత్సాహముతో ప్రయత్నించితిని. సాయంకాలము నవశక్తినిగురించి పాలుగారుపన్యాసము గావించిరి. (ఉపన్యాససారాంశము ఇచట కలదు.) ఈ ప్రసంగము నాయందు నూతనోత్తేజము కలిగించినది. ఈ యవకాశము లభించినందులకు సర్వేశ్వరునకు ధన్యవాదము లర్పించుచున్నాను. రాజకీయస్వాతంత్ర్యముకొరకు త్యాగముచేయుట యన నేమియో నా కిప్పుడు అర్థమగుచున్నది. ఎంతత్యాగముతోడనయినను వ్యక్తిస్వాతంత్ర్యము కాపాడబడవలెను. బ్రాహ్మసమాజ మీయాదర్శమున కెక్కువప్రాముఖ్యత నొసంగినది. స్వరాజ్యాదర్శము సాధింపబడవలసియున్నది. ప్రాచీనకాలమందువలె ఒక్కధ్యానమువలన మాత్రమె గాక, వ్యక్తినుండి కుటుంబముద్వారా, సంఘముద్వారా, రాజ్యాంగముద్వారా బహిర్గతమగు జీవితమువలన కూడ మానవులు పరమాత్మను సమీపింపగలరు. స్వాతంత్ర్యము, సజీవదేశభక్తి, జాతీయత యీ నవశక్తియొక్క లక్షణములు."

"స్వరాజ్యమునుగురించి పాలుగారు (౨౦-౪-౧౯౦౭ తేదిన) ప్రసంగము గావించిరి. బ్రిటన్‌యొక్క యధికారమునకు లోబడిన స్వరాజ్యము అర్థములేని యరఘు అని వారు నిరూపించిరి. మన స్వరాజ్యమె మనకు స్వయముగ పన్నులు

వేసికొనుటకు, స్వయముగ పరిపాలించుకొనుటకు, స్వయముగ శాసనములు నిర్మించుకొనుటకు, మనదేశములోనికి విదేశీయులను రానిచ్చుటకుగాని రానీయకుండుటకుగాని స్వాతంత్ర్యము కలిగియుండుటకు అవకాశ మొసంగును. ఇది స్వరాజ్యముయొక్క యున్నతాదర్శము; నిజమయిన దేశపుత్రులందరకు తృప్తికరముగ నుండకమానదు.''

(౨౩-౪-౧౯౦౭ తేదిన) సాయంకాలము పాలుగారు జాతీయవిద్యనుగూర్చి తమ కడపటియుపన్యాస మొసంగిరి. జాతియొక్క పరమావధిని సాధించుటకు ప్రయత్నించునప్పుడుమాత్రమె విద్యావిధానము జాతీయ మయినదని పిలువబడవచ్చును. వారు మిక్కిలి యుత్సాహముతో ప్రసంగించిరి. (జాతీయపాఠశాలకొరకు) వచ్చిన విరాళములు ప్రకటించిరి. ....ఈ జాతీయపాఠశాలను ఈశ్వరు డాశీర్వదించునుగాక! అది రూపము దాల్చునట్లు చేయబడి భక్త్యుత్సాహములతో నడపబడునుగాక!''

"పాలుగారు పురికొల్పిన యుత్సాహము యువకులయొక్కయమాయకచిత్తములను వశపరచుకొనెను. హరిసర్వోత్తమరావు కాలేజినుండి ౨౪ వ తేదిన వెళ్ళిపొమ్మని యాజ్ఞాపింపబడెను. ఆయనకు డిస్‌మిసల్ ఉత్తరు వీయబడెను. హనుమంతరావును సాంబశివరావును వందేమాతరము బాడ్జి

లను తీయుట కటులనె నిరాకరించినందులకు వెంటనె డిస్మి
స్ చేయబడిరి. ఈయువకులు ధర్మమార్గమున నడువగలందు
లకు పరమేశ్వరుడు వారికి ధైర్యస్వభావమును సరియయిన
దృష్టిని అనుగ్రహించును గాక!''

"హైందవజాతియొక్క మహావీరుడు లాలాలజపత్రా
యి అరెస్టుచేయబడి ' అండమాన్ దీవులకు పంపబడనున్నా
డని మెయిలు పత్రికయందు (౧౧-౫-౧౯౦౭ తేదిన) చదివి
నాను. ఓసర్వకారుణికుడవయిన దేవా! విదేశీయుల నిరంకుశ
పాలనమునుండి విముక్తిని బడయుటకు ఈదేశవాసులు సలు
పు పోరాటము జయించునట్లు నీ ప్రేమాతిశయముచేత నీవు
వారికి తోడ్పడుము. దేశమునకు వాటిల్లెడు సర్వవిపత్తులను
తొలగింపుము. ధర్మమార్గమున నీబిడ్డలను నీవు నడపుకొను
ము. తండ్రీ! మమ్మాశీర్వదించి పిరికితనమువలన వచ్చు అపా
యమునుండి మమ్ము రక్షింపుము.''

"అరెస్టుకాబడినతరువాత లజపత్రాయి ఒకమిత్రుని
కిట్లు వ్రాసెను:—'నావిషయమై ఆదుర్దపడ వద్దు. ఈశ్వరు
డేమి చేసిన, అది మంచికొరకే చేయును.' మహాశోధన
సమయమున ఆమాటలు చెప్పగలిగిన యాయనకు స్థిరకీర్తి
కలుగు గాక! ఈశ్వరు డాయనను ఆశీర్వదించు గాక! లజ
పత్రాయికి ధర్మోత్సాహము కలిగించినట్టి దేశాభిమానము

నిజమయిన భారతీయులందరకు ఆయన ప్రసాదించును గాక!*

రాజకీయ స్వాతంత్ర్యమునకై బాపయ్యగారి హృద
యము తపించి పోవుచుండినటుల ఆయన వ్రాతలవలననె
వెల్లడి యగుచున్నది. మతసాంఘిక విషయములందువలెనె
ఆయన రాజకీయ విషయములందును స్వాతంత్ర్యప్రియుడై
యుండెను. కొందరు మతసాంఘికదాస్యము విడిచినను రాజ
కీయదాస్యమును సలుపుచుందురు; అటులనె మరికొందరు
రాజకీయదాస్యమునుండితమయాత్మలకుస్వతంత్రముగనుంచు
కొనగలిగినను మతసాంఘికవిషయములందు దాసానుదాసులై
యుందురు. ఈయిరు తెగలవారు జీవితములో నొకభాగమును
మాత్రమె పెంపొందించుకొను వారు. వారిది సర్వతోముఖ
మయిన యభివృద్ధి గాక పాక్షికోన్నతి. శరీరమునకు నిజ
మయిన బలము కలిగిన, ఆ బలమువలన శరీరమందలి సర్వావ
యవములు పుష్టివంతము లయి దృఢముగా నుండును. ఒక
కాలు లావుగా నుండి ఒక కాలు సన్నగా నున్నప్పుడు, శరీర
మందు బలముగాక వ్యాధి కలదని నిశ్చయింతుము. స్వాతంత్ర్య
మనునది ఆత్మకు సంబంధించిన యొక స్వభావము. ఆత్మ నిజ
మయిన స్వాతంత్ర్యమును పొందెనేని జీవితముయొక్క శాఖ
లన్నిటియందు స్వతంత్రముగనె చరించును. కొన్ని విషయము
లలో కనబడి, కొన్ని విషయములలో కనబడని స్వాతంత్ర్యము

సరియయినది గాదు. దానియం దేదో దోషముండును. దాని వలన వికృతజీవితము లేర్పడును. స్వాతంత్ర్యము జీవితమునందు సర్వముఖముల వ్యక్తమగునప్పుడే జీవితము సంపూర్ణవికాసము గాంచి సుందరముగ నుండును. బాపయ్యగారి జీవితసౌందర్యమునకు హేతువు వారిజీవితము సర్వతోముఖవికాసము గాంచుటె. స్వదేశవస్త్రములనె ధరించుచు, స్వరాజ్యోద్యమమున పాల్గొనుచు, సర్వమానవులయెడ సౌభ్రాత్రమును కనపరచుచు, సమస్తసత్కార్యములందు పాటుపడ నుద్యుక్తుడగుచు బాపయ్యగారు సమగ్రజీవనమును వృద్ధి నొందించుటచే, ఆయన పరిచయములోనికి వచ్చిన సంఘసంస్కర్తలుగాని రాజ్యాంగసంస్కర్తలుగాని యెల్లరు ఆయనను అమితముగ ప్రేమించిరి. రాజారామమోహనరాయి స్వతంత్రజీవనము యొక్క స్వరూపమును భారతవర్షమున **మొదట** ప్రదర్శించి నవయుగపితామహు డని కీర్తిగాంచెను. రామమోహనుని యడుగుజాడలనె నడచి ఆ మహాపురుషునివలె సర్వతోముఖసంస్కరణము కొరకు బాపయ్యగారు జీవితమును ధారపోసిరి. ఆయన తన తండ్రిగారి శ్రాద్ధసందర్భముగా జరపించిన కాస్మాపాలిటన్ డిన్నరువలన గోదావరినది నిప్పంటుకొని మండిపోయె నని ఆదినములలో చెప్పుకొనబడెను. స్వాములవారు ఆయనకు శ్రీముఖము నంపిరి. సంఘము ఆయనను

బహిష్కరించెను. బంధువు లాయనను దూరముచేసిరి. ఆయనకు సాయపడగల మిత్రులు లేకపోయిరి. వంటకు మనుష్యుడు, బ్రాహ్మణుడే కాదు, బ్రాహ్మణేతరుడయినను దొరకక, జబ్బు వచ్చినప్పుడు సరియయిన యుపచారము జరుగక, నిరుపేదకువలె ఆసుపత్రులె ఆయనకు శరణ్యములు కాగ జీవితమెట్టికష్టములకు లోనుగావలసివచ్చినను ఏమాత్రము జంకక ప్రాణము పోవువరకు ధర్మసమరము సలిపిన మహాయోధులు బాపయ్యగారు. ౨౬-౮-౧౯౦౬ తేదిన ఆయన యీవిధముగ దినచర్యపుస్తకమందు వ్రాసికొనెను:— "ఉద్యోగసంబంధమయిన పనిమీద మా మామగారు ఇక్కడికి రాగా, వారిని కలసికొంటిని. నా దేహస్థితినిగురించి కొంత యుదాసీనముగ వారు మాటాడిరి. నేను తీసికొనుచున్న జాగ్రత్త వారికి తృప్తికరముగ లేదు. నచ్చచెప్పుటకు నేను ప్రయత్నింపగా, మనస్సునకు కష్టము కలిగి వారు నిరుత్సాహము జెందిరి. సర్వకారుణికుడైన పరమేశ్వరుడు వారికి మనోశాంతిని ప్రసాదించును గాక! ఆయనను వారి పుత్రికను నావిషయమై ఆదుర్దపడు వారందరిని ఆశీర్వదించును గాక! ఓ తండ్రీ! సర్వవిషయములందు నీయాజ్ఞను శిరసావహించుటకు నేర్పుము. నా బుద్ధియొక్కయు, నైతికజీవనముయొక్కయు, ఆత్మయొక్కయు, శరీరముయొక్కయు, వృద్ధివికాసములకు నేద చేయు

ట యుచితమొ దానినె చేయుటకు అపారవాత్సల్యముతో నీవు నాకు శక్తి నొసంగుము. తండ్రీ, స్వవినాశమునకు దారి దీయునది యని యితరులు తలంచు పద్ధతినుండి నన్ను దూరముగ నుంచుము; తప్పుతోవను పోకుండ కాపాడుము'' బాపయ్యగారు తమ ధైర్యస్థైర్యములను, పరమేశ్వరునియందు సంపూర్ణవిశ్వాసము గలిగి త్రికరణశుద్ధితో ఆయనను ప్రార్థించుటమూలమున, బడయగలిగె నని సువిదితము. ఈశ్వరప్రార్థన బాపయ్యగారి జీవితమును సార్థకము జేసినది. రావుబహద్దరు కందుకూరి వీరేశలింగము పంతులుగారు బాపయ్యగారికి 'A sincere theist' యథార్థఈశ్వరవిశ్వాసి యను బిరుదును ఇచ్చి ఆయన సమాధిపై ఆయననామముక్రింద దానిని చెక్కించుట యెంతయొ సమంజసముగా నున్నదని పాఠకు లేకగ్రీవముగా నంగీకరింపకుందురా?

జీవనస్మృతి

౧౧ వ ప్రకరణము

వివాహము

బాపయ్యగారు చెన్నపురిలో బి. ఏ సీనియరు చదువుచుండగా, డిప్యూటికలెక్టరుద్యోగము చేసి ప్రస్తుతము విశ్రాంతి గైకొని రాజమహేంద్రవరములో నివసించుచున్న దావులూరి ఉమామహేశ్వరరావుగారు తమ ద్వితీయపుత్రిక శ్రీమతి అలివేలు మంగతాయమ్మగారిని ఆయనకు ఇచ్చి కాకినాడలో ౧౯౦౨ సంవత్సరమున వివాహము జరిపిరి. మంగతాయమ్మగారికి వివాహము నాటికి సుమారు పది సంవత్సరము లుండును. బాపయ్యగా రామెను ఆవయసున వివాహమాడుట కెట్టిసంకోచము కనపరుప లేదు. ఆమెను స్వయముగా చూచి తృప్తిపడి పరిణయమున కాయన యంగీకార మొసంగెను. బి. ఏ సీనియరు చదువుకొనుచు ఆయన బాల్యవివాహమున కెట్లు సమ్మతించెనని పాఠకులకు కొంతసంశయము కలుగవచ్చును. వివాహసమయమునకు ఆయనవయసు ౨౦ సంవత్సరములు. హిందూసంఘమున

వివాహసంబంధమయిన ఆలోచనయు ప్రయత్నమును పెద్దల
లోనె బయలుదేరి వివాహమన నేమొ యెరుగని పసివాండ్ర
నందునకు ప్రేరేపించుచుండును గదా! ఆడుపిల్లలు గల
తండ్రులు తమ పుత్రికలకు తగినవరులను సంపాదించుటకు
విద్యార్థులను గావించుటయు నెల్ల రెరింగిన విషయమె.
ఉమామహేశ్వరరావుగారి దృష్టిలో బాపయ్యగారు పడిరి.
వారి కుమార్తెను వివాహము చేసికొనవలసినదని ఆయనకు
మిత్రులు సలహా చెప్పిరి. ఆయనతల్లి, పినతండ్రి మొద
లయినవారు కూడ, కళాశాలవిద్య పూర్తి యగుచుండుటను
బట్టి త్వరలోనె ఆయనకు పెండ్లిచేయ సమకట్టిరి. వివాహా
లోచన ఆయనమీదికి త్రోసికొనివచ్చెను. చెన్నపురికి వెళ్లు
వరకు ఆయన శుద్ధశ్రోత్రియుడై యుండి అక్కడికివెళ్ళినప్పటి
నుండియె మెల్లమెల్లగా మార్పు జెంద నారంభించె నని యిది
వరకె తెలుపబడినది. ఆయన ఆతరుణమున వివాహాలోచన
విధిగ చేయవలసివచ్చెను. బాల్యవివాహము నిరాకరింపదగిన
దని నిశ్చితాభిప్రాయము కలిగియుండుటకు గాని, దానికి
లోనుగాకుండుటకు దృఢసంకల్పుడగుటకు గాని, ఆయనకు
తగిన సావకాశము లేకపోయెను. ఎటు లయిననేమి, ఆయన
బాల్యవివాహబంధమున తగుల్కొనెను. కట్నములు పుచ్చు
కొన గూడదనియు, భోగముమేళములు చూడగూడదని

యు సంస్కరణభావములు కొన్ని అప్పటి కాయనహృదయ
మున పాదుకొనియుండెను. పెండ్లిలో అలకరోజున 'నీకేమి
కావలె' నని మామగా రాయన నడుగగా, మీ యాశీర్వచ
నము తప్ప నాకింకేమియు నక్కరలేదని ఆయన బదులు
చెప్పెను. మామగా రప్పుడు తమకు తాముగా నొక గడి
యారమును బహుమానముగ నిచ్చిరి. సంతోషముగా గడచి
పోవలసిన వివాహదినములు, సాధారణముగ ప్రస్తుతపద్ధతుల
ప్రకారము వేళలకు నిద్రాహారములు లేకయు, విశ్రాంతిగ
కొంచెము సేపు గూడ నొకచో కూర్చుండుటకు అవకాశము
లేకయు, వివాహము జరపించువారును అందునకు వచ్చువా
రును ఎల్లరు క్షోభపడునంతగా, గందరగోళముతో గూడి
యుండును గదా? దానికి తోడు కట్నపుపేచీలు తరచు కలహ
ములకు కారణము లగుచు, సంతోషమునకు బదులు మన
స్తాపమె ఆరోజులలో మిక్కుటముగా నుండుట నెరిగిన బాపయ్య
గారు తమ స్వభావమునుబట్టియె యట్టికష్టము కలిగింప
జాలరు. భోగముమేళము లాయనకు గిట్టవని యెరింగి పెండ్లి
లో పెద్దవారె వానిని పెట్టింపలేదు. మామగారు తగినసం
బంధము దొరకినదని సంతోషించుచుండ, వేడుకలయందు
పాల్గొనుచు బంధువులంద రానందించుచుండ, బాపయ్య
గారి వివాహ మతివైభవముతో జరగెను.

వివాహమునాటికె బాపయ్యగారి యభిప్రాయములందు కొంతమార్పు కలిగెను. ఆమార్పు క్రమక్రమముగా పెరిగిపోయెను. నమ్మినట్లు నడచుకొను స్వభావము కలవా డగుటచే, ఆయనవర్తనములో గూడ నవి కాన్పింప నారంభించెను. ఆయన పరివర్తనమును వేగిరపెట్టిన ఘటనలు రెండు ముఖ్యముగ గలవు. ఆయన తనచెల్లెలు అన్నపూర్ణమ్మను విశేషముగ ప్రేమించెడువాడు. అబలా సచ్చరిత్రరత్నమాల మొదలయిన యుత్తమగ్రంథములు ఆమెచేత చదివించుచు, ఆంగ్లభాషయందు గూడ నామెకు ప్రవేశము కలిగించుచు, ఆమె విద్యవిషయములో నెంతయొ శ్రద్ధ వహించెను. ఆమెకు కావలసినవస్తువులు చెన్నపట్టము నుండి తెచ్చియిచ్చుచు నామెయెడ నమితానురాగముతో మెలగుచుండెను. ఆమెను అత్తవారింటికి పంపవలసివచ్చినప్పుడు, ఆయనమనస్సు ఎంతో కష్టపడెను. ఆమెపెట్టెను తానె సర్ది ఆమె తన కుత్తరములు వ్రాయుటకు తనవిలాసము గల కవరులుకొన్ని యందు పెట్టి ఆమెను స్వయముగ తీసికొని వెళ్ళి రాజమహేంద్రవరములో నత్తవారియింట దిగవిడిచెను. మరికొద్ది రోజులతరువాత అచటికి తిరిగివెళ్ళి తనచెల్లెలిని తనతో పంపుడని కన్నుల నీరు గ్రుక్కుకొనుచు ఆమెయత్తగారిని దీనముగ నడిగెను. అప్పు డత్తగారు పక

పక నవ్వుచు ‘ఇదేమి బాపయ్యా! నిన్న గాక మొన్న దిగవిడిచి వెళ్ళావు. ఇవాళ వచ్చి తీసుకొని పోతా నంటావు. పిచ్చివాడవుగా ఉన్నావు. మీచెల్లెలు విషయంలో నీవేమీ బెంగపెట్టుకోకు. కొన్నిరోజులు పోయినతరువాత పంపుతాములే.’ అని ఆయన నోదార్చి పంపెను. చెల్లెలియం దంత వాత్సల్యముతో ఆయన చరించుచుండగా, ఆమె యటుపిమ్మట గర్భవతి యగుటయు, ఆడుశిశువును ప్రసవించిన కొలది మాసములలో అకాలమృత్యువాత బడుటయు తటస్థించెను. ఆమెయంత్యదినములలో నుపచారములు చేయుచు ఆయన ఆమెవద్దనె యుండెను. ఆమె ప్రాణము విడచుట కన్నులార గాంచెను. భరింపరాని దుఃఖసాగరమున మునిగెను. ఇది ౧౯౦౩ సంవత్సరములో సంభవించెను. ౧౯౦౪ వ సంవత్సరాంతమున ఆయనయె తీవ్రవ్యాధిపీడితుడయిన సంగతి యిదివరలో నొకసందర్భమున వ్రాయబడి యుండుటను చదువరులు జ్ఞాపక ముంచుకొని యుందురు. ఆ వ్యాధివలన ఆయన మృత్యుగహ్వరమున ప్రవేశించినను, ఈశ్వరానుగ్రహముచే అప్పటి కా మరణాపాయము తొలగెను. తన చెల్లెలి యకాలమరణమును, తన భయంకరజాడ్యమును- ఈ రెండు ఘటనలు-ప్రాపంచికజీవితము అశాశ్వతమని ఆయన కన్నులకు కట్టినట్లు స్పష్టపరచినవి. ఐహికజీవితము అస్థిర

మని వ్యక్తపడినకొలది ధర్మజీవనమునం దాసక్తియు దృఢతయు హెచ్చును. తనయాత్మయం దంకురించిన శాశ్వతసత్యములు అశాశ్వతమయిన ప్రపంచసంబంధమయిన యాలోచనలతో నణచివేయబడుట కేవలము ఈశ్వరద్రోహ మని ఆయన గ్రహింపగలిగెను. తన కారోగ్యము కలిగి తిరిగి శరీరశక్తి చేకూరుచు రాగా, ఆయన వివిధములయిన సంస్కరణకార్యములందు ప్రవేశించి అంతరాత్మ ప్రేరేపించినటుల ప్రవర్తించుచు ధర్మసమరమున ధీరుడై నిలచెను.

చిన్నదీపము ఒక యింటివారు తమ యింటిలోనె యుంచుకొని తామె యుపయోగించుకొనవచ్చును. సూర్యుడు ఆవిధముగా ఒక గృహములోనివారు మాత్రమె యుపయోగపరచుకొనుటకు వశుడుగాక జగత్తున కంతకు నుపయోగపడును. విసనకర్ర ప్రతిమనుజుడు చేతిలో పట్టుకొని తనకొరకె వాడుకొనవచ్చును. వాయువు అట్లు ఏయొక్కరి సుఖముకొరకును బంధింపబడుటకు సాధ్యమగునది గాక విశ్వమున కంతకును సౌఖ్య మొనగూర్చును. ఎవరి దొడ్డిలో వారు బావి త్రవ్వుకొని అందలి నీరు వారు మాత్రమె యనుభవింపవచ్చును. మహానది యేకొందరికో గాక సర్వమానవులకు జలమును ప్రసాదించును. సామాన్యమానవులు స్వల్పశక్తులు గలవారు; ఒక్క కుటుంబముకొరకు వినియోగపడి

ఆ కుటుంబసేవతోనె వారి జీవితములు చరితార్థత నొందును. ‘ఉదారచరితానాంతు వసుధైవ కుటుంబకమ్’ అను నార్యోక్తిచొప్పున విశాలహృదయులును విశేషశక్తిసంపన్నులును నగు మహాపురుషులకు పృథివియె కుటుంబము. ఆ మహనీయులు లోకసంగ్రహమునకు జీవింపవలసినవారు. వారిని ఏ చిన్నకుటుంబముకొరకో జీవించునట్లు చేయుట యసాధ్యము. అల్పప్రయోజనములను, సామాన్యగృహజీవనములను లక్ష్యములుగా గల జనులు ఆ యుత్తమపురుషుల చర్యల నర్థముచేసికొనజాలరు; ఆ వీరపురుషులను వెర్రివారినిగా పరిగణింతురు; ఆ ధర్మశూరులను అధర్మమున కొడిగట్టినవారినిగా తలపోయుదురు. ఆ యీశ్వరభక్తులను ప్రేమశూన్యులనుగా భావింతురు. ఇది యంతయు లోకమున ప్రతి ధర్మవీరుని విషయమున జరగుచువచ్చిన గాథయె. బాపయ్యగా రుదారచరితులై కుటుంబావరణమును దాటి ప్రపంచముకొరకు పాటుపడుచు ధర్మసంస్థాపనమునకై జీవితమును ధారపోయునప్పుడు, ఆయనకూడ నితరపుణ్యపురుషులవలె బంధువులచేతను సామాన్యజనులచేతను నిరసింపబడెను. సాధారణకుటుంబజీవనము ఆయనపరమావధి కానప్పుడును, అధర్మముతోడను అసత్యముతోడను రాజీచేసికొనుచు ప్రాపంచికసౌఖ్యమును భద్రపరచుకొను లౌకికజీవనము ఆయన

యాదర్శము కానప్పుడును, ఆయన ఒక్క కుటుంబమునకు మాత్రమె, కొలది వ్యక్తులకొరకె యెట్లు పాటుపడగలడు? అట్లుపయోగపడక పోవుటయె ఆయనయందలి దోషము.

మరియు వీరపురుషుల చరిత్రలు గొప్ప తుపానులవలె, భూకంపములవలె కొంతనష్టమునకును వినాశనమునకును హేతుభూతము లగును. కాని వాతావరణమున సమస్థితి యేర్పడుటకె తుపానులును, భూగోళము చక్కనిరూపు దాల్చుటకె భూకంపములును సంభవించును. కొన్నిప్రాంతములందు అనివార్యముగ గొంతనష్టము కలిగినను వానిమూలమున మొత్తము మీద మేలే చేకూరును. అటులనె మహాపురుషుల జీవితములవలన మొత్తముమీద లోకశ్రేయము సమకూరుచున్నను కొందరికి నష్టము వాటిల్లుట కలదు. బాపయ్యగారు ధర్మజీవనము గడపుటచే, ఆయన బంధువులకు ముఖ్యముగా పిన్నవయస్కురాలయిన ఆయన భార్యకు తీరని కష్టము సంఘటిల్లినది. తానిట్టి బాధ కలిగింపవలసివచ్చినందులకు ఆయనయు నపరిమితమనోవ్యధ జెందువాడు. కాని ధర్మముకొరకు దానినంతయు సహించుకొనెను. తన భార్య నిమిత్త మాయన పడిన పరితాపమును గురించిన విచారకరమగు సమాచారము కొంత ఆయన దినచర్యపుస్తకమువలన తెలియగలదు.

ఆమె చదువువిషయములో ఆయన మొదట నాదుర్ద

పడజొచ్చెను. వివాహమయినప్పటినుండి చనువుగ ఆమెతో మాటాడుచు చదువుకొనుట కామెను హెచ్చరించుచుండెను. పట్టుపట్టి ఆమెను ప్రైమరీపరీక్ష ప్యాసుచేయించెను. ఉన్నత విద్య కూడ నామెకు నేర్పింపవలయునని ఆయన యమితముగ వాంఛించెను. కాని పరిస్థితులు ప్రతికూలములాయెను. ధర్మాచరణమువలన, ఆయన సంఘమునుండి బహిష్కరింపబడెను. బంధువులందరితో పాటు మామగారును ఆయనను దూరముచేసిరి. ఆయన తన భార్యయొక్క విద్యాభివృద్ధికొరకు చెప్పదలచిన మాటలాసందర్భములో వినువారెవ రుందురు? అప్పుడాయన తన మామగారికి ఈ క్రిందపొందుపరుపబడిన పెద్దయుత్తరమును వ్రాసిపంపెను.

మిక్కిలి రహస్యముగా నుంచవలసినది.

ఇన్నీసుపేట.

౨౫—౧—౧౯౦౬

బ్రహ్మకృపాహి కేవలమ్.

నా ప్రియమయిన మామగారికి

నే నీక్రింది పంక్తులను హృదయపూర్వకముగ వ్రాయుచున్నాను. నే నెట్టి ప్రేమభావముతో నవి వ్రాయుచున్నానో యట్టి భావముతోడనె మీ రవి గ్రహింపవలెననియు, అందు

ప్రస్తావింపబడిన విషయములో మీరు ఆతురతను శ్రద్ధను చూప వలె ననియు వేడుచున్నాను. మామయు అల్లుడును నయి మనము వెనుక ప్రేమపూర్వకముగ కలిగియున్న చనువుతో నే నిప్పుడు మిమ్ము సమీపింప గూడదని యట్లు స్ఫురించు మాటలలోనె గాక స్పష్టముగా కూడ నాకు తెలిపి మీరే నన్ను మీదరికి రాకుండ చేసియుండుట నిజముగా నత్యంత శోచనీయము. మనఃపూర్వకముగను త్రికరణశుద్ధితోడను తీవ్రముగ నమ్మిన సత్యమునందలి దృఢవిశ్వాసముచే పురిగొల్పబడి నేను ధైర్యముతో నడచుకొనుటయె మీరు నన్నంత యనాదరణముతో చూచుటకు కారణమై యుండును. ఇరువదియవ శతాబ్దప్రారంభమున సహితము హిందూదేశవిద్యాధికులు ప్రచలితాభిప్రాయములచేతను సాధారణవిద్వేషములచేతను బంధింపబడుటయెగాక నిర్దోషి యయి పూర్తిగ సద్వర్తనుడయియున్న యొకవ్యక్తి హృదయపూర్వకముగ కలిగియుండు అభిప్రాయభేదమును సహించుకొన లేకపోవుటయు మిక్కిలి దురదృష్టము. మీరును మీయింటిలోనివారును నా యెడల కనపరచిన యనాదరణము నామనస్సులో జనింపజేసిన హృదయభేదకములయినయాలోచనలను తలంపులను నేనిప్పుడు తెలుపుట యనావశ్యకము. ఏది యెట్లు జరగినను, పరమేశ్వరుడు పాపాత్ముని గూడ ప్రేమించి యాశీర్వదించెను. యావత్తు

శోధనను, బాధలను సహించుకొనగల శక్తిని హెచ్చరికను ఆయన నాకనుగ్రహించెను.

మీ కుమార్తె ప్రియమయిన అలివేలు చదువునకు సంబంధించినదే నేను వ్రాయదలచిన ప్రస్తుతవిషయము. మంచికో, చెడుగునకో, మా జీవితము లేకముచేయబడినవి. పవిత్రమయిన వివాహబంధమును ఛేదించుటకు తీవ్రమయిన యోచనలు మీయింటిలో జరుగుచున్నట్లు నాకు వినికిడి వలన తెలియుచున్నను, నిరంతరవిశ్వాసముతోడను అకుంఠిత నిరీక్షణముతోడను సర్వశక్తునియొక్క యుత్తమపాలనమునకు సంపూర్ణముగ సమర్పింపబడిన యంతరాత్మతోడను నేను మిమ్ము సమీపించి, ప్రియమయిన అలివేలు చదువేమాత్రము చెడిపోకుండ జాగ్రత్తను శ్రద్ధను తీసికొనుడని ప్రార్థించుచున్నాను. పూర్వాచారపరుల యభిప్రాయమును బట్టి చూచినను, ఆమె యింకను పాఠశాలకుపోవువయస్సుననె యున్నది. కావున పాఠశాలలో చెప్పబడు కొంచెము చదువు కూడ నేర్చుటకు ఆమె కవకాశ మీయకుండ నింటిలో కట్టుపెట్టుట యవివేకము. కనుక ఊరిలోనున్న గవర్నమెంటు లోవరు సెకండరీ గరల్సు స్కూలుకు సాధ్యమయినంత త్వరలో మీ రామెను పంపవలయు నని నా మనవి. ఇంటిలో ఆమెను చదువునట్లు చేయదలంచుట వృధా. అదియెంత యసాధ్యమొ

నాకు బాగుగ తెలియును; మీరును పూర్తిగ తెలిసికొనియుందురు. పైని చెప్పబడిన పాఠశాలలో గరపబడు విద్య అతిసామాన్యమయినది. ఇంగ్లీషు అక్కడ నేర్పబడదు. కాని మీ సంకుచితాభిప్రాయములను బట్టి, గుడ్డులో మెల్ల యను సామెతను మనసునం దుంచుకొని, నే నాస్కూలును పేర్కొంటిని. అట్లు కాక, ఈయూరిలో సాధ్యమయినంత యున్నతమును శ్రేష్ఠమును అయిన విద్యను ప్రియమయిన అలివేలుకు చెప్పించుటకు మీ రిష్టపడి అందునకు సిద్ధముగా నుండి యున్నయెడల, ఇంగ్లీషుకూడ నేర్పబడు వీరేశలింగముగారి స్కూలుకు ఆమెను పంపుడని మిమ్ము నిజముగా కోరియే యుందును. ఈ స్కూలులో మతమునకు సంబంధింపని విద్యయె బాలికలందరకు నొసంగబడు నని జ్ఞప్తియం దుంచుకొన గోరెదను. మర్యాదగల పూర్వాచారపరుల కుటుంబములకు జెందినట్టియు వయసు వచ్చినట్టియు బాలికలు కొందరందులో గలరు. కాన సంస్కర్తచే స్థాపింపబడిన సంస్థకు మీ యమ్మాయిని పంపుటకు మీరు భయపడవలసిన పని లేదు. అట్టి వాని ద్రవ్యముతో పోషింపబడుచున్నను, నాకు తెలిసినంతవరకు అది కేవలము నిరపాయకరమయినట్టియు, మనసున కెట్టి కష్టమును కలిగింపనట్టియు పద్ధతిని నడపబడుచున్నది. మిక్కిలి ఛాందసుడైన యెట్టి హిందూపూర్వా

చారపరునియొక్క హృదయమును చిన్న విషయములలో సహితము నొప్పింపకుండుటకు తగిన జాగ్రత్త తీసికొనబడును. ప్రియమయిన అలివేలుచదువు విషయములో నే నింతగా నేల వ్రాయవలసి వచ్చెనని మీరు నన్ను అడుగవచ్చును. ఒక యసామాన్యమయిన జీవనపరిస్థితులలో మీ రామె నుంచినారని నేను చెప్పనక్కరలేకయె మీకె బాగుగ తెలియును. నాకు వినవచ్చునట్లు వ్యాపనములగుచున్న విచారకరవదంతులలో నేమాత్రము నిజమున్నను లేకపోయినను, ఆమెకు తన జ్ఞానశక్తిని వృద్ధి నొందించుకొనుటకు సంపూర్ణ అవకాశ మీయబడుటయె మిక్కిలి వాంఛనీయము. కొంత కాల మయిన తరువాత, నైతికపారమార్థిక విషయములను స్వయముగ నితరులసహాయము లేకుండ విచారించుకొనవలసిన యసహాయస్థితిలో విశాలప్రపంచమందు ప్రవేశపెట్టబడినప్పుడు, సరియయిన శిక్షణమును, ఉపయుక్తమయిన విద్యయు తప్ప నింకేదియు నామెకు తోడ్పడజాలదు. చదువు నేర్వగలిగిన పిన్నవయస్సుననె ఆమె యింకను ఉండుట వలన, నిజముగాను త్రికరణశుద్ధిగాను ఆమె బాధ్యత వహించిన వారందరియొక్క పరమ కర్తవ్యము, ఈశ్వరు డామెకు ప్రసాదించిన శక్తులు నిరుపయోగము లయి వ్యర్థము గాకుండ జేయుటయె.

ప్రస్తుతము మనకు దురదృష్టవశమున నేర్పడి విరసములును విచారకరములును నయియున్న సంబంధములను మనసులో నుంచుకొని, నే నింతవరకు స్వల్పములును సులభములును అయిన మార్గములను మాత్రమె మీకు సూచించియుంటిని. జరిగిన సంగతులను చూడకుండ కళ్లు మూసికొని విషయవిచారణ చేయుటవలన లాభము లేదు. ఆమె చదువును ఇంటివద్ద నేను చక్కగా విచారించుటకు వీలుండిన యెడల, అదియె యుత్తమమయిన యేర్పాటని, నేను నిశ్చయముగా చెప్పగలిగినను, నే నది మీకు తెలుపజాలను.

దీర్ఘముగ వ్రాసి మీకు చాల విసుగు పుట్టించుచున్నా నని భయముగా నున్నది. కాని హృదయము నిండుగా నున్నప్పుడు, నోటినుండి మాటలు వెడలును. మాటాడుటకు అవకాశ మీయబడనందున నా భావములను వ్రాతలో పెట్టుటకు ప్రయత్నించితిని. అదియు నసంపూర్తిగనె జరిగె నని దృఢముగ చెప్పగలను.

ఓపికతోను, శ్రద్ధతోను, దురభిప్రాయములకు చోటివ్వని నిష్పాక్షికబుద్ధితోను, మీ రీయుత్తరము చదువవలె ననియు, వీలునుబట్టి మీ రేవిధముగా ఈవిషయమును తుదకు పరిష్కరించినను ఆ తీర్మానమును నాకు తెలుపవలె ననియు, నా కడపటి ప్రార్థన. నేను ఉన్నది ఉన్నట్లు స్పష్ట

ముగ వ్రాసితిని. ఎట్టి కృత్రిమము నాయందు లేదు. నిర్భాగ్యుడును, నిర్దోషియు, బహిష్కృతుడును, దుఃఖభాజనుడును, కనికరమునకు పాత్రుడును అయిన మీ యల్లునియెడల మీరును అటులనె వర్తింపవలె నని విన్నవించుచున్నాను.

సర్వేశ్వరుడే యీయుత్తరమును ముద్రాంకితము చేసి భద్రపరచును గాక!!!

దే. పె. బాపయ్య.

తనభార్యయొక్క విద్యావిషయమున బాపయ్యగా రెంత తీవ్రమనోవేదన జెందిరో యీలేఖ తెలుపుదానికంటె వేరుగ వ్రాయవలసినది యేమియు లేదు.

మంగతాయమ్మగారు రజస్వల యయినతరువాత పునస్సంధానవిషయములో బయలుదేరిన యాలోచనలు కూడ బాపయ్యగారిని చాల కలతపరచెను. ౨౫-౧-౧౯౦౭ తేదిన ఆయన యిట్లు వ్రాసికొనెను:—"బ్రాహ్మసమాజ వార్షికోత్సవమునకయి బాపట్లకు వచ్చితిని......మాఅమ్మ నన్ను దయతో ఆహ్వానించెను. పరాత్పరు డామెకు నాయెడల సర్వదా అట్టిసద్భావ ముండున ట్లనుగ్రహించునుగాక! మధ్యాహ్నము ౧ గంటకు అమలాపురమునుండి పాప (మంగతాయమ్మగారు) రజస్వల యయినదని టెలిగ్రాము వచ్చినది. ఈవార్త వినునట్లు చేసినందులకు పరమేశ్వరునకు వందన

ములు. ఆమె బాధ్యత వహించినవారు శరీరముయొక్క పూర్ణవృద్ధిని సూచించు చిహ్నమె రజస్వలయగుట యని తలంపకుందురు గాక! పదునారు సంవత్సరములు వచ్చువరకు మంచిశిక్షణమున తమ కుమార్తెను పెంచి ఆమెయొక్క నిజమయిన క్షేమము నారయుటకు పరమేశ్వరుడు మా మామగారికి సద్బుద్ధిని గటాక్షించును గాక! ఈశ్వరుని యొక్క యథార్థ అనుచరుడనై నిలచుటకు ఆయనయె నాకు శక్తిని ప్రసాదించును గాక!'' మరల కొలదికాలమునకు ఆయన బాపట్లకు వచ్చినప్పుడు ౨౧-౩-౧౯౦౭ తేదిన అచట జరిగిన సమాచార మీవిధమున వ్రాసికొనెను.—బాపట్లలో ఆగితిని. నా త్రోవనుండి నన్ను మరలించుటకు బంధువులందరు గుమిగూడిరి. నా భార్యను మాయింటికి తీసికొనిరావలె నను కారణముతో నొకక్రొత్తవాదన బయలుదేరెను. ఆమెకుఇంకను ౧౬ సంవత్సరములురాలేదని నేను వాదించితిని. ఆవాదన వలన లాభము లేకపోయెను. జందెమును వర్ణభేదమును విడుచు నావశ్యకతలో నాకు గలవిశ్వాసమును నొక్కిచెప్పితిని. కాని వారు నా మాటలు వినిపించుకొనరు. ఈప్రలోభనము లేమైయుండును? ఎటువంటి కష్టములు కలిగినను ధర్మము నాచరించుటకు పరమేశ్వరుడు నాకు సద్బుద్ధిని సరియయిన యాలోచనను అనుగ్రహించును గాక! బాపట్లలో నివ

సించుట యున్నతాదర్శమున కేమాత్ర మనుకూలముగ లేదు. అక్కడ దృఢచిత్తుడు నిశ్చలుడై యుండిన నుండవచ్చును గాని వృద్ధినొందుట కవకాశము లేదు.'' తనవైపువారు ఎటువంటి ధోరణిలో నుండిరో అంతకు మించిన ధోరణిలో తన భార్యవైపువా రుండిరి. ఆయన తనభార్యను చూచుటకె యసాధ్యమై పోయెను. ఆమెను చూచి ఆమెకు తన యభిప్రాయములు ఎరుకపరుచుట తనవిధి యని ఆయన తలంచెను. ఒకపర్యాయ మామెను చూచుటకు ఆయన వారియింటికి వెళ్ళినప్పుడు 'తిరిగి సంఘమున చేరెదవా' యని ఆమెతల్లి ఆయనను ప్రశ్నించెను. ప్రాణము విడువవలసివచ్చినను, ధర్మమును మాత్రము విడనాడ నని ఆయన బదులుచెప్పెను. అప్పుడాయనతనభార్యతో మాటాడుటకవకాశము కలుగలేదు. కాని రెండుమూడురోజులతరువాత౧౪-౮-౧౯౦౭ తేదిన ఆయన మరల వారియింటికి వెళ్ళినప్పుడు కొంత ప్రయత్నముమీద సుమారు మూడుగంటలకాలము గడచిన పిమ్మట ఆయనకు ఆమెతో సించుక మాటాడుటకు వీలు కలిగెను. ఆమెతోడను, ఆమెవెంటనున్న ఆమెసోదరితోడను వారిచదువునుగూర్చి ఆయన ప్రస్తావించెను. ఆయన సంఘమున చేరనందున ఆయనమాటలు వారికి రుచింపలేదు. ఆ సమయమునఆయన తనభార్యతో నొంటరిగకొలదినిమిషములు

మాత్రము గడపగలిగెను. పెద్దది యయినతరువాత ఆమె తనవద్దకు వచ్చునేమొ తెలిసికొనగోరెను. అందు కామె 'తప్పుతుందా' యని జవాబు చెప్పెను. భర్త కావిధముగ నామె లోబడ నిచ్చగించుట ఆయనకు చాల బాధకరముగ నుండెను. ఆసందర్భమున "I wish God would grant her individuality and firm convictions, so that she may live a life of principle. God bless her!" ఆమె ధర్మజీవనము జీవించునట్లు ఈశ్వరుడు ఆమెకు వ్యక్తిత్వముసు దృఢవిశ్వాసములను ప్రసాదింపవలయు నని నే నభిలషించుచున్నాను. ఈశ్వరు డామె నాశీర్వదించును గాక—యని దినచర్యపుస్తకమున ఆయన వ్రాసికొనెను. సత్యము నారసి ఆమె తనవద్దకు రావలయుననియె ఆయన యాశయము. కాని యామెకు ధర్మవిషయములను విచారింపగల వయసు లేదు. ౨౨-౮-౧౯౦౭ తేదిన పగలు చాలసేపు ఆయన ఆమెవద్ద నుండెను. నాడు జరగినది యిట్లు వ్రాసికొనెను—"ఆమె నాయందు కొంతప్రేమ చూపుచున్నట్లు కాన్పించెను. తాను వచ్చి నాతో జీవింపక తప్పదని ఆమె తిరిగిచెప్పెను. జందెము వేసికొను మని ఆమె నన్ను పలుమారు కోరెను. నే నందునకు పూర్తిగా నిరాకరించితిని." భార్యాసంబంధమయిన బాధ్యత ఒకవైపునుండియు, ధర్మవిషయమయిన దీక్ష మరియొకవైపునుండియు ఆయనను లాగుచుండెను. అవి రెండును నిర్వహింపవలసినవె యగుచు నొకదాని కొకటి పొసగక ఆయన కమితక్లేశము కలిగించెను. ఆ సంఘర్షణమున నెంత దుస్సహదుఃఖమునకు లోనైనను, ఆయన ధర్మమును మాత్రము విడనాడకపోవుట ఆయనవిశ్వాసముయొక్క పటిమను వేనోళ్ల చాటుచున్నది. జీవితము పరిసమాప్తి నొందువరకు ఆయన తన భార్యయొక్క దురవస్థను గూర్చిన చింతనె ప్రధానముగ కలిగియుండెను. కాని యీశ్వరఘటనవలన, ఆమె కది తప్పకపోయెను. ఈశ్వరుడె యామెకు శరణ్యుడగును గాక!

జీవనస్మృతి

౧౨ వ ప్రకరణము

బంధుకోటి

మన కథానాయకుడు. తన భార్యాసంబంధమున నెట్టి యాధ్యాత్మికమయిన పోరాటమునకు లోనైనదియు, తన భార్యతో తనకుగల ప్రేమానుబంధమును కాపాడుకొనుచు ఆమెకు తాను నిర్వర్తింపవలసిన విధులవిషయమున నాతురత జెందినను ఆమెమూలమున తన ధర్మజీవనమున కేమాత్రము భంగము కలుగకుండ నాపోరాటమున విజయము గాంచినదియు, చదువరులకు విదితమై యుండును. ప్రపంచమునందు సంసారసంబంధములు గలిగి జీవించుచు ధర్మముకొరకు పోరాడువాడె నిజమయిన ధర్మయోధుడు. సంబంధములన్నియు త్రెంచుకొని యరణ్యముల పాలగు వారి యాత్మబలము ఏపాటిదో పరీక్షకు రానేరదు. ఇతరబంధువులతో కూడ నెటుల మెలగి బాపయ్యగారు తమ యాత్మశక్తిని విజృంభింపజేసిరో చూతము.

మామగారు, దావులూరి ఉమామహేశ్వరరావుగారు

ఆయనను తిరిగి సంఘమున జేర్పవలెనను నుద్దేశముతోడనె ఆయనయెడ కొంతకాఠిన్యతను జూపెను గాని వాస్తవమునకు ఆయనయం దెంతయొ ప్రేమను కలిగియుండిరి. ఆయనయు వారిని నటులనె ప్రేమించెను. ఉమామహేశ్వరరావుగారి ద్వితీయపుత్రుడు ఒకరోజున గోదావరికి స్నానమునకు వెళ్ళి అందు మునిగి యాకస్మికముగ చనిపోయెను. ఆ దుర్మరణము వలన ఉమామహేశ్వరరావుగారి గృహము దుఃఖమయ మైపోయెను. మైసూరు రాజ్యమునకు వైద్యముకొరకు వెళ్ళి యచటి ముఖ్యస్థలములను దర్శించుచుండిన బాపయ్యగారికి ఈ విచారకరమైన వార్త చేరెను. చూడవలసిన ప్రదేశములను సాధ్యమయినంత త్వరలో చూచి మామగారిని మామగారి కుటుంబమును పరామర్శ చేయుటకు అచటనుండి వెంటనె తిరిగివచ్చెను. ౧౩--౫--౧౯౦౬ తేదిక్రింద ఆయనదినచర్యపుస్తకములో నిట్లు వ్రాసికొనెను.—"మా మామగారిని ఓదార్చుటకు రాజమహేంద్రవరమునకు వచ్చితిని. వారు నాచేతులను పాదములను పట్టుకొని తమ కుమార్తెకొరకు పూర్వపద్ధతులలోనికి మరలవలసినదని చాల సేపు బ్రతిమాలిరి. సుమారు నాలుగు సంవత్సరము లట్లు జీవింపు మని వారు నన్ను గోరిరి. వారి వాదములు వృథా యయ్యెను. కన్నీటిధారలె ఆ వాదములందలి కారణములు. నాకు చాల విచా

రము కలిగినది. లోబడిపోకుండ నాపై కటాక్షము చూపి నందులకు పరమేశ్వరునకు నమస్కరించుచున్నాను. వారి కుటుంబములోని యితరులను చూచితిని. వేరుగ వారి గృహమున ఉదయము భుజించితిని. సాయంకాలము ఒకటి రెండు నిమిషములు నా భార్యను చూచితిని. ఆమెకు ముద్దిడి యితరుల మాటలవలన నిరుత్సాహము జెందవలదని చెప్పితిని. నా కుత్తరములు వ్రాయుచుండు మని ఆమెను కోరితిని. ఆమెకును, నాకును, ఆమె బంధువులందరకును పరమేశ్వరుడు మనోశాంతిని అనుగ్రహించును గాక!* ఈ జరగిన వృత్తాంతము బాపయ్యగారి ప్రేమ కెటుల మేర లేవో ఆయన ధర్మోత్సాహమునకును అటులనె అంతు లేదని సువ్యక్తము చేయుచున్నది.

బాపయ్యగారి తల్లి వరలక్ష్మమ్మగారు ఆయనను లోకముతో పాటు జీవించునట్లు చేయుటకు పూర్తిగ ప్రయత్నించుటలో నేమియు నాశ్చర్యము లేదు. భర్త చనిపోయి దుఃఖమున దోగాడుచుండ, చేతులార పెంచి పెద్దదానిని చేసి కాపురమునకు పంపిన కూతురు అకాలమృత్యువాత బడుటయె గాక సంసారభారమును వహించి గృహ కృత్యముల నిర్వర్తించుటకు తగిన వయస్సు వచ్చిన పెద్ద కుమారుడు ఈతీరున మారి సంఘబహిష్కృతు డగుట తటస్థించి నప్పుడు, ఆమె

ఎటువంటి నిరాశతో తపించి పోవునో వ్రాయుటకంటె నూహించుకొనుటయె సుకరము. ఆయనతో ఆమె యెటువంటి సంబంధము పెట్టుకొనుచుండెనో, ఆయనకు భోజనము ఎక్కడ పెట్టుచుండెనో, ఎటువంటి యేర్పాటులు చేయుచుండెనో—ఇవి యన్నియు సంఘస్థులు జాగ్రత్తగ పరిశీలించుచుండిరి. సంఘముయొక్క వెరపుచేతను, ఆయన తనవాడు కాకుండ పోవుచున్నాడె యను నిస్పృహచేతను ఆమె ఆయనకు వలసిన సాహాయ్యము చేయకపోవుటయె గాక పరుషవచనములచే మనస్తాపమును కలిగించెను. ఆమె ఆయన యెడ నెట్లు వర్తించినను, ఆయన ఆమెయెడ నెట్లు మెలగెనో తెలిసికొనుట ముఖ్యము. ౧౯౦౬ వ సంవత్సరములో మే నెలలో విశేషభాగమును జూన్ మాసమంతయు ఆయన బాపట్లలో గడపెను. అచట బంధువులద్వారా ఆయన కెంత యొత్తిడి కలుగవలయునో అంతయు నప్పుడు పూర్తిగ కలిగెను. ఆయనకు తొందర కలుగజేసిన వారిలో తల్లి ముఖ్యురాలు. ఆయన యచటికి వెళ్ళినప్పుడు ఆమె ఊరిలో లేదు; కాని వెంటనె వచ్చెను. అచట జరిగినది ఆయనమాటల లోనె తెలుపుట యుచితము.

"మా అమ్మ నిన్న (౧౯—౫—౧౯౦౬) తిరిగి వచ్చినది. నా కన్నము వండిపెట్టుదు నని యయినను ఆమె

చెప్పలేదు. నాయెడల వారెంత నిర్దాక్షిణ్యముగ మారినారు! కాని వీరిమీద నాధారపడ గూడదని యీశ్వరుడు నాకు బోధపరచినాడు. ఆయనమీదనె నావిశ్వాస ముంచి నాసొంత ప్రయత్నములమీద నేను నిర్భరపడెదను."

"ఈరోజు (౨౪—౭—౧౯౦౬) ఒక మోస్తరు భయానకములయిన శకునములతో ప్రారంభ మాయెను. పక్కనుండి లేచిన వెంటనె కూడ మిక్కిలి విషాదకరములయిన కొన్ని ఘటనలకు లోనైతిని. దినమంతయు చిరాకుతో నుంటిని. ఎండ సహితము మిగుల తీక్షణముగా నుండెను. రాత్రి మా అమ్మయు శేషమ్మగారును (పినతండ్రి కృష్ణయ్యగారి భార్య) వచ్చి నావద్ద సుమారు మూడుగంటల సేపు కూర్చుండిరి. ఉన్నంత సేపును వారు నన్ను చీవాట్లు పెట్టిరి; అతికఠినమును వెగటును అయిన మాట లనిరి. అసూయత పూర్తిగ కనపరచిరి. వారందరియెడల ప్రేమపూర్వకమయిన గౌరవమును నేను కలిగి యుండునట్లు దయామయుడయిన పరమేశ్వరుడు అనుగ్రహించును గాక! అనేకవిషయముల సందర్భమునను, ఎక్కువగా, ఆమె తలపెట్టిన నా సోదరుని వివాహవిషయములో నేను జోక్యము కల్పించుకొనుటయందు, నేను తప్పిదము చేసితినని మా అమ్మ అనెను. నాకును ఆమెకును ఈశ్వరుడు శాంతి నొసంగును గాక! ఏమాత్రము విశ్రాంతి లేకుండ ఆ రాత్రియంతయు గడపితిని."

"(౨౬—౭—౧౯౦౬) నా సోదరుని పంపుటకు మా అమ్మ రైలుస్టేషనుకు వచ్చినప్పుడు నే నామెను అచట చూచితిని. ఆమె నాతో దయగా మాటాడెను. నే నామెతో కలసి యింటికి వెళ్ళితిని. అక్కడ కూడ ఆమె ప్రేమతోడనె మాటాడెను. అటువంటి ప్రేమసంబంధమున ఈశ్వరుడు మాయిరువురను సదా బంధించి యొకరి యభిప్రాయము లొకరు మన్నించుకొనుటకు నేర్పును గాక!"

తరువాత నొకటి రెండు పర్యాయములు కూడ ఆయన ఆ తూరి బాపట్లను విడుచులోగా ఆయనకును ఆమెకును పైని వ్రాయబడినటువంటి మాటలే జరగినవి. ఆయన ఆమెను ఏసందర్భములోను ప్రేమించుట మాన లేదు. తన యభిప్రాయములయం దెటువంటి మార్పు వచ్చినను, ఆమెను తన సోదరుని తనవద్దనుంచుకొని వారికి సాయపడవలె ననియె మొదటినుండియు ఆయనసంకల్పము. అది వారికి తెలుపుచు వచ్చెను. తన యభిప్రాయముల నామె స్వీకరింప వలయునని ఆయన కోరియుండ లేదు. ఆమె తన యభిప్రాయములును పద్ధతులును ఏమాత్రము విడువకుండ తనవద్ద నుండవచ్చునని ఆయన స్పష్టముగ చెప్పెను. స్వాతంత్ర్యప్రియు డగుటచే,

ఆయన కోరినదియంతయు మతసహనము. అప్పటి సంఘపరిస్థితులలో దాని కంగీకరించుటకును ఆయనతల్లికి సాధ్యము కాలేదు. భార్య గాని, తల్లి గాని, ఎవరయినను వ్యక్తిత్వము గలిగి అభిప్రాయములందును నడవడికయందును స్వాతంత్ర్యముతో చరించుటయె ఆయన వాంఛించినది. ఆయన ప్రేమ యెంత గాఢమయినదో అంత విశాలము కూడ నయినది.

ఆయనను పూర్వాచారములోనికి త్రిప్పుటకు ఆయన తాతగారు శింగరయ్యగారు కూడ ప్రయత్నించిరి. వారు గుడివాడనుండి అందులకు ప్రత్యేకముగ బయలుదేరి బాపట్లకు వచ్చిరి. వారితో ౪—౬—౧౯౦౬ తేదిన జరిగిన ప్రసంగమునుగూర్చి ఆయన యిట్లు వ్రాసికొనెను.—"జందెము విషయమై వారు నాతో చర్చింప నారంభించిరి. వారును వారితో కూడ వచ్చిన వారివంటివా రింకొకరును సర్వజన భ్రాతృత్వమును నమ్మకముగా నుంచుకొన వచ్చుననియు, కాని ఆచరణయందు నేను ఇతరులతో కలిసి భుజింప రాదనియు చెప్పిరి. అది వారికి చాల సరియయిన పద్ధతిగా నున్నను నాకు ద్వంద్వజీవనము గడపుటవలె గాన్పించెను. బాహ్యవేషములను దాల్చి నేను పుట్టిన కులమునకు సంబంధించిన బాహ్యచిహ్నము లన్నియు ధరింపవలె నని వారు చెప్పిన వాదనయు నాకు మనస్కరింప లేదు. సర్వమును దిద్ది నడపు

పరమపిత, ఎట్టి ఫలితములు కలిగించునది యైనను ఏది ధర్మమొ దానినె నాకు బోధించును గాక!"—మరియు ఆయన ౫—౬—౧౯౦౬ తేదిక్రింద నిది వ్రాసికొనెను.—"సాయంకాలము తాతగారును మాణిక్యమ్మగారును (ఆయన మేనత్త) ఆమె కూతురును నన్ను లోబరచుకొనుటకై బలవంతపెట్టుటకు తోటకు వచ్చిరి. అటువంటి పతనమునుండియు అవమానమునుండియు అదృష్టమువలన ఈశ్వరుడు నన్ను రక్షించెను."

తాతగారును మేనత్తగారును వయసునుబట్టి ఆయనను పిల్లవానివలె నెంచి యే పనియైన చేయు మని బలవంతపెట్టగల స్థితిలో నున్నారు. ఆ స్వాతంత్ర్యమును వారు చూపిరి. కాని ఆయన అందునకును లొంగలేదు. ఆయన యీశ్వర విశ్వాసము మహాపర్వతమువలె చలింపకుండెను. పెద్దవారి యెడ ఆయన కమితగౌరవము కలదు; కాని తన అంతరాత్మకు వ్యతిరేకముగ వా రేది చెప్పినను అది మాత్రము చేయుటకు సమ్మతించు వాడు గాడు.

మరియు తనకంటె వయసులో పెద్దవారయి తన భక్తిగౌరవములకు పాత్రు లయి యున్న వారికి అవశ్యమయినప్పుడు ధర్మమును చూపుటకు కూడ ఆయన యత్నించెను. తన తమ్ముడింకను పసివాడై యుండగా అతనికి వివాహము చేయుటకు పెద్దలు పూనుకొనిరి. ఆ విషయము తన కెందు

కని ఆయన యూరుకొనలేదు. తా నట్లు జోక్యము కలిగించుకొనుట తల్లి సహింప లేదని ఆయనమాటలవలన ఇదివరకె తెలియవచ్చినది. పినతండ్రి కృష్ణయ్యగారును, మేనమామ వెంకటప్పయ్యగారును ఆ వివాహము నిశ్చయించుటకు ముఖ్య కారకులు. మొదటినుండి తన కుటుంబమునందు వారు ఎక్కువ బాధ్యత కలిగి తనకు ప్రత్యేకముగ అనేకవిధముల సాయపడి తనను పెద్దవానినిగా జేసిన వారె ఆ యిరువురు అయినను, తన తమ్ముని వివాహవిషయములో వారు సరిగా యోచించుట లేదని తాను నమ్ముటచే వారి కది తెలుపుట విధి యని భావించెను. తన యభిప్రాయము దృఢముగా తెలిపెను. ఆ సందర్భమునుగురించి ౧౩-౫-౧౯౦౨ తేదిన ఆయన యిట్లు వ్రాసికొనెను. "ఇద్దరు గ్రాడ్యుయేటులు కృష్ణయ్యగారును, వెంకటప్పయ్యగారును ఇష్టపడి నా యిచ్ఛకు వ్యతిరేకముగా నా తమ్ముని వివాహమును నిశ్చయించినారు. వారి చదువు వారికి ప్రయోజనకారి కాలేదు. మా అమ్మ కేదో యుపయోగమును సౌఖ్యమును కలుగు నను తలంపుతో, వా రావివాహము చేయుచున్నారు. ధర్మానుగుణముగ జీవితము గడపుట వీరిదృష్టికి అసాధ్యముగ గాన్పించును. ఈశ్వరుడు వారికి సరియయిన యోచనను ప్రసాదించును గాక! నా తమ్ముడు ఇతరుల కుపయోగపడుచు సుఖముగ

జీవించు నట్లు అనుగ్రహించును గాక!"

వివిధములయిన కుటుంబసంబంధములు కలిగియు, బాపయ్యగారు శరీరము నతీతించి ధర్మమును సాధించి బంధుత్వము వాస్తవమునకు ఆత్మలకు సంబంధించి దృఢతరమై శాశ్వతముగ వెలయునది యని జీవితముద్వారా కనపరచెను. ఆయనకు బాహ్యముగ నందరితో బంధుత్వము తెగినను, ఆధ్యాత్మికముగ ఆయన అందరితోడను బంధుత్వము కలిగి పవిత్రమయిన ప్రేమజీవనము జీవించెను. భార్యను, తల్లిని, తాతను, మేనత్తను, పినతండ్రిని, మేనమామను, బంధువులందరిని ఉత్కృష్టమయినట్టియు ధర్మమునకు విరుద్ధము కానట్టియు ప్రేమతో సన్మానించెను. బాహ్యవియోగమును భరింపలేక నాడు కఠినముగ జూచిన బంధువులందరు నేడు ఆయన మృతి జెందియున్నను ఆయనతోడి ప్రేమబాంధవ్యమును హృదయములందు గుర్తించి స్మరింప గలుగుచున్నారు.

జీవనస్మృతి

౧౩ వ ప్రకరణము

మిత్రవర్గము - పురుషులు

భూగర్భమునం దుండు జలధార యుపరిభాగమునకు వచ్చుటకు సాధన మేర్పడిన తరువాత, అది సర్వప్రదేశము లందు విస్తరించి అంతయు జలమయము చేయును. అటులనె హృదయాంతరాళమునుండి ప్రేమధార వెలువడ గలిగిన యెడల, అది సర్వమానవహృదయములందు వ్యాపించి మహా ప్రవాహరూపము దాల్చును. రక్తబిందువులె బంధువు లనుకొనుచు తదితరులను ప్రేమాస్పదులనుగా జూడజాలని వారలె బహుసంఖ్యాకులు. వారు తమ చిరకాలపరిచితులు నానా బాధలు పడుచున్నా రని వినుచున్నను, వారికి తాము చేయగల సాహాయ్యము కూడ చేయవలె నను స్పృహయె లేకుండ నుందురు. బంధుత్వము ఆత్మసంబంధమయిన దను జ్ఞానము అంకురింపగానె జీవితము నూతనశోభను గాంచి యనంతముగ విస్తరిల్ల మొద లిడును. ఇట్టి విపులత జెందుటలోనె జీవితముయొక్క ఘనతను చూడ నగును. బాపయ్యగారు

తన రక్తబంధువులనె గాక పరిచితులనుకూడ నెట్లు ప్రేమించి వారియెడ వర్తించెనో విచారింతము.

వయస్సులోను విద్యలోను ఆయనకంటె నెంతయొ చిన్నవారుకూడ ఆయనయొక్క గాఢానురాగమునకు పాత్రులైరి. బ్రహ్మానంద మనుకుర్రవాడు బాపట్ల హైస్కూలులో అయిదవఫారము చదువు చుండెను. ఆ అబ్బాయి కొద్దిగా ఆయన పరిచయములోనికి వచ్చినతరువాత మృతి నొందుట తటస్థించెను. అప్పుడు అతనిని గురించి ఆయన పాపర్తి నరసింహముగారి కిట్లు ౧౦——౧——౧౯౦౮ తేదిన ఉత్తరము వ్రాసెను.——"ప్రియ మయిన బ్రహ్మానందము చనిపోయె నని విని నేను మిగుల చింతిల్లితిని. ఆతనియందు నా కిష్టము కలదని నీ వెరుగుదువు. ఆతడు వృద్ధిలోనికి రాదగిన పౌరు డగు నని నేను ఆశపడితిని. కాని ఆతనిని మన నుండి యింత త్వరితముగ తీసికొనిపోవుటకు ఈశ్వరుడు ఇచ్చగించెను ఆతని యాత్మ శాంతి నొందును గాక !" ఈ వాక్యము లెంత యభిమానము తెలుపుచున్నవి! మన యపూర్వ పాఠశాలోపాధ్యాయులకు బాలు రనగా గడ్డిపరకలవలె గానిపించినను వారు భక్తుల దృష్టిలోమాత్రము అమూల్య రత్నములె

నేను రాజమహేంద్రవరమునకు మొదట వచ్చిన దిన

ములలో అచటి ప్రార్థనసమాజముయొక్క యుపాసనాసభలకు నాలుగైదు వారములు వెళ్ళిన తరువాత ఒక రోజున బాపయ్యగారి నిట్లు ప్రశ్నించితిని. "ఒరే బాపయ్యా, ఆయిద్దరూ ఎవర్రా! ఒక్క మోస్తరు బట్ట కట్టుకొని, ఒక్క మోస్తరు చొక్కా వేసుకొని, ఒక్క మోస్తరు టోపీ పెట్టుకొని ఇద్దరూ కలిసి సమాజానికి వచ్చి పోతూ వుంటారు!" నేను కొంత హాస్యముగా చెప్పిన యీమాటలకు ఆయన నవ్వి తరువాత గంభీరముగా నివ్విధమున నుడివెను.—"ఒరే, నీవు ఇన్నాళ్ళనుంచీ సమాజానికి వెళ్ళుతున్నావు. వారితో నీవు ఒక్క పర్యాయమైనా, మాట్లాడ లేదా? సమాజానికి వెళ్ళడం అందరితో కలిసి ప్రార్థన చేయడానికి గాని నీకు నీవు కళ్ళు మూసుకొని కూర్చోడానికి కాదు. అందుకే అయితే ఇంట్లోనే కూర్చోవచ్చు. సమాజానికి వచ్చేవా రందరితో పరిచయం చేసుకోవాలి. ఆ పరిచయంతో వారితో చేరి ప్రార్థన చేస్తూవుంటే, ఎంతో ఉత్సాహం, ఎంతో ఆనందం. వా రిద్దరూ పోస్టల్ డిపార్టుమెంటులో పని చేస్తున్నారు. ఒకరు డి. నారాయణరావుగారు, రెండవవారు వి. రామారావుగారు. ఇద్దరూ చాలా మంచివారు. బ్రాహ్మసమాజమంటె ఎంతో ఉత్సాహంగా, ఉంటారు. వారి పరిచయం చేసుకో." ఈ మాటలలో నున్న సత్యము నా మనస్సునకు

తట్టెను. అటుతరువాత వారిద్వారను ఇంక నితరులను మెల్ల మెల్లగా పరిచయము చేసికొంటిని. ఇతరులను పరిచయము చేసికొనుట బాపయ్యగారు తమ జీవితమునందు నొక సాధనాంగముగ నభ్యసించిరని ఆయనమాటలె తెలుపుచున్నవి.

జీవితము నైక్యమగు నప్పుడు పరస్పరసానుభూతియు అన్యోన్యసాహాయ్యమును అతిశయిల్లును. బాపయ్యగారు ఎవరితో సహవాసము చేసిరో వారియం దమితప్రేమను కనపరచుచు వారియొక్క యైహికాముష్మికసౌఖ్యములకొరకు పాటుపడిరి. తన స్నేహితుల కష్టములు ఆయనకు తన కష్టములె యయి కడు విచారము కలిగించెడివి. కావున మిత్రులకు నిజ మయిన సానుభూతితో కష్టసమయములందు ఆయన తోడ్పడి వారి మనస్సులను ఈశ్వరుని వైపునకు మరల్చుటకు ప్రయత్నించెను. కె. నమశ్శివాయంగారు రాజమహేంద్రవర బోధనాభ్యాసనకళాశాలలో చదువుచుండి నపుడు ఆయనకు స్నేహితు లయిరి. తరువాత వారు రాజమహేంద్రవరము విడిచి తెక్కలిలో నుపాధ్యాయులుగ నుండిరి. వారు దగ్గర లేకున్నను, వారియందు మిక్కిలి ప్రేమను ఆయన చూపుచుండెను. ఆయన కలకత్తానుండి తిరిగి వచ్చుచు తెక్కలిలో ఆగి వారిని, వారి కుటుంబమును దర్శించి యెంతయో ఆనందించెను. వారు జందెమును తీసివేసిరనియు, అనుష్ఠానిక

బ్రాహ్మలుగ నుండుటకు సిద్ధపడి యున్నారనియు, తమ పుత్రుని నామకరణము పరిశుద్ధాస్తికపద్ధతుల ప్రకారము తనచే జరపింప నిచ్ఛగించు చున్నారనియు తెలిసికొని పరమేశ్వరుడు శక్తి నిచ్చి ఆచరణయందు మంచిదృష్టాంతము వారు కనపరచు నట్లనుగ్రహించును గాక యని ప్రార్థించెను. పిమ్మట మూడురోజులకు ఆయన ఆనామకరణోత్సవము జరపి బాలునికి 'సూర్యఆనందమోహన్'. అను పేరును పెట్టెను. కొలదికాలములోనె ఈశ్వరఘటనవలన పాప మాబిడ్డడు మృతి జెందుటచే, తల్లిదండ్రుల కమితదుఃఖము వాటిల్లెను. ఈ వార్త వినుటచే ఆయనకు చాల విచారము కలిగెను. తన జబ్బుతో తాను బాధపడుచున్నను, తాను వారిచెంతను లేక యెంతయొ దూరమున చెన్నపట్టణములో నుండి యున్నను, వారిని గూర్చి తలపోయుచుండగా, వారికి నుత్సాహాకరముగ నుండ గలిగిన ఒక ఆలోచన తనకు తట్టినతోడనె యుత్తరముద్వారా నది వారికి తెలియపరచెను. వారి దృష్టిని పరమేశ్వరుని వైపునకు మరల్చుటకె ఆ పిల్లవాడు జన్మించె ననియు, ధర్మాచరణమునకు వారిని పురిగొల్పుట మాత్రమె ఆ శిశువు జీవితమువలన వారు పొందదగిన లాభము గాన అయ్యది చేకూరుటచే విచారముతో గాక తృప్తితో వారు జీవితము గడపుచు ధర్మముకొరకు నధికో

త్సాహముతో పాటుపడుట విధాయక మనియు ఆయన తెలిపిన ముఖ్యభావములు. ఆయనయుత్తరము తమకు మనోశాంతి నొసంగి అనేక సదాలోచనలను రవులుగొల్పె నని వా రాయనకు ప్రత్యుత్తరము వ్రాసిరి. బాపయ్యగారివంటి మిత్రులను పొందగలిగిన వారు అదృష్టవంతులు. నిజ మయిన మైత్రికొరకు ప్రపంచమున మానవహృదయము తపించుచుండును. నిర్మలప్రేమ ప్రతిహృదయమునుండి వెలువడును గాక!

రావుబహద్దరు కందుకూరి వీరేశలింగముపంతులుగారు పరిశుద్ధాస్తిక మతమునందు చిరకాలమునుండి విశ్వాసము కల వారైనను తదనుగుణముగ జీవించుటకు బాపయ్యగారి సహవాస మేర్పడిన తరువాతనె ప్రారంభించిరి. పిన్నవారైనను ఆయన పంతులుగారి కావిషయమున ప్రోత్సాహము కలిగించెను. ఆయన యనుష్ఠానపరుడు అయిన తరువాత, పంతులుగారు తమ తండ్రిగారి శ్రాద్ధమును ౧౬-౭-౧౮౮౧ తేదిన ఆస్తికపద్ధతిని జరపి నాటనుండి వర్ణభేదమును విసర్జించి, విగ్రహారాధనసంబంధ మయిన కర్మలను మాని తాము అనుష్ఠానపరులుగా నుందుమని వ్యక్తీకరించిరి. ఆరోజున తెలిపినటుల జందెమును వారు వెంటనె తీసివేయుటకు సాధ్య మయినది కాదు. ఇతరులు కొంత యాక్షేపించుటకును కారణ

మాయెను. కాని బాపయ్యగారు పంతులుగారిని సమీపించి నిజమారసి జనులకది తెలియచెప్పి పంతులుగారు సాధ్యమయినంతత్వరలో ప్రకటించినలాగున ప్రవర్తించునట్లు చేయగలిగిరి. తన నిరుపమాన మైన భక్త్యుత్సాహములు తా నెవరితో కలసి జీవించుచుండునో వారికి ప్రశంసించులాగున ఆయన ప్రేమపూర్వక సంబంధములు పెట్టుకొనెను. ఆ కారణముచేత ఆయన పెద్దలకుసహితము గౌరవపాత్రుడును మార్గదర్శకుడును కాగలిగెను. తమలో కలిగిన మార్పునుగూర్చి పంతులుగా రిట్లు వ్రాసికొనిరి. —"మతసంస్కారము లేక సంఘసంస్కారము గానిమరి యేయితర సంస్కారములుగాని జయప్రదముగాసాగదని చిరకాలానుభవమువలన నేను దృఢముగా దలచుచున్నాను. మీరు (అనుష్ఠానపరు లయిన బ్రాహ్మలను నిందించువారు) పడుచున్న భ్రమలోనె నేనును తగులుకొని యుండి మతవిషయకములయిన నా విశ్వాసములను గొన్నిటిని గార్యములలోఁ జూపక యాత్మవంచకుఁడ నయి వితంతువివాహసంస్కారము చెడు నని కడచిన యిరువదియైదు సంవత్సరములనుండి యీశ్వరవంచకుఁడ నయి ప్రవర్తించి నాడను:................నాకంత్యదినములు సమీపించు చున్నవి. దక్షిణహిందూస్థాన బ్రహ్మసమాజమునకుఁ బ్రధానాధ్యక్షుడనుగా నుండి యీశ్వరునియొక్క జగదేకపితృభావమును మానవులయొక్క పర

స్పరభ్రాతృభావమును ఘోషించుచు నాత్మవంచకుడను లోకవంచకుడను భగవద్వంచకుడను నయి దేహము త్యజించుటకిష్టములేని వాఁడ నయి యీ లోకసామాన్య సౌభ్రాత్రమున కీవృద్ధదశలో సాహసించినాడను". ఇది యెంత యద్భుతపరివర్తనము అదునకు వలసిన శక్తియంతయు హృదయమున నణగియుండెను. ఇంచుక కదల్పబడి ప్రజ్వరిల్లెను. బాపయ్యగారికి హృదయములను కదల్పగల సామర్థ్యము గలదు.

ధర్మమార్గమున దృఢముగ నడువగలిగినవారు అరుదుగా నుందురు. బిడ్డలు ముందు తప్పటడుగులు వేయుచు పడుచు లేచుచు క్రమ క్రమముగా మంచి నడకను నేర్తురు. ధర్మమార్గమున నడువ బూనిన వారును మొదట సామాన్యముగ తప్పటడుగులు వేయుదురు; పడుచు లేచు చుందురు. బిడ్డలకువలె వీరికిని చేయూత యుండుట యావశ్యకము. ఆ సంగతి గమనింపక అసామాన్యబుద్ధిమంతులు కొందరు ధర్మమార్గానుచరులకు నే సాహాయ్యము చేయవలెనని తలంపకపోగా వారి పతనములనుజూచి యెగతాళిచేయుదురు. నిజమయిన ఈశ్వరభక్తులు మాత్రమె పతితులను ప్రేమించియుద్ధరింపగలరు; పావనులనుగ జేయ గలరు. ధర్మపథమున నడు గిడి క్రిందపడు వారియెడ నెట్టి యసహ్యమును జూపక హృదయపూర్వకమయిన సాను

భూతి కనపరచి వారిని నుత్సాహపూరితులనుగా జేసి ముందునకు నడుపగల సామర్థ్యము బాపయ్యగారికి పూర్తిగ గలదు. బాపయ్యగారి యాదర్శజీవనము ధర్మమునెడ నెంతయొ నిర్లక్ష్యముగా నుండిన నన్ను కూడ చిన్నప్పటినుండియు నాకర్షింప గలిగెను. తగిన శిక్షణమునందు పెరుగ కుండుటచే తన్మూలమున కలుగ వలసి నంత ప్రయోజనము మాత్రము నాకు కలుగ లేదు. ఆటలయందును, వినోదములందును అధికాసక్తుడనై యున్న నన్ను తనవైపునకు మరల్చుకొనుటలోనె ఆయనయందు విశేషశక్తి యున్నదని నమ్ముచున్నాను. నాయందు ఏ సద్భావములు జనించియుండినను, ఏపాటి సద్వర్తన మేర్పడి యుండినను, దాని కంతకు ఆయనయె కారకుడు. సాధుపురుషుల సాంగత్యమునకు తగని వాడనె యయినను, ఆయన నన్ను ప్రేమించి తన దరిని చేర్చుకొనెను. తన సలహాలు నిరుపయోగము లయి పోవుచున్నను, నాకు వానిని ఆయన తిరిగి తిరిగి చెప్పెడు వాడు. ఆయన సహానమువలనను, సాహాయ్యమువలనను, అవ్యాజమయిన ప్రేమవలనను, నేను కొంచెము ధర్మాభిరుచిని బడసి, ఆయన అడుగుజాడలనుబట్టి నడువ మొదలిడితిని. వర్ణభేదము విడిచితిని, విగ్రహారాధనను మానితిని. జందెమును త్యజించితిని. నా తల్లిశ్రాద్ధము ఆస్తికపద్ధతి జరిపితిని. కాని శోధనయందు పడితిని. తాళజాలక పోతిని. బుద్ధి చలించెను. ప్రాయశ్చిత్తము చేయించుకొని, జందెము తిరిగి వేసికొంటిని. సంఘమునందు మరల స్థానము పొందితిని. కాని నాకు సుఖమునకు బదులు దుఃఖమె మిక్కుటమాయెను. హృదయము ఆదర్శమువీడనె నిలచి యుండెను. కొన్ని సంవత్సరములనుండి ప్రేమింపబడిన యాదర్శము, జన్మసాఫల్యహేతు వని విశ్వసింపబడిన యాదర్శము, నిదర్శనపూర్వకముగ ప్రత్యక్ష మయిన యాదర్శము, ఎట్లు హృదయమునుండి ఒక్కమారుగ తొలగి పోగలదు? దాని పట్టునుండి తప్పించుకొనజాలక తిరిగి తదనుగుణముగ జీవింప గడంగితిని. పిమ్మట ధర్మప్రచారమునకును బూని సుమారు ఇరువది సంవత్సరములనుండి యథాశక్తి ధర్మవ్యాపనమునకు పాటుపడుచుంటిని. నేటికిని నన్ను ప్రేరేపించుచున్న బాపయ్యగారి యపారప్రేమను స్మరించి ప్రణమిల్లుచున్నాను.

ప్రస్తుతము గుంటూరులో ధర్మసాధనీసంపాదకులుగను బ్రాహ్మధర్మప్రచారకులుగను పని చేయుచున్న పాలపర్తి నరిసింహ్వాంగారు బాపయ్యగారి యనుచరులు. అనుష్ఠానపరులగుటకును, సుమారు పదునైదు సంవత్సరములనుండి అనేక కష్టములను సహించుచు ధర్మప్రచారము సలుపుటకును, నరసింహముగారు వలసిన శక్త్యుత్సాహములను బాపయ్యగారి

యుత్తమజీవితమును ఆదర్శముగా నుంచుకొనుట వలననే యని నిస్సంశయముగా జెప్పవచ్చును. బాపయ్యగారు జీవించి యున్నంతవరకు ఆయనను ప్రతిముఖ్యవిషయమునను సలహా అడిగిన తరువాతనె నరసింహముగారు కర్తవ్యమును నిర్ధారణ చేయుచుండిరి. సమయము చిక్కినప్పు డెల్లను, బాపయ్యగారు నరసింహముగారియందు ధర్మోత్సాహము పురిగొల్పెడు వారు. రాజమహేంద్రవరమునకు వచ్చుటకు పూర్వము నరసింహముగారు బాపయ్యగారిని సంప్రదించిరి. ౭-౧-౨-౧౯౦౭ తేదిగల యుత్తరమునందు బాపయ్యగారు ఈ తీరున నరసింహముగారిని హెచ్చరించిరి.—"ఇక్కడ (రాజమహేంద్రవరములో) నుండుటకు నీకు గల కోరికను నేను పూర్తిగా అర్థము చేసికొనగలను. బ్రాహ్మధర్మమునకును, సంఘసంస్కరణమునకును సంబంధించిన యుద్యమమునందు సాయపడవలె నను తలంపుతోడనే నామటుకు నేను ఈపట్టణమునకు బలవత్తరముగ నాకర్షింపబడి వచ్చితిని. దురదృష్టమువలన నేను వ్యాధిచే నశక్తుడ నయితిని. పంతులుగారితో కలసి పనిచేయుట నిస్సందేహముగా చాల కష్టమె. కాని యుద్యమమునకై తోడ్పడ మనము ప్రయత్నింపకుండుటకు అది కారణము కానేరదు........... నిజము చెప్ప వలసివచ్చిన, పంతులుగారియందు తప్పిదము

లున్నను నేను వారిని గౌరవింతును. బాగుగ యోచింపుము. ప్రస్తుతము కౌతరములో నున్న మన * హనుమంతముతో నాలోచింపుము. పిమ్మట నీవు ఏమి చేయదలచినది స్పష్టముగా తెలుపుచు పంతులుగారికి ఉత్తరము వ్రాయుము. నీవును హనుమంతము కూడను పంతులుగారు ప్రారంభించిన సత్కార్యములను సాగించుటకు ఎప్పుడో యొకప్పుడు ఇక్కడికి రావలె నని నే నెల్లప్పుడు కోరు చుందును, ప్రార్థించుచుందును........రాజమహేంద్రవరములో తప్ప నింకెచ్చటను ఆస్తికోద్యమముకొరకంత కృషి జరిగి యుండలేదు. పంతులుగారి సంస్థలన్నియు ఆస్తికపద్ధతుల ననుసరించి నడుపబడ వలసినవి. వానిని పవిత్రజీవులను తయారు చేయునట్టి యన్ని ఆశ్రమములుగా మనము చేయవలెను. బాగుగ యోచించి కార్యమును బూనుము." ఈ సలహా వాక్యములనుబట్టి బాపయ్యగారు తన యనుచరుల కెట్టి కార్యోత్సాహము కలిగించుచుండిరో గ్రహింప నగును.

బెజవాడవాస్తవ్యులు దామరాజు గంగాధరరావుగారు అడిగిన ప్రశ్నకు ప్రత్యుత్తరముగా ౧౧-౯-౧౯౦౮ తేదిన బాపయ్యగారు తమకు తెలిసినంతవరకు ఆంధ్రదేశమం దప్పటికి ౧. నాళము కృష్ణారావుగారును, ౨. కారు

* ఇది మా యింటిలోనివారు నన్ను పిలుచు పేరు.

మూరి కామరాజుగారును, 3. పిళ్ళారిశెట్టి సీతారామయ్యగారును, ౪. తాము మాత్రమె అనుష్ఠానికబ్రాహ్మలముగ నుంటిమని వ్రాసియుండిరి. ఆ కొలదిమందిలో ప్రారంభమయిన అనుష్ఠానికజీవనము ఆంధ్రదేశమందు క్రమక్రమముగా విస్తరిల్లి నేడు సుస్థిరముగ పాదుకొనుటకు బాపయ్యగారు కనపరచిన నిష్కళంకమయిన దృష్టాంతమును, కలిగియుండిన పవిత్రమయిన ప్రేమానురాగమును ప్రధానకారణము లని నుడువుటకు సంశయింప నక్కరలేదు. నాళము కృష్ణారావుగారును కారుమూరి కామరాజుగారును, ధర్మానుష్ఠానమున దృఢత్వమును తప్పినప్పుడు బాపయ్యగారు వారికుత్సాహము పురిగొల్పుచు వచ్చిరి. జ్ఞానము పెంపొందించుకొనుటకును ధర్మప్రచారము సలుపుటకును పిళ్ళారిశెట్టి సీతారామయ్యగారిని ప్రోత్సహించుచు వచ్చిరి. ప్రచారకులుగ నుండ నిశ్చయించుకొని కలకత్తాలో బ్రహ్మజ్ఞానము నభ్యసించుటకు పోవు విషయమున కీర్తిశేషులయిన కవుకొండల శాంబశివరావుగారికి హెచ్చరిక నొసంగిరి. పోస్టల్ ఇన్‌స్పెక్టరు దామోజీపురపు నారాయణగారును, సిండ్ అబ్జర్వర్ పత్రికా సంపాదకులు కోటంరాజు పున్నయ్యగారును, డాక్టరు వేదాంతం వెంకటకృష్ణయ్యగారును అనుష్ఠానికబ్రాహ్మసమాజకులయి యథాశక్తి దేశసేవ సలుపుటకు కారకులయిరి. బాపయ్యగారు పలుకులద్వారాకంటె నెక్కుడుగ పరిచయముద్వారా పరులతో నైక్య మగుచు తమ ధర్మజీవనము వా రందరియందు వ్యాపించునట్లు జేసిరి.

మత సాంఘిక విషయములు మాత్రమెగాక దేశాభివృద్ధికరము లగు స్వదేశవస్తుప్రోత్సాహము, స్వరాజ్యోద్యమము, విద్యావ్యాపనము మొదలయిన యితర విషయములు కూడ బాపయ్యగారి హృదయమున ప్రధానస్థానము నాక్రమించుకొనుటచే, ఆయనకు అయ్యదేవర కాళేశ్వరరావుగారు, ముట్నూరి కృష్ణరావుగారు, డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు, పింగళి లక్ష్మీనారాయణగారు, డాక్టరు పాలకోడేటి గురుమూర్తిగారు, ఉన్నవ లక్ష్మీనారాయణగారు, జయంతి గంగన్నగారు, గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు, కట్టమంచి రామలింగారెడ్డిగారు, మునగాల జమీందారు శ్రీ రాజా నాయని వెంకటరంగారావు బహద్దరుగారు, చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు, అత్తిలి సూర్యనారాయణగారు, నాళము పట్టాభిరామారావుగారు, నాళము కృష్ణారావుగారు, ఆదిపూడి సోమనాథరావుగారు, కీర్తిశేషులయిన కొమర్రాజు లక్ష్మణరావుగారు మొదలగువారు పరమమిత్రులుగ నుండిరి. స్థూలముగ జూచిన బాపయ్యగారి జీవితము ఒక్క వ్యక్తికి సంబంధించి ౨౬ సంవత్సరములు మాత్రమె ఆయుఃప్రమా

ణము కలిగి అతి స్వల్పకాలములోనె యంతరించి నట్లు కన్పట్టును గాని సూక్ష్మముగ పరిశీలించిన అయ్యది అన్ని వైపులను భూమిలోనికి నూడలు దిగి విశేషప్రదేశము నావరించు అశ్వద్ధవృక్షమువలె అనేకుల హృదయములలో వేరూని నేటికిని విస్తృతాకారము దాల్చి యున్నట్లు పొడగట్టక మానదు.

జీవనస్మృతి

౧౪ వ ప్రకరణము

మిత్రవర్గము—స్త్రీలు

ఇంతవరకు బాపయ్యగారి మిత్రు లని తెలుపబడిన వారు అందరును పురుషులె. బాలురుమొదలు వృద్ధులవరకు వివిధోద్యమములందు పాటుపడు చుండిన యా పురుషస్నేహితులు ఆయన ధర్మస్వభావము ప్రేమపూరిత మయి సాంక్రామికముగ హృదయమునుండి హృదయమునకు పరివ్యాప్తి జెందినటుల వ్యక్తపరచిరి. ఆయనకు స్త్రీలలోను మిత్రులు గలరు. ఆయన వారితో నెట్టి యుత్తమసఖ్యము నెరపి యే విధమున ప్రవర్తించి తత్సంబంధమయిన జీవనముద్వారా తన యాత్మ నెటుల వికసింప జేసికొనెనో, ధర్మము నెట్లు పెంపొందింప గలిగెనో ప్రత్యేకముగ విచారించుట యావశ్యకము గాన, ఆ విచారణ యిదివరలో నెత్తుకొనబడ లేదు. పురుషుడును స్త్రీయు పరస్పరసంబంధమునకు వచ్చునప్పుడు ప్రకటితమగు ధర్మమునకు ప్రత్యేకస్వరూప ముండును. బాపయ్యగారి విషయములో నది యేచందమున ప్రకాశించెనో

చూతము.

ఆయనకు ముఖ్యముగ మూడు విధములయిన ప్రేమ సంబంధములు బంధుకోటిలో ముగ్గురు నారీమణులతో నేర్పడి యున్నట్లు చదువరులు గమనించి యుందురు. వానిలో మొదటిది తన తల్లితోడను, రెండవది తన చెల్లెలితోడను, మూడవది తన భార్యతోడను, స్త్రీలయెడ కనపరుపబడు ప్రేమ వివిధముగ వ్యక్త మగుట సామాన్యముగ సర్వమానవుల యనుభవము. కాని కొందరది తమ విషయమున కేవలము మాతృప్రేమగా మారిపోయె నని చెప్పుదురు. వారి దృష్టిలో స్త్రీజాతిలోని వారందరు తల్లులె. అట్టి స్థితికి వచ్చిన యీశ్వరభక్తులు గలరు. ఇటీవల కొందరపూర్వబుద్ధిమంతులు బయలుదేరుచున్నారు. వీరికి ప్రపంచములో నున్న ప్రతిస్త్రీయు ప్రణయసంబంధమున కన్పట్టును. మాత యని, సోదరి యని యేర్పడు సంబంధములు కూడ ప్రేమయొక్కయా ప్రణయస్వరూపములో సమసి పోవునని వీరి యభిప్రాయము. సకల వనితలను మాతలవలె జూచు వారివలన సంఘమున కంతగా నష్టము లేదు గాని కలుగవలసిన లాభము మాత్రము లేకపోవును. వారు కుటుంబజీవనమున కేమాత్రము అవకాశ మీయరు. అవ్యాజ మయినట్టియు స్వార్థరహితమయినట్టియు నిర్మలప్రేమ భార్యాభర్తల నడుమను, మాతా

శిశువుల నడుమను, సోహోదరీసహోదరుల నడుమను సహజముగ పొడసూపి పెంపొందుటకు సాధనభూతముగ ఈశ్వరుడు కల్పించిన గృహస్థాశ్రమమునకు వారు ప్రతికూలు రయి శుష్కసన్యాసజీవనమును తాము గడపుచు నితరులకు ఆదర్శముగ జూపుదురు. ఈ జీవనము పూర్తిగ అస్వాభావిక మగుటచే వ్యాపింపజాలదు. అది గడపు వారిమూలమున నారీలోకమున కెట్టి తొందరయు లేదు. కాని స్త్రీల నందరిని కళత్రసంబంధమున గ్రహింప బూనిన రెండవ తెగవారు కనపరచు జీవనమును స్వభావమునకు విరుద్ధ మయినదై వర్ధిల్ల నేరక పోయినను, వారు సంఘమునందు అరాచకులు. పవిత్రప్రేమదేవతకు ఆలయము లని చెప్ప నొప్పు గృహములను ధ్వంసము చేయుటయె వారి యత్నము. తన్మూలమున విశేషముగ కలిగెడు నష్టమును ప్రతిఘటించుటకు గొప్పకృషి యావశ్యకము. ప్రతిస్త్రీని తల్లివలెనే గాని లేక భార్యవలెనే గాని చూచుట రెండును అస్వాభావికములె. ప్రేమ ఏకమేవాద్వితీయ మగు సత్యముయొక్క ప్రకాశము. "ఏకం రూపమ్ బహుదాయః కరోతి." ఏకసత్యమునుండి వివిధవ్యక్తు లుత్పన్నము లవుచున్నవి. వ్యక్తులు విభిన్నము లయినవి గాన వానిలో పరస్పర మేర్పడు సంబంధములు విభిన్నముగా నుండును. ఆ వేరువేరు సంబంధములందు

గానవచ్చు ప్రేమయు వేరు వేరుగా నుండును. రుచులు వేరు వేరు; కళలు వేరు వేరు; కాంతులు వేసు వేరు;అటులనె ప్రేమలును వేరు వేరు. ప్రత్యేకము పురుషులలో నుండునది సహిత మొక్క విధ మయిన ప్రేమ యని చెప్పుటకు వలనుపడదు. తండ్రి కొడుకు, అన్న తమ్ముడు, గురుడు శిష్యుడు, మిత్రుడు మిత్రుడు, యజమానుడు సేవకుడు, ఈ తీరున నెన్నియో విధముల ఒక పురుషుడును మరియొక పురుషుడును ప్రేమ సంబంధమందు గూడ్చబడుదురు. ప్రతి సంబంధమునందు కాన్పించు ప్రేమ యెప్పటికిని ఒక్కమోస్తరుగా నుండదు. ఆ విధముననె పురుషుడు స్త్రీలతో పొందెడు లేక పెట్టుకొనెడు సంబంధములందును ప్రేమ విభిన్నముగా నుండును. తల్లియెడలను, చెల్లిలియెడలను, భార్యయెడలను కనపరుపబడు ప్రేమలు ఒక్కమాదిరివి యని యెవ రనగలరు? ఒక ప్రేమకును మరియొక ప్రేమకును నెంతయో వ్యత్యాసము కలదు. ఇటులనె యితరము లయిన ప్రేమసంబంధములును పురుషునకు స్త్రీలతో కలుగును. బాపయ్యగారు ప్రేమయొక్క యీ సహజ వైచిత్ర్యమునె తమ జీవితముద్వారా ప్రకటించిరి.

సాంఘిక పరిస్థితులను తన తల్లి తనకు దూర మగుట తటస్థించి నప్పుడు, ఆమె నెటులయిన తనతో జేర్చ మని ఆయన యీశ్వరుని సదా ప్రార్థించెను. తన చెల్లెలియెడల

గాఢానురాగము కనపరచెను. ఆమె వియోగముచే ప్రాపంచిక జీవితముయొక్క యస్థిరతను సహిత మాయన గుర్తింప గలిగెను. భార్య చిన్నదె యయినను ఆమెను అమితముగ ప్రేమించెను. ఆమె విద్య విషయములోను అభివృద్ధివిషయములోను నెంతయో యాతురతను జూపెను. ఒక దిన మామె వద్ద ఆయన చాలసేపు గడపినప్పుడు, మాటలసందర్భములో, తన జబ్బుయొక్క స్వభావమును వివరించుచు తాను త్వరలోనె చనిపోవుట సంభవించినయెడల ఆమె తిరిగి వివాహము చేసికొనుట కిష్టము కలిగియుండె నేమొ తెలిసికొన గోరెను. "ఈశ్వరానుగ్రహమువల్ల మీకు ఆరోగ్యం కలిగి మీరె చిరకాలము జీవించియుండి ఎందువల్లనో అకస్మాత్తుగా నేను ఇప్పుడే చచ్చిపోతే మీరు మళ్ళా పెళ్ళి చేసుకుంటారా?" అని ఆయనభార్య మంగతాయమ్మగా రడిగిరి. ఆప్రశ్నకు జవాబుగా "నే నెన్నటికీ చేసుకోను." అని ఆయన చెప్పగా, "నేను మాత్రం చేసుకుంటానా?" అని ఆమె నుడివెను. ఆయన యేకపత్నీవ్రతదీక్ష కలవాడు. ఒక స్త్రీని భార్యగా గైకొనిన తరువాత, ఆమె జీవించి యున్నప్పుడును మృతిజెందిన తరువాతను కలకాలము ఆమెతో తప్ప నింకే స్త్రీతోడను భార్యాసంబంధమున మెలంగకుండుట యా దీక్షాపరుల ధర్మము. బాపయ్యగారు తన వివాహాదర్శమును

నోటిమాటలతో చెప్పుటయె గాక జీవితమునందు చక్కగా కనపరచెను. తదనుగుణముగ ఆయన తన భార్యను మిక్కుటముగ ప్రేమించి యుండుటచేత, ఆమెయు ఆయనయందు నధికానురాగము చూపగలిగెను. చిన్నతనమందుండుటచే, బుద్ధి దృఢముగ నుండక ఆమె ప్రవర్తనను కాపాడుకొన లేకపోవునేమో యను భయమువలన, ఆమె తిరిగి వివాహము చేసికొన దలచిన చేసికొన వచ్చునని ఆయన తన సమ్మతిని తెలుపుచుండెను. ఉత్తమజీవనము గడపజాలక అధమజీవనములో పడిపోవుటకంటె పునర్వివాహము చేసికొనుట మధ్యరకపు జీవనముగా నుండునని ఆయన యటుల తెలుపుచుండెనే గాని ప్రతి స్త్రీయు ఒక భర్తను గోల్పోయిన తరువాత మరియొక భర్తను జేపట్టుట గొప్పధర్మముగా ఆయన యెంతమాత్రము భావించి యుండలేదు. పురుషులు బహువివాహములు చేసికొనుటయు ఆయన యుత్తమధర్మముగా నంగీకరింప డని ఆయన తనవిషయములో తనభార్యతో చెప్పిన మాటల వలన స్పష్టపడుచునె యున్నది. ఆయన తన భార్యకు పునర్వివాహస్వాతంత్ర్య మిచ్చియున్నను, ఆమె యథార్థప్రణయ ప్రేమను ఆయనవద్ద చవిచూచి యుండుటచే తిరిగి వివాహము చేసికొనక విశుద్ధవర్తనము కలిగి ఆయన చనిపోయినను ఆయనయందె తన హృదయమును నిలిపి నిరాడంబర

జీవనము గడపుచున్నది. ఆయన ప్రణయప్రేమయు అతిగభీరమయినదని ఆమెజీవితమె చాటుచున్నది. తాను తన మామగారి యింటివద్దనుండి నట్లును, ఇతరులాడెడు మాటలు భరింపజాలక తన భార్య సరిగా భోజనము చేయుటను కూడ మాని నట్లును, చేతనయిన ఆమె నోదార్పవలసిన దని ఆమె బంధువు లామెను తనవద్దకు పంపగా తా నామె నొంటరిగా గదిలోనికి తీసికొనిపోయి దయతో మాటాడి ఆమెకు సంతోషము కలిగించి నట్లును, ఒక నాటిరాత్రి ఆయన కలను గాంచెను. ఈ కల తన కేల వచ్చెనని తెల్లవారినది మొదలు అదే యోచనతో నుండెను. వేరే పనులమీద ఇల్లు విడిచి వెళ్ళి బయట ఆదిన మంతయు ఆయన గడపి సాయంకాలము ఇంటికి రాగా ఆరోజు తనకు వచ్చిన యుత్తరములలో నొకటి తన భార్యవద్దనుండి వచ్చినదియై నలుగురిలో తల యెత్తుకొనుటకే యామెకు చాల కష్టముగా నున్నదని రాత్రి కలలో తెలియవచ్చిన విషయమునె తెలుపుచుండెను. "May the dream be realized! May she be sent to me and may she be cheerful in my company." కలలో గాంచినది యిలలో జరగును గాక! ఆమె నా వద్దకు పంపబడి నాసాంగత్యమున సంతోషము బడయును గాక!—అని ఆయన దేవుని ప్రార్థించెను. ఆమె యుత్తరము వ్రాయుటయు, ఆ యుత్తరములోని సంగతులనె ఆయన కలగనుటయు నేక కాలమున జరుగుట వా రిరువురమనస్సులు

పరస్పరాభిముఖములై యైక్యత జెందె ననుటకు నిదర్శనముగా నున్నది.

"ఇక ఆయన యే యితరవనితలతో మెలగి యుండెనో వారిలో నొకరు శ్రీమతి లక్ష్మీకాంతమ్మగారు, పి. రామచంద్రరావుగారి భార్య. భార్యాభర్త లిరువురును వీరేశలింగము పంతులుగారు స్థాపించిన వితంతుశరణాలయములో పనిచేయుటకు రాజమహేంద్రవరమునకు వచ్చియుండిరి. ఆమెను తరచు కలసికొని శరణాలయ విషయములలో ఆయన యామెతో మాటాడవలసియుండెను. ఆయన కామెతో చాల పరిచయము కలిగెను. ఆమెనుగురించి తన కేర్పడిన యభిప్రాయము దినచర్యపుస్తకమున నీతీరున వ్రాసికొనెను.—"శ్రీ పి. లక్ష్మీకాంతమ్మగారు నిజముగా కొంత సామర్థ్యముగల స్త్రీ. ఆమె యితరులకుభక్తినిపురిగొల్ప గలదు. ఆమె కీర్తన పాడుచుండగా విని యెవరు భక్తిశూన్యులుగ నుండ గలరు? ప్రతిహృదయమునందు భక్తిని చొప్పిల్లచేయు ఈశ్వరస్వరము ఆమెకంఠమునందు గలదు. పరమేశ్వరు డామెకు పరోపకారజీవనమును ప్రసాదించును గాక!'' బాపయ్యగారు వ్రాసికొనిన యీ యనుభవము స్త్రీలయందు ప్రత్యక్షమగు ఈశ్వరమహిమను ఆయన చూడగలిగి యందునకు వారిని మెచ్చుకొనుటకు ప్రారంభించె నని సూచించుచున్నది.

ఆయన కలకత్తా కొక పర్యాయము వెళ్ళినప్పుడు, బ్రహ్మానంద కేశవచంద్రసేనుని తల్లిని సందర్శించెను. ఆమెను గురించి యీవిధమున వ్రాసికొనెను.—"వృద్ధురా లయి జబ్బుస్థితిలో నుండియున్నను, ఆమె భక్తితోడను ఉత్సాహముతోడను తేజరిల్లుచుండెను. నేను జీవితములో ననుసరించుచున్న ధర్మమును దృఢముగ నవలంబింపవలె ననియు, అది నా దేశీయులకు బోధింపవలె ననియు, ఆమె నాకు పూర్తిగా ధర్మోపదేశము చేసెను. ఆమె నన్నాశీర్వదించి ఫలహారము లొసంగెను. నే నామె ముందు సాష్టాంగపడి యితరుల కుపయోగపడు లాగున చిరకాల మామె జీవించునట్లు కటాక్షింపుమని యీశ్వరుని ప్రార్థించితిని." ఈ సందర్భము వలన, ధర్మప్రబోధము చేయగల వ్యక్తి స్త్రీ యయినను, ఆయనయొక్క సంపూర్ణగౌరవమునకు పాత్రురాలై యుండె నని తెలియుచున్నది.

ఆయన కలకత్తాలో పండిత సీతానాథతత్వభూషణుల యతిథిగా నుండెను. వారి కుటుంబముతో అక్కడ నున్నంత కాలము స్వేచ్ఛగా మెలగుచుండెను. తత్వభూషణుల కుమార్తెలు ఆయనతో నెక్కువ సఖ్యము చేసిరి. వా రార్గురును బ్రాహ్మసమాజాదర్శములను గ్రహించినవా రనియు, * రాఖీ

* వంగదేశవిభజనానంతరము వంగదేశస్థులు ఐకమత్యసూచకముగా 'రాఖీ' సూత్రము ఒకరు మరియొకరి చేతికి ప్రతివత్సరము విభజనదినమున కట్టుకొనుచువచ్చిరి. అదియె రాఖీదినము.

దినమున వారిలో చివరి అమ్మాయి పాకీపనిచేయు నొక యస్పృశ్యురాలయిన స్త్రీకి ప్రణమిల్లి రాఖీని కట్టి విశాల ప్రేమను కనపరచె ననియు, వినుటచే ఆయనకు వా రందరి యం దెక్కుడు మక్కువ గలిగెను. ఆయన మ్యూజియమును జూలాజికల్ గార్డెన్సును, ఇతరస్థలములను వారితో కలసి వెళ్లి చూచెను. ఇంటివద్ద వారితో మాటాడుచుండెను. ౨౮-౧౦-౧౯౦౬ తేదిన జరిగిన సంభాషణమునుగురించి ఆయన యిట్లు వ్రాసికొనెను—"శ్రీలీలామాయి దత్తతో (తత్వభూషణుల ప్రథమపుత్రిక) చాలసేపు సంభాషించితిని. మన దేశముకొరకు పాటుపడుటకయి ఆమెను ప్రోత్సాహపరచితిని. చివరభాగమున శ్రీ జ్యోతిమాయిదత్త కూడ రాగా, అది యవకాశము తీసికొని శాఖాహారమునుగురించియు దాని యవసరమునుగురించియు ముచ్చటించితిని. ఈ విషయములనుగురించి వా రెక్కువగా తెలిసికొనునట్లును, సత్యమని తెలిసికొనిన దానిప్రకారము నడచుటకు తీర్మానించుకొనునట్లును పరాత్పరుడు వారికి తోడ్పడును గాక!" ఈ ప్రసంగమువలన ఆయన సమయముచిక్కి నప్పుడెల్లను పురుషులకె గాక స్త్రీలకును దేశసేవయు ధర్మాచరణయు లక్ష్యములుగా చూపుచుండె నని తెలియుచున్నది. మాంసభక్షణము తగదని బాపయ్యగారు తలచెడు వారు. కలకత్తా

బ్రాహ్మసమాజికులు దాదాపు అందరు ధారాళముగ మాంసాహారము భుజించెదరు. అది చూచి శాఖాహారముయొక్క యావశ్యకతను వారికి కనపరుప యత్నించెను. ఆయన కలకత్తాను విడిచివచ్చుటకుముందు ౮-౧౧-౧౯౦౬ తేదిన ఆయన యిట్లు వ్రాసికొనెను—"ఇంటికి వచ్చినతరువాత సీతానాథబాబు కుమార్తెలు, శ్రీ లీలామాయిదత్తతోను, శ్రీజ్యోతిమాయిదత్తతోను మాటాడితిని. పవిత్రమును ఉత్తమము నయిన అనురాగముచే బంధింపబడి యత్యంతప్రేమాస్పదు లయిన యా సోదరీమణులను విడువవలసి వచ్చుచున్నదను తలంపువలన నిజముగా మనస్సునకు కష్టము కలుగుచున్నది. అట్టి వియోగములు జీవితములో అనివార్యములు. దయతో మమ్ములను దగ్గరగా చేర్చిన ప్రేమసాగరు డగు పరమేశ్వరుడె యేకగర్భమున జనించినవారివలె మమ్మెల్లరను సన్నిహితముగా బంధించునుగాక! మే మొకరి కొకరు నిజమయిన సానుభూతిని హృదయపూర్వక మగు నుత్తమానురాగమును జూపుచు సోదరసోదరీలవలె నుందుము గాక!" ఈ వాక్యములు పరయువతులతో గాఢమయిన సోదరప్రేమయం దైక్యమగుట యెటు లుండునో సూచించుచున్నవి.

ఉన్నతవైద్యవిద్యను ఇంగ్లాండులో నభ్యసించి యందుత్తీర్ణురాలయి మన దేశమునకు తిరిగివచ్చి వైద్యవృత్తిలో

కృషిచేయుచున్న శ్రీమతి కమలాకరుగారు ఆయనకు పరిచయ మయిన నారీమణులలో మరియొక ముఖ్యురాలు. ఆమెతో ఆయన చనువుతో చరించువాడు. ఆయన చికిత్స చేయించుకొనుచు చెన్నపురిలో నుండగా ఆమె ఆయనకు సేవ చేయు దినములలో నొకరోజు ౪-౨-౧౯౦౭ తేదిన ఆయన యిటుల వ్రాసికొనెను—“సోదరి కమలాకరుగారు తల్లికంటె కూడ నెక్కువగా నాకు కావలసిన వన్నియు చేసిపెట్టుచున్నారు. రోగపీడితు లగు సర్వమానవులయెడ ఆమె యిటువంటి యాదరణను సదా చూపునట్లు పరమేశ్వరు డనుగ్రహించును గాక! నాకు జూపబడు వాత్సల్యమునకు నే నర్హుడగునట్లు ఆయన కటాక్షించును గాక!’’ ఈమాటలు ఆయనయొక్క హృదయౌన్నత్యమును చాటుచున్నవి.

ఆయన మరియు ఉన్నవ లక్ష్మీనారాయణగారి భార్య శ్రీమతి లక్ష్మీబాయమ్మగారు మొదలయిన నారీమణులతో కలసి స్నేహముతో చరించెను; వితంతుశరణాలయ నివాసినులతో దగ్గరసంబంధమునకు వచ్చెను. అందరియందును ఆయనపవిత్రప్రేమనె చూపగలిగెను. ఆయన పురుషులతోడనె గాక నారీలోకముతోడను వివిధములయిన ప్రేమసంబంధముల పెట్టుకొని హృదయమును విపులమును పరిపక్వమును జేసికొనెను; స్త్రీపురుషుల పరస్పరసఖ్యముద్వారానె జీవితము నిజ మయిన పరిపూర్ణత జెందగల దని చూపెను.

జీవనస్మృతి

౧౫ వ ప్రకరణము

ఉద్యోగము

ప్రతివ్యక్తియు తనశక్తి ననుసరించి యేదో యొకవృత్తి నవలంబించిన గాని వ్యక్తిజీవనమును సంఘజీవనమును పెంపొందనేరవు. తన జన్మసాఫల్యమును తా నేజాతియందు జన్మించునో ఆ జాతియొక్క యభివృద్ధిని తీవ్రముగ నభిలషించువారు సోమరితనమున కేమాత్రము అవకాశ మీయక తమ కర్హమయిన వృత్తిని జేపట్టి యందు శక్తు లన్నియు ధారపోయుదురు. బాపయ్యగారు ఉపాధ్యాయవృత్తికి తగియుందు మని నిశ్చయించుకొని యందు ప్రవేశించిరి. వృత్తిని పొట్టకూటి కని గాక పరమార్థ సాధనముగా నవలంబించువారు ఆవృత్తిద్వారా నెట్టి ధర్మవర్తన కనపరుప గలుగుదురో బాపయ్యగారి జీవితమువలన చక్కగా తెలియగలదు.

దొరతనమువారి కొలువులో నుపాధ్యాయులుగా నుండుట కాయన మొదట ప్రయత్నించెను. ఆ ఉద్యోగ

మీాయబడిన ఆర్డరు ఆయనకు ౧౧—౧౧—౧౯౦౭ తేదిన అందెను. నాడు ఆయన దినచర్యాపుస్తకమున నిట్లు వ్రాసికొనెను. "తుట్టతుదకు నా యుద్యోగసంబంధ మయిన ఆర్డరు వచ్చె నని నేటి సాయంకాలము అకస్మాత్తుగా వింటిని. ఇది సంతోషదినము. ఇంత దనుకవలెనె యిక ముందును పరమేశ్వరుడు తన సేవకుని నాశీర్వదించును గాక! ఆయన యిచ్ఛ నెరవేరును గాక!" ఈ వ్రాసికొనిన దానిని బట్టి ఆ యుద్యోగమున చేరినప్పుడు ఆయన తన పైవి యధికారుల సేవకుడ నని గాక యీశ్వరసేవకుడ నని యెరిగియుండి యీశ్వరేచ్ఛ తన జీవితమున నెరవేరును గాక యని కోరికొనినట్లు స్పష్టము. ఎటువంటి యుత్తమాదర్శమొ పరికింపుడు. అతిభక్తిశ్రద్ధలతో నాటినుండి ఆయన తన యుద్యోగకార్యములను నిర్వర్తించెను. ఒక నిమిష మయినను ఆయన వ్యర్థముగ పోనియ్య లేదను టలో నతిశయోక్తి లేదు. నిద్రాహారసమయములు పోగా తక్కిన యన్ని వేళలయందు ఆయన యేదో యుపయోగకర మయిన పని చేయు చుండెను. కొన్ని గంట లింటివద్ద పని చేసిన గాని, ఒక గంట కాలేజీలో లెక్చె రిచ్చుటకు వీలు లేదని ఆయన చెప్పెడు వాడు. ఉద్యోగ విషయమున అంతగా కృషి సలిపెను. ఎన్నియో యితర విధులు నిర్వహించుచు స్వయముగా వంట చేసికొనుచు ఆయన కాలేజిపని నిమిత్త

మంత కష్టపడుట ఆశ్చర్యకరము. కాని వృథా కాలక్షేపము చేయకుండ పాటుపడుట ఆయనజీవితములో మొత్తముమీాద నున్న యొక ప్రధాన లక్షణము. ప్రస్తుతము ఆంధ్రయూనివర్సిటీ వైస్ చాన్సెల్లరుగా నున్న కట్టమంచి రామలింగారెడ్డిగారితో ఆయన యొకరోజున మాటాడుచు ఎక్కువ ముఖ్యమయిన పని కలిగియుండుటచే వారివద్దకు వెళ్ళుటకు వీలులేక పోయెనని చెప్పెను. "My dear man, do not care for personal relations so much. Do your duty first and then if you have time and energy, you may attend to friends and such affairs."- "ప్రియమిత్రుడా, స్నేహసంబంధముల నంతగా లక్ష్యపెట్టకుము. నీ విధికృత్యము ముందుగా చేసికొనుము. తరువాత నీకు కాలము, ఓపిక ఉండిన, స్నేహితులనుగురించి అట్టి యితరవిషయములనుగురించి విచారించుకొనవచ్చును." అని రామలింగారెడ్డిగారు నుడివిరి. ఈమాటలయం దెంతయో సత్యము కలదని బాపయ్యగారు వానిని తన దినచర్యాపుస్తకమున వ్రాసిపెట్టుకొనిరి. అట్టి కార్యతత్పరతగల బాపయ్యగారుద్యోగకార్యములం దేమిలోటు లేకుండ పాటుపడి రని వేరుగ వ్రాయ నక్కరలేదు. ఆయన విద్యార్థులను సులభముగ వశపరచుకొన గలిగియుండెను. బోధనాభ్యాసనకళా

శాలలో ఆయన ఎల్. టి చదువునప్పుడె ఆయనకున్నయా శక్తిని కనబడె ననియు, ఇతర ఉపాధ్యాయులదగ్గర అమితముగా అల్లరిచేయు పిల్లవాండ్రు ఆయన చదువు చెప్పుటకు రాగానె నిశ్శబ్దముగ నుండెడువా రనియు, ఆయన యొక్క ప్రశాంత కృపావీక్షణములును మృదుమధుర వాక్కులును సమ్మోహనాస్త్రులవలె నెట్టి దుడుకు వాండ్రనైనను లోబరచుకొన గలిగియుండె ననియు, ఆ రోజులలో ఆ కళాశాలలో విద్యార్థిగా నున్న డాక్టరు పాలకోడేటి గురుమూర్తిగారు చెప్పుచున్నారు. కళాశాలలో పనిచేయుచున్నంత సేపు మాత్రమె గాక తక్కిన సమయములం దెప్పుడు పట్టిన అప్పుడు విద్యార్థులు తనవద్దకు వచ్చుటకు ఆయన యవకాశ మిచ్చెను. ఆయన భోజనముచేయునప్పుడు కూడ ఆయనచుట్టును విద్యార్థులు కూర్చుండి స్వేచ్ఛగా ఆయనతో మాటాడుచుండిరి. చదువువిషయములోనె గాక వారి వర్తనవిషయములోను ఆయన వారికి సలహా చెప్పుచుండెను. విద్యార్థు లాయనయందు చాల యిష్టము కలిగియుండిరి. బి. ఏ తరగతులకును ఆయన బోధించుచుండుటచే, ఆయనయం దభిమానము గల బాలుర సంఖ్య విశేషముగా నుండెడిది. ఈ విధముగ నంతయు చక్కగా నడచుచుండెను.

కాని ప్రతికూలపరిస్థితు లేర్పడ జొచ్చెను. అవి

యెట్లు ప్రారంభ మాయనో, వానినిగూర్చి బాపయ్యగా రెట్లు తలపోసిరో, ఆయనయె యీ తీరున ౧-౮-౧౯౦౬ తేదిన వ్రాసికొనెను—“నా యుద్యోగము ఖాయపరచుటకు సిఫారుసు చేయుడని అడుగుటకు నాతరఫున గణపతి అయ్యరుగారు హంటరు దొరగారివద్దకు వెళ్లిరి. సంఘసంస్కరణ విషయములో నేను జోక్యము పెట్టుకొనుచున్నందులకు నన్ను గురించి చాల యతృప్తితో హంటరు దొరగారు మాటాడిరట. డబ్బు పుచ్చుకొనుచున్న పనియందు మనుష్యుడు పాటుపడవలెను. ఆయన మొదట ఎమ్. ఏ ప్యాసు కావలెను. ఉద్యోగము ఖాయమగు నని, ఆయన అంతవరకు తలంపగూడదు. సంఘసంస్కరణమునుగురించి గాని వక్రపద్ధతులను సరిచేయుటనుగురించి గాని ఆయన అంతకు ముందుగా యోచింపనె గూడదు.’’ అనియు నీదోరణిలోనె మరికొన్ని మాటలును హంటరుదొరగారు చెప్పినటుల వింటిని. కొందరు జనుల యభిప్రాయము లెంత వికృతముగా నుండును! తాను చేయగల పనులలో ఉద్యోగసంబంధమయిన పని యొకటి మాత్రమె యని మానవుడు తెలిసికొన లేకున్నాడు. న్యాయము తెలిసికొనుటకును, తదనుగుణముగ నడచుకొనుటకును అవశ్యమయిన యింగితమును పరమేశ్వరుడు నా కనుగ్రహించునుగాక!’’ హంటరుదొరగారితో ప్రారంభమయిన యీ

సంఘర్షణ ముదిరినది. ౨౭-౮-౧౯౦౯ తేదిన బాపయ్యగారిట్లు వ్రాసికొనిరి.—"ఆర్ట్సుకాలేజిలో నున్న నా యుద్యోగమును విడిచి ట్రైనింగుకాలేజిలో నలుబదిరూపాయల జీతముగల పనిని ఒప్పుకొనవలసిన దని హాంటరుదొరగారు నన్ను కోరిరి. అట్టి చపలచిత్తులైన యధికారులనుండి నన్ను పరమేశ్వరుడు దూరముగ నుంచును గాక! ఆత్మగౌరవమును, ఆత్మనిర్భరతను ఆయన నాకు నేర్పును గాక!" మరుసటి దినము ౨౮-౮-౧౯౦౯ తేదిన ఇట్లు వ్రాసికొనిరి.—"ట్రైనింగుకాలేజికిపోవుటకు నేను సమ్మతింప జాలనని హాంటరుదొరగారితో చెప్పితిని. దొరగారు నాయెడ సానుభూతి కనపరచి సబ్ అసిస్టెంటు ఇన్స్పెక్టరు ఉద్యోగమునకో లేక ఇంకొకచోట నేపనికో సిఫారుసు చేసెద నని చెప్పిరి. ఈశ్వరుడు నన్ను ఆశీర్వదించును గాక!" మూడవ అసిస్టెంటుగా ట్రైనింగుకాలేజిలో ఖాయపరుపబడినట్లు తనకు తెలిసి ౨౧-౯-౧౯౦౯ తేదిన ఇట్లు వ్రాసికొనెను.—"ఇది నిజముగా, నాకు గొప్ప న్యూనత. అరువది రూపాయలకు పని చేయుచుండగా, ట్రైనింగుకాలేజినుండి అంతకంటె నున్నతమయిన పని చేయుటకు ఏబదిరూపాయలకు ఆర్ట్సుకాలేజిలోనికి తీసికొని ఇప్పుడు తిరిగి ట్రైనింగుకాలేజికి నలుబది రూపాయలపనికి పంపుట నన్ను హీనముగ జూచుటయె. ఈ విషయములో

నన్ను ఈశ్వరుడు పరీక్షింపదలచినట్లు కాన్పించుచున్నది. ఆత్మగౌరవమునకు భంగము లేకుండ సగౌరవముగ మెలగుటకు నాకు శక్తిని ప్రసాదించును గాక!" వీరేశలింగము పంతులుగారికిని, వెంకటరత్నము నాయుడుగారికిని బాపయ్యగారు తన యీ మనోభావములను వ్యక్తపరచిరి. వారిరువురు ఆయన తలచునట్లు ఆ యుద్యోగము నిరాకరించుటయె విధి యని చెప్పిరి. ౨౯-౯-౧౯౦౯ తేదిన ఆయన ప్రిన్సిపాలుద్వారా డైరెక్టరుకు పెట్టిన అర్జీని హాంటరుదొరగారికి పంపిరి. అది తమద్వారా పంపుట కంగీకరింపమనియు బాపయ్యగారె స్వయముగా పంపుకోవలెననియు తెలుపుచు అమర్యాదగా దొరగారు ఆయనకొక యుత్తరము వ్రాసిరి. అది చూచి "It is strange how people can smother their conscience." 'మనుష్యులు తమ మనస్సాక్షిని ఎట్లు చంపుకొనెదరో అది చిత్రము.' అని ఆయన భావించెను. కాని తమ యంతరాత్మను తమవీలునకు తగినట్లు త్రిప్పుకొనగలవారికి ఆయన మాటలె చిత్రముగా నుండును! ౩౦-౯-౧౯౦౯ తేదిన ఆయన తన అర్జీని డైరెక్టరుకు స్వయముగా పంపి ట్రైనింగుకాలేజిలోని యుద్యోగము తన కక్కర లేదని హాంటరుదొరగారితో చెప్పెను. ఆరోజున ఆయన తన దినచర్యపుస్తకములో

వ్రాసికొనిన * యంశములు ఇదివరలో నొక సందర్భమున తెలుపబడినవి. ఆ మరుచటి దినము ఆయన యిట్లు వ్రాసికొనెను—"I met Mr. Hunter in the college and took leave of him. He said he would have done something for me if I had not sent in my petition to the Director. May God teach me to live an honest and self-respecting and dignified life, despite all consequences! Let Truth always guide me and let my ideals be always high." "కాలేజిలో హంటరు దొరగారిని కలసికొని వారి వద్ద సెలవు పుచ్చుకొంటిని. డైరెక్టరుకు నా అర్జీని నేను పంపకుండిన యెడల, నాకేమయిన సాయము చేసియుండు నని వారు చెప్పిరి. ఎన్ని విధములయిన కష్టములు వచ్చినను, న్యాయమయినట్టియు, ఆత్మగౌరవమునకు భంగము లేనట్టియు, ఉత్తమ మయినట్టియు జీవితమును గడపుటకు పరమేశ్వరుడు నన్ను ప్రబోధించును గాక! సత్యము నన్నెల్లప్పుడు నడపును గాక! నా యాదర్శములు సదా యున్నతములయి యుండును గాక!'' ఈ వాక్యములవలన బాపయ్యగారు సంపూర్ణముగ ఈశ్వరాధీనవర్తను లయి సత్యముకొరకే జీవింప నెట్లు సిద్ధపడిరో తేటతెల్లమగుచున్నది.

* ౨౩ పుటను చూడుడు.

పరమేశ్వరుడు ఆయనకు పూర్ణాయుర్దాయ మిచ్చియున్న యెడల, గవర్నమెంటుకాలేజిలో నుద్యోగము మానిన తరువాత ఆయన యేవృత్తియందు జేరి పాటుపడి యుండునో నిర్ధారణచేయుట కష్టము. అయినను ఆయన మనోగతినిబట్టి యది కొంత యూహించుకొన వచ్చును. అట్టి యూహ చదువరులకె విడిచి, ఆ సంబంధమయినభావములు కొన్ని సందర్భములలో వ్యక్తమయి దినచర్యపుస్తకములో ఆయన వ్రాసికొనినలాగున తేదీలవరుసను ఇచట పొందుపరుపబడును.

౧౦—౨—౧౯౦౭ :—"తలవని తలంపుగా నేను గోవిందనుగారిని కలసికొనుట తటస్థించెను. మెడ్విలి స్కాలరు, జి. సుబ్బారావుగారివద్దనుండి వచ్చిన యుత్తరమును వారు నాకు చూపి మెడ్విలికి వెళ్ళుటకు నా కిష్టము కలదా యని ప్రశ్నించిరి. అదియొక యీశ్వరాహ్వానముగ నాకు దోచెను. నా యారోగ్యము చక్కబడినయెడల వెళ్ళవచ్చునని బదులు చెప్పితిని.'' ధర్మప్రచారకులుగ నుండదలచువారికి వేతన మొసంగి రెండు సంవత్సరములు బ్రహ్మవిద్య గరపుటకు అమెరికాలో మెడ్విలిపట్టణమున నొక యూనిటేరియను క్రైస్తవుల సంస్థ గలదు. చెన్నపురిలో బాపయ్యగారు గోవిందనుగారిని కలసికొని నప్పుడు వచ్చిన ప్రస్తావన యీ

సంస్థవిషయములోనె.

౧౧—౨—౧౯౦౭:—"సి. రామలింగారెడ్డిగారితో ఉదయము గడపితిని....నేను బరోడాకు వచ్చి తమకు ప్రయివేటు సెక్రటరీగా నుందునా యని రామలింగారెడ్డి గారు అడిగిరి. ఎల్లప్పటికి గాని కొంతకాలమువరకు గాని యచట నుండి తమకును గైక్వారుగారికిని సాయము చేయ వలసిన దని వారు నన్ను అడిగిరి. ఓ యీశ్వరా! ఈప్రాపంచికసామన్యవిషయములను గానికులాసాగా గడచెడు జీవితమును గాని నే నాసింప కుండునట్లు చేయుము. రాజ మహేంద్రవరములోని మా యుద్యమముకొరకు నన్ను పాటు పడ నిమ్ము."

౧౧-౨-౧౯౦౭:— "వీరేశలింగము పంతులుగారి వద్దనుండి వచ్చిన యుత్తరమును ఇంటికి వచ్చి చూచుకుంటిని. అందు తెలుపబడిన శుభభవితవ్యమునకు పరమేశ్వరుని కొనియాడుచున్నాను. పిఠాపురము మాకు చాల తోడ్పడ నున్నది. ఆర్. వి. ఆర్ గారు (రఘుపతి వెంకటరత్నము నాయుడుగారు) మాకొరకు కృషి సలుపుచున్నారు. వారు పంతులుగారి కిట్లు వ్రాయుచున్నారు. 'నే నిది పిఠాపురమునుండి వ్రాయుచున్నాను. ఆస్తికోన్నతపాఠశాలను గురించి నేను మన రాజాగారితో మాటాడినాను. ఈశ్వ

రుని యిచ్ఛయు అనుగ్రహమును ఉన్నయెడల డబ్బువిషయములో మీకు ఆదుర్దనుండ నక్కరలేదని చెప్పుటకు రాజాగారు నా కనుజ్ఞ నిచ్చిరి.......' ఇందునకు పరమేశ్వరునకు ధన్యవాదములు. నిజముగా నా సంతోషము అమితముగా నున్నది. ఈశ్వరుడు మమ్మాశీర్వదించి తక్కినదియు నెరవేర్చును గాక! నా యారోగ్యముకొరకు పాటుపడుటకును, ఈ ప్రపంచమున ఆయనసేవ చేయుటకును, ఆయన నాకు సరియయిన త్రోవను చూపునుగాక!" బాపయ్యగారు వ్రాసిన యీ మాటలు ప్రస్తుతము రాజమహేంద్రవరములో నెలకొనియున్న శ్రీ వీరేశలింగాస్తికోన్నతపాఠశాలను మొదట స్థాపించుటకై జరిగిన యాలోచనలకు సంబంధించి యున్నవి.

౨౩-౮-౧౯౦౭ తేదిన బాపయ్యగారు రాజమహేంద్రవర జాతీయపాఠశాలయందు అభిమానము కనపరచుచు దినచర్యపుస్తకములో వ్రాసికొనిన విషయములు,*ఇంతకుముందు నొకచో తెలుపబడినవి, చదువరులు జ్ఞప్తియం దుంచుకొని యుందురు.

బాపయ్యగారి జీవితము ఈశ్వరున కర్పితమాయెను. ఈశ్వరు డేసమయమున కెందులకు ప్రేరేపించిన, అది చేయుటకు ఆయన సిద్ధపడి యుండెను. తన సమస్తమును ఈశ్వరుని హస్తగతము చేసెను.—

*౧౧౫ వ పుటను చూడుడు.

జీవనస్మృతి

౧౬ వ ప్రకరణము

జీవితఫలములు

నిజమయిన స్వాభివృద్ధియొక్క ఫలములే, పరోపకార కార్యములు. ఇతరులతో సంబంధము లేక తనకు తాను జీవించు స్వార్థపరాయణుని అభివృద్ధి కేవలము తాత్కాలికము; నిష్ఫలము. యథార్థమగు ఔన్నత్యము జెందిన మానవుడు పరులతో నైక్యత జెంది పరోపకారజీవనము గడపును. బావయ్యగారి యున్నతమగు ప్రేమ జీవనమునుండి పరులకు లభించిన ఫలము లెవ్వియొ విచారింతము.

బావయ్యగారు ప్రార్థనశీలురు గదా? ప్రతిదినము నిత్యప్రార్థన చేసికొనుటయె గాక విశేష సమయములందు ప్రత్యేకప్రార్థనలు కూడ సలిపి ఆయన తన జీవితము వృద్ధి నొందించుకొనెను. సంవత్సరాది దినమున "ఈ యేడు పాటు పడుటకు పరమేశ్వరుడు నాకు శక్తిని ప్రసాదించును గాక!" యనియు, కాలేజి తెరువబడిన రోజున "నాయుద్యోగ కార్యములను తృప్తికరముగ సదుద్దేశముతో నిర్వర్తించు

టకు పరమేశ్వరుడు నాకు తోడ్పడును గాక!" యనియు ముఖ్యమయిన యుత్తరములు వ్రాసినపిదప "దేవా! నీయిచ్ఛ యయినయెడల నా ప్రయత్నములను ఫలింప జేయుము." అనియు, ఇటులనె యితరముఖ్య తరుణములయందును ప్రార్థనలు చేసికొనుట కాయన యలవడి యుండెను. తన విషయమున ప్రార్థనల ప్రయోజన మెరిగియుండెను; తనకొరకు ప్రార్థించినటులనె, యితరులకొరకును ప్రార్థించెను. ఆయన యెవరి యభివృద్ధి నభిలషించెనో, వారికొరకు ప్రార్థనలు చేసెను. రాజమహేంద్రవరములో అనుష్ఠానజీవనము గడుప నారంభించిన మిత్రులు వెనుకంజ వేయుచు సమాజోపాసనలకె వచ్చుట మానినప్పుడు, "వారికి కలుగుచున్న పరిశోధనలయందు సర్వశుభప్రదాత వారిని కాపాడి వారు కష్టములను సరకుసేయక ధర్మ మనసరించునట్లు చేయును గాక! సమాజమును త్రోసి పుచ్చుటవలన వారి మనస్సులందు నుత్సాహాగ్ని వెలుగునట్లు చేయు సాధనమునె కోల్పోవుదురు కాన వారు సమాజమును విడువకుండునట్లు చేయును గాక!" యని ఆయన ప్రార్థించియుండెను. త్రికరణశుద్ధితో ఆయన చేసిన యీ ప్రార్థన చాలవరకు ఫలించెను. పాలపర్తి నరసింహముగారు బ్రాహ్మధర్మ మనుసరించి అనుష్ఠానజీవనము మొదలిడిరని వినినతోడనే "చాల కాలమునుండి అతడు

పొంద నన్వేషించుచుండిన మనోశాంతియు తృప్తియు పర
మేశ్వరు డాతనికి కటాక్షించును గాక! ఈశ్వరుని దయవలన
పరిశోధనలం దాతడు సంరక్షింపబడును గాక!" యని ఆయన
దేవుని వేడుకొనెను. కవికొండల సాంబశివరావుగారు
బ్రాహ్మధర్మ దీక్ష గైకొని రని తెలిసి ఆయన యీశ్వరు
నకు స్తోత్రవందనము లర్పించెను. ధర్మమార్గమున నడువ
బూనిన వారికి తన ప్రార్థనల ద్వారా ఆయన చేయూత
నొసంగ యత్నించెను. ఆత్మలు పరస్పర సంబంధము కలిగి
యున్నప్పుడు, ఒక యాత్మయొక్క యిచ్ఛయు ప్రార్థనయు
మరియొక యాత్మమీద నేల పనిచేయకుండును? పెదవులతో
చేయబడు ప్రార్థనలు హృదయమును పురిగొల్ప జాలవు.
హృదయమునుండి వెలువడు ప్రార్థనలు హృదయమును కదల్చి
వేయును. బాపయ్యగా రెవరివిషయమున ప్రార్థించెనో,
వారితో నొకటి యయి వారిని గురించి తీవ్రముగ చింతనము
చేయువారు. వారినిగూర్చి కలలను గూడ కనువారు. నేను
ధర్మజీవనమున వెనుకంజ వేసితి నను సమాచారము వినక
ముందె ఆయన యది * కలగనెను. ఆ సంగతిని తరువాత

* ౧౭౧ వ పుటయందు, ఆయనకు వచ్చిన యిటువంటి మరియొక స్వప్న
మునుగూర్చి వ్రాయబడెను. అవి యెట్లు సాధ్యము లయ్యెనో మనోతత్వ
పరిశోధకులు నిర్ణయింపవలసిన విషయము.

విని ఆయన యత్యంత వేదనము నొంది సంపూర్ణవిశ్వాస
ముతో నన్నుద్ధరింపు మని యీశ్వరుని ప్రార్థించిన ప్రార్థ
నలు ఆశ్చర్యకరములు. "దీని యర్థ మేమయి యుండును?
తిరిగి మార్గమునకు రానంతగా అతడు తొలగి పోయెనా? సర్వ
కారుణికుడైన పరమేశ్వరుడు ఆతనికి ధర్మమేదియో చూపి
దాని ననుసరించుటకు శక్తిని ప్రసాదించును గాక! కలత
జెందిన యాతని యాత్మకు శాంతి కలుగు గాక!" యనియు
"ఆతడు క్రమేణ దృఢత్వము చూప గలుగుచున్నాడు. పర
మేశ్వరు డాతనికి ధైర్యస్థైర్యము ననుగ్రహించును గాక!"
యనియు, ఆయన ప్రార్థనలు చేసియుండెను. నాకు తెలియ,
కుండ సలుపబడిన యీ ప్రార్థనకే నన్ను నేను కాపాడుకొన
లేని యవస్థలో గాచియుండు నని తలచెదను. ఆయన తాను
ప్రేమించిన వారెల్లరికి శుభము చేకూరుటకు దైవప్రార్థనలు
చేసెడువాడు. మునగాల జమీందారు శ్రీ రాజా నాయని
వెంకట రంగారావు బహద్దరుగారు ఆయనను చూచుటకు
వచ్చి యొకరోజు ఆయనతో గడపిరి. వారికి నుచిత సత్కా
రములు గావించి "దేవుడు వారికి చిరకాల మిట్టి సచ్చింతను
ఉన్నతాదర్శములను ప్రసాదించును గాక!" యని ప్రార్థిం
చెను. తన యాప్తుల విషయమున ఆయన యీశ్వరుని సమ

క్షమున వెలువరించిన యభీప్సితములు వ్యర్థముగ పోలే దని నుడువుటకు శంకింప నక్కరలేదు. ఆయన యెవరికొరకు ప్రార్థించెనో వారు కేవలము శక్తివిహీనులును క్రియాశూన్యులును నయినవారనియు, ఆయన ప్రార్థనల మూలముననె వారి యందు క్రొత్తగ శక్తిసామర్థ్యములు పొడసూపి క్రియాశీల ముద్భవిల్లె ననియు చెప్పుట సరి గాదు; కాని ఆయన ప్రార్థనలు వారి శక్తుల నినుమడింప జేసి వారిని కార్యదక్షులనుగ మార్చినవి. నమ్మ దగియున్నది. మరియు వ్యాధిపీడితుల కొరకును, దుఃఖభాజనులకొరకును, అనాథలకొరకును, అసహాయులకొరకును ఆయన ప్రార్థనలు గావించెను. అవియు సఫలీకృతము లయ్యెనని విశ్వసించుటకు దృష్టాంతములు గలవు. బాహ్యమునకు గాన్పింపని ప్రార్థన పూర్వకమగు నిట్టి మానసికసేవ ఆయన జీవితఫలములలో నగ్రగణ్యమయినది.

ఒకరోజు చెన్నపురిలో ఆయనయు, ఆయన పినతండ్రి యయిన కృష్ణయ్యగారి బావమరిది, కొమరవోలు హనుమంతరావు గారును ఇద్దరు కలసి, ట్రాముబండిమీద నెచటికో పోవుచుండిరి. ట్రాము బండ్లను నడపువారు ఆ దినములలో చాల మోసము చేయుచు కంపెనివారికిని, వీ లయినప్పుడు ప్రయాణికులకును, ద్రవ్యనష్టమును కలిగించు చుండిరి. పోవల

సిన దూరమునకు రెండు అణాలు పుచ్చుకొనవలసియుండిన, ప్రయాణము చేయువారివద్ద ఏడు కానులు మాత్రమె పుచ్చుకొని ఆరు కానుల టికెట్టును వారిచేతిలో పెట్టుచుండెడు వారట. ప్రయాణికులకు కూడ కొంచెము లాభము కలుగుచుండుటచే, వారు ట్రాంబండ్లు నడపువారి యన్యాయమును చూచియు చూడన ట్లూరకుండుచు వచ్చిరి. ఈ విధమయిన దగా అపరిమితముగా జరగుచుండెను. బాపయ్యగారు ఆ నాడు మామూలుగా నియ్యవలసిన డబ్బును ట్రాముబండిలో టికెట్లు నమ్మువాని చేతిలో పెట్టగా, వాడు ఒకటియొ రెండో కానులు తిరిగి యిచ్చి అంతకంటె తక్కువ సొమ్ము టికెట్టును ఆయన చేతిలో పెట్టెను. ‘ఇదేమిటి?’ అని ఆయన అడిగెను. ‘ఊరుకో వయ్యా. నీ కెందుకూ?’ అని బదులు చెప్పి వాడు వెళ్ళి పోవుచుండెను. ఆయన కేకలు వేసి వానిని పిలిచి వాని పేరును నెంబరును తెలిసికొని కంపెనివారికి రిపోర్టు చేసెదనని చెప్పెను. అది యంతయు పెద్ద గోలక్రింద తయారయ్యెను. బండిలోనున్న వారందరు ఆశ్చర్యపడు చుండిరి. ప్రక్కన కూర్చుండిన హనుమంతరావుగారు ఆయన లేనిపోని తొందర కొని తెచ్చుకొను చున్నాడని తలపోయుచుండెను. ఆ సందర్భమున తాను చేయవలసిన పనియంతయు చేసెను. ఇటులనె అన్యాయమును అక్రమమును ఆయన చూచినప్పు డెల్ల ఏదో

ప్రతీకారము చేయక యూరకుండువాడు కాడు. బాపట్ల గ్రామమందు తిరణాల రోజులలో జూదపు బల్లలు పెట్టి జనుల వద్ద డబ్బు లాగుచున్న మోసగాండ్రను ఆయన యొక్క పర్యాయము చూచుట తటస్థించెను. తన మిత్రులతోడ్పాటుతో ఆబల్లలను తీయించి వారిమీద రిపోర్టు చేసెను. చిన్న విషయములలో కూడ అధర్మము తొలగించుటకు ప్రయత్నమావశ్యకము. ప్రయత్నము లేని మాటలు నిరుపయోగములు. బాపయ్యగారి వర్తనము ధర్మవిషయమున సదా దృష్టాంతముగా నుండెడిది. ఆయన యనుదినవర్తనమె ప్రార్థన తరువాత పేర్కొనదగిన ముఖ్యఫలము.

పింగళి లక్ష్మీనారాయణగారు బాపయ్యగారినిగురించి తెలిపిన యీ క్రింది యంశములు గమనింపదగినవి.—“నాకు ఆయనతో పన్నెండు సంవత్సరముల మైత్రిగలదు. నాకుగల కఠినవాక్కును మార్చవలె నని మిక్కిలి ఓపికతో నేను తనతో చెప్పిన వాక్యములను మార్చి తన భావప్రకటనలో నెట్లుండెనో చెప్పుచుండెను. వాడు దుర్మార్గు డని నేను చెప్పినచో వెంటనే ‘వాడు మంచివాడు గాడని చెప్పరాదా’ యని ప్రశ్నించును. అది అందవికారముగా నున్నదని నేను చెప్పినప్పుడు తాను దిద్ది “దానియందము నాకు తెలియుట లేదని చెప్పు” మనియెను. ఇట్లు సంవత్సరముల

కొలది యత్నించెను. కాని నా స్వభావమును మార్పలేకపోయెను. కంటి చూపునందు, నోటి మాటయందు, అవయవముల కదలికయందు, ప్రేమ ఒలుకుచుండవలె నని ఆయన పట్టుదల. నే నిప్పటికి ఆయన క్రియాసూత్రముల నభ్యసించుచుంటిని గాని ఆయన సుశీలత, ఆయన వ్యక్తిత్వమందు నెడతెగక చూడనగు ప్రేమవాక్యములు, ముద్దుపలుకులు, మురిపెంపుచిరునగవు, నా కలవడ లేదు. అవి కోరిన మాత్రమున కలుగవు. ఈశ్వరకటాక్షముచేత నే సంప్రాప్తమగు నని తోచినది......హృదయవిద్యను (heart-culture) మన యాంధ్రులలో మొట్టమొదటగా బోధించి జీవించి చూపిన వారు బాపయ్యగారు. జ్ఞానధీరుడు, ప్రజాసేవా తత్పరుడు, మోహపంకిలమున జిక్కుకొనని అపురూప మగు విశుద్ధాత్ముడు.” లక్ష్మీనారాయణగారు వ్రాసిన యీవచనములు బాపయ్యగారి చెలిమి చేసిన వారెల్లరు తమ యనుభవమునుబట్టి కూడ పరమసత్యము లని చెప్పగలరు. బాపయ్యగారి చూపులు, మాటలు, కదలికలు ధర్మప్రబోధకములయి యితరుల హృదయపరివర్తనమునకు తోడ్పడె నని వారి స్నేహితులందరు సాక్ష్య మియ్యగలరు. ధర్మము మధువు వంటి దని పెద్దలు చెప్పుదురు. మకరందముకొరకు తేనెటీగలు మూగునట్లు ధర్మముకొరకు జనులు చేరుదురు. బాపయ్య

గారు పలువుర నాకర్షింపగలుగుటకు ఆయనమాటలు ధర్మపూరితము లయి మధురముగ నుండుటయె కారణము. ఉపన్యాసవేదికలపై నెక్కి గంభీరోపన్యాసము లొసంగగలిగిన వారు అనుచరులను కలిగియుండ కుండుటను తరచు చూచుచుందుము. అందులకు హేతువు వారియందలి ధర్మాభావమె. ధర్మప్రచారమునకు శుష్కదీర్ఘోపన్యాసము లక్కర లేదు; ప్రేమతో కూడిన యొక్క పలుకు చాలును. బాపయ్యగారి మధురసంభాషణములు ఆయనదరి చేరిన ప్రతిపురుషుడును స్త్రీయును నిరంతరము పొందుచుండిన ఫలము లని చెప్పవచ్చును.

బాపయ్యగారు సభాభవనములందు ఉపన్యాసములు కూడ నిచ్చియుండిరి; ఉపన్యాసమందిరములందు ధర్మోపదేశములను జేసిరి. అవియు నత్యంతోపయుక్తములుగ నుండెను. ఆ ప్రసంగములు ఆయన జీవితాదర్శములనె వెలిబుచ్చుచు ధర్మోత్సాహమును పురిగొల్పి యుండెను. బాపట్ల, బందరు, గుంటూరు, నర్సారావుపేట, రాజమహేంద్రవరము, కాకినాడ, విశాఖపట్టణము, చెన్నపురి మొదలగు పట్టణములలో, సాంఘికపారిశుద్ధ్యము, సద్వర్తనము, స్వీయసంస్కరణము, విద్యార్థుల విధులు, స్వదేశవస్తుప్రోత్సాహము, సర్వతోముఖ సంస్కరణము, ఐకమత్యము, బ్రాహ్మధర్మము, భక్తి, నీతి

మొదలగు విషయములనుగురించి ఆయనయొసంగిన యుపన్యాసములు వినిన వారు వానిని నేటివరకు స్మరించునంతగా వారి హృదయములందు నాటుకొనెను. యువకులు కోమల హృదయు లగుటచే ఆయన బోధించిన సత్యములు సులభముగ గ్రహించి యుత్సాహపరవశు లగుచుండిరి. బాపట్ల యువజనులు కనపరచిన యుత్సాహము తార్కాణముగ నుడువవచ్చును. బాపయ్యగారు చెన్నపురికి పోవుచు వచ్చుచు నచటనాగునప్పుడు తరచుగ ఉపన్యాసముల నొసంగి విద్యార్థులయందు సంచలనము కలిగించు చుండిరి. ఒకతూరి ౨౬-౧-౧౯౦౭ తేదీన కలిగిన కదలికను గురించి ఆయన యిట్లు దినచర్యపుస్తకమున వ్రాసికొనెను-"పురమందిరమున తెలుగులో ఈశ్వరోపాసన జరిపి "బ్రాహ్మధర్మము-దానియాదర్శములు" అను విషయమునుగురించి ధర్మప్రసంగము గావించితిని. నాటి సాయంకాలము పౌరజనసభ కధ్యక్షత వహించి బ్రాహ్మసమాజాదర్శములనుగూర్చి తెలుగులో విపులముగ ముచ్చటించితిని. చాలవరకు విస్పష్టముగ ఆ యాదర్శములను వ్యక్తీకరించుటకు ఈశ్వరుడు నాకు దయతో శక్తిని ప్రసాదించెను. జనులయందు కలవరము బయలుదేరెను. ప్రధానోపాధ్యాయులును, ప్రథమసహాయోపాధ్యాయులును ఆగ్రహము జెందిరి. వారికి సచ్చింతయు, సహనమును ఈశ్వరు డనుగ్రహించును

గారు!" ఈ వృత్తాంతమువలన పెద్దలు ముఖ్యముగా నచటి బోర్డుహైస్కూలులోని యుపాధ్యాయులు ఆయన తాకిడికి తాళజాలక కోపావేశు లయినటుల తెలియుచున్నది. చిన్న తరగతి మొదలు పెద్ద తరగతివరకు అన్నిటిలోను బ్రాహ్మసమాజముయొక్క వాసన గలిగిన బాలు రుండుటను ప్రధానోపాధ్యాయులు కనుగొనిరి. బ్రాహ్మసమాజముతో సంబంధమున్నవారు నిలువుడని ఆయన ప్రతితరగతికి వెళ్ళి యొక పర్యాయము కోరియుండెను. ప్రతితరగతిలోను ఒకరిద్దరికి తక్కువ లేకుండ నిలువబడిరి. బ్రాహ్మసమాజోద్యమమును నిరోధింప వలసినదని యూరిలోని పెద్దలు ప్రధానోపాధ్యాయులను పురిగొల్పిరి. ఆయన బ్రాహ్మసమాజమునం దభిమానముగల విద్యార్థుల నవమానించుచు కొన్ని యిబ్బందులకు లోనుచేసిరి. మరియు డాక్టరు ఆనిబిసెంటు దొరసానిగారు రచించిన దివ్యజ్ఞానపుస్తకములను బాలురచే నిర్బంధముగ కొనిపించి చదివింప మొదలిడిరి. ఈ సమాచారము బాపయ్యగారు వినినతోడనె 'కార్లీలియను' పత్రికకు ప్రధానోపాధ్యాయుల నిరంకుశ చర్యలను ఖడించుచు నొక వ్యాసము వ్రాసి అది ప్రచురింపబడిన సంచిక నొక దానిని స్కూళ్ళ యినస్పెక్టరుగారికి పంపిరి. అప్పటినుండి బాపట్ల పాఠశాలలో అవి యన్నియు క్రమముగా తగ్గిపోయెను. బాపయ్యగారి

వలలో తగుల్కొనకుండ చేయుటకు పెద్దలె యిక తమ బిడ్డలను ఆయననుండి దూరముచేయ ప్రారంభించిరి. ఆయన తమ్ముడు అప్పారావు సహితము మైసూరుప్రాంతములకు పంపబడెను. ఆయన యుపన్యాసములు యువకులకు అతిమధురములై యుండెనని చెప్పుటలో నతిశయోక్తి యేమాత్రము లేదు. అవి ఆయన జీవితముయొక్క మహాఫలములు.

ఆయన వాగ్రూపముననె గాక లిఖితరూపమున గూడ తన భావముల ప్రకటించి ధర్మవ్యాపనమునకు తోడ్పడెను. ఇండియన్ సోషల్ రిఫార్మర్, వాయిస్ ఆఫ్ ట్రూత్, కార్లీలియన్ పత్రికలయందు ఆయన వ్యాసములు నాంగ్లమున వ్రాసి ప్రచురింపించెను. ఆయన వ్యాసములు మృదువగు సులభశైలి కలిగి భావములను చక్కగ వెల్లడింప గలిగియున్నవి. నవీనసంస్కరణభావములు ప్రచురించుటకు మాత్రమె గాక పరుల అయోగ్యకార్యములను ఖండించుటకు గూడ ఆయన వ్యాసముల రచించెను. రాజమహేంద్రవరములో విద్యాధికులు కొందరు చేరి భోగముమేళము పెట్టించి వినోదించుట నెరింగి వారివర్తనమును విమర్శించుచు ఆయన వాయిస్ ఆఫ్ ట్రూత్ పత్రికలో "A Scandalous local incident." (నింద్యమగు నొక స్థానికకృత్యము) అను శీర్షికతో వ్యాసము వ్రాసి ప్రచురించెను. అందు మాననష్టకరములగు

కొన్ని వాక్యములు గలవని ఆయనమిత్రులు భయపడిరి. ఆయన యావిషయమునుగురించి దినచర్యపుస్తకమునం దిట్లు వ్రాసికొనెను—"విద్యావంతులు అవినీతిని పెంపొందించునప్పుడు హృదయము సహజముగ నాగ్రహావేశము జెందును. అట్టి యుద్రేకస్థితియందు భోగముమేళము విషయమయిన యా గర్హ్యకార్యమునుగురించి నే నొక వ్యాసము వ్రాసితిని. అందు మాననష్టకరము లగు వాక్యము లుండుటచే మిత్రులు చాల ఆదుర్దపడుచున్నారు." ఈమాటలవలన ఆయన యధర్మమును సహింపలేని స్వభావము కలవాడని స్పష్టపడుచున్నది. సాత్వికస్వభావ మనగా అధర్మమును సహితము సహించుకొని దానితో రాజీ చేసికొనుట యెంత మాత్రము గాదు. పత్రికలకు వ్రాయబడిన వ్యాసములును ఆయన జీవితముయొక్క ఫలములు.

ఆయన తనకు చేతనయిన రీతిని పరులకు సాయపడియుండెను. బంధువులకును మిత్రులకును ఆయన తన శక్తికొలది సాహాయ్యము చేసెను. అంతియగాదు; తా నెరుగని బీదసాదలయెడలను రోగులయెడలను ఆయన యమితసానుభూతి కలిగి వారి దీనస్థితి తొలగించుటకు పాటుపడెను. కష్టపడు బీదల దైన్యమును చూచినప్పుడు, ఆయన హృదయ మెట్లు కరిగి సాయపడుటకు వేగిరపడునో, ఎట్టి భావముల

కాకరమగునో, ఆయన యొక సందర్భమున దినచర్యపుస్తకమున వ్రాసికొనిన యీక్రింది వాక్యములు సూచింపగలవు.— "రెండెడ్ల బండి ఒక ఆడుమనిషి మీదుగా దొర్లిపోయెను. జనసమూహము ఆమెచుట్టును చేరెను. జ్ఞానశూన్యు లగుటచే వా రేమి చేయుట కెరుగక తెల్లపోయి చూచుచు నిలువబడిరి. ఉపాసనానంతరము ప్రార్థనసమాజమందిరమునుండి మరలి వచ్చునప్పుడు, ఆ సమూహమును చూచి సమాచారము తెలిసికొని తత్క్షణమె ఆసుపత్రికి ఆమెను తీసికొనిపోతిని. ఈశ్వరు డాస్త్రీని ఆశీర్వదించును గాక! తిండిలేక ఆమె దినమంతయు మాడుచున్నదట. ఆహారము దొరకక ప్రతిదినము ఈశ్వరుని బిడ్డ లెందరు మృతి జెందుచున్నారు! ఓ దేవా! నీవు ధనము ప్రసాదించిన నీ బిడ్డలకు, తమ ధనము స్వార్థపరత్వముతో తమనిమిత్తమె యెట్టిబాధ్యతయు లేకుండ వెచ్చించుటకొరకు గాక దరిద్రులగు తమ సోదరీసోదరుల నిమిత్తము వినియోగించుటకు తమపరముగ నప్పగింపబడిన పవిత్రమయిన సొత్తు అని బోధచేయుము." ఇందు ధనికులకును దరిద్రులకును నుండవలసిన సంబంధ మెట్టిదియో నిరూపింపబడినది. బాపయ్యగారు స్వయముగ నార్జించుట కారంభించిన మొదటి దినములలోనె కుష్టురోగముచే బాధపడుచున్న పిల్లవానిని తొట్టిస్నానముల చికిత్సవలన ఆరోగ్య

వంతుని చేయుటకు ఆయన మిత్రు లొకరు పూనుకొనినప్పుడు ఆ పిల్లవానికగు భోజనపుఖర్చు లన్నియు భరించుట కేర్పాటు చేసికొనెను. వీరేశలింగము పంతులుగారు నడపుచుండిన వితంతుశరణాలయసంబంధముగ కొంతపని కలిగియున్నప్పుడు ఆయన అందలి వితంతువులు సుఖముగ జీవించుటకు తగిన యేర్పాటులను చేయుటలో మిక్కిలి శ్రద్ధ వహించెను. ఒక పర్యాయము శరణాలయమునకు వెళ్ళినప్పుడు, ఒక వితంతువు పండుకొనుటకు పక్కయు, కప్పుకొనుటకు దుప్పటియు లేక చలిలో కటికనేలమీద పరుండు చున్నదని శరణాలయము యొక్క సూపరింటెండెంటుగారిద్వారా తెలిసికొని ఆయన చాల దుఃఖపడి ఆమెకొరకు ఒక బూర్నీసును దుప్పటిని పంపెద నని ఆమెతో చెప్పెను. తరువాత మాటల సందర్భములో పంతులుగారు ఆమెను గురించి యేదో యడుగగా, ఆమెకు దుప్పటియు, బూర్నీసు చాల యవసరముగ కావలసి యున్నవనియు, తా నవి పంపెదనని చెప్పి వచ్చితిననియు ఆయన పంతులుగారితో నుడివెను. ఇంటికి వెళ్ళి బంట్రోతు చేత అవి యామెకు పంపించెను. పిమ్మట పంతులుగారు ఆగ్రహించి యవి కావలె నని యాయన నడిగినందులకు ఆమెను చీవాట్లు పెట్టిరని సూపరింటెండెంటుగారివలన వినగా, ఆయన యెట్టి తలంపులను తలంచి యుండెనో, దీనుల

పక్షము వహించుటలో నెంతదీక్ష పూనునో దినచర్యపుస్తకములో ౬-౧౨-౧౯౦౫ తేదిన వ్రాసికొనిన యీ ప్రార్థన తెలుపగలదు.—"ఓ పరమేశ్వరా! బలమయిన ప్రతికక్షిని, అసమాన నిరోధము సహిత మెదుర్కొని సత్యముకొరకును ధర్మముకొరకును మానవశ్రేయముకొరకును ప్రతిఘటింపగల సచ్చింతను దృఢచిత్తమును నీ విధేయసేవకుడ నగు నాకు అమితవాత్సల్యముతో ననుగ్రహింపుము. నీ యాశీర్వాదముల బడయుటకు నర్హుడ నగునట్లు పరిశుద్ధునిగను నిష్కపటునిగను ధర్మాత్మునిగను చేయుము. హే ప్రభో! మానసిక శారీరక వేదననుండి పాప మా శ్రీ......ను అపారకరుణతో కాపాడుము. నీయందు దృఢవిశ్వాసము గలిగి ధైర్యముతో సర్వశోధనల నెదుర్కొనగల శక్తి నీ వామెకు కటాక్షింపుము." దీనివలన బాపయ్యగారు ఆవశ్యకమయినచో తాను గౌరవించిన వీరేశలింగము పంతులుగారితో కూడ పోరుసలుపుటకు సంసిద్ధుడై యని బోధపడుచున్నది. దీనజనపోషణ మాయన జీవితమువలని మరియొక ఫలము.

పంతులుగారు స్థాపించిన విక్టోరియా బాలికాపాఠశాలకును, రాజమహేంద్రవర హిందూసంఘసంస్కరణసమాజమునకును, రాజమహేంద్రవర ప్రార్థనసమాజమునకును కార్యదర్శిగ నుండియాసంస్థలపక్షమున బాపయ్యగా రమితోత్సాహముతో

కొంతకాలముకృషిసలిపిరి. విక్టోరియా బాలికాపాఠశాలయొక్క సంవత్సరోత్సవము ఏ. ఎల్. షేడీ దొరసానిగారి యాజమాన్యముక్రింద ౨౪-౨-౧౮౯౭ తేదిన జరగినప్పుడు ఆయన చదివిన కార్యనివేదనము స్త్రీవిద్యావిషయమున తోడిదేశీయులలో నెట్టి ప్రోత్సాహము ఆయన కలిగించుటకు పూనుకొనెనో వ్యక్తపరచుచున్నది. కీర్తిశేషులయిన అరవపల్లి సుబ్బారావుగారు మృతిజెంది నప్పటినుండియు నిద్రావస్థలో నున్న రాజమహేంద్రవర సంఘసంస్కరణసమాజము చురుకుగా పని చేయుటకు కారకుడయి దానిపక్షమున వీరేశలింగము పంతులుగారు, చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు, టంగుటూరి శ్రీరాములుగారు, చిలుకూరి వీరభద్రరావుగారు మొదలగు పురప్రముఖులచే నుపన్యాసముల నిప్పించియు, స్త్రీలకొరకు ప్రత్యేక ప్రసంగముల నేర్పరచియు, కరపత్రముల ప్రచురించియు, సంస్కరణమునకు తోడ్పడు విందులను గావించియు, ఆయన తన కార్యోత్సాహము కనపరచెను. టంగుటూరి ప్రకాశముగారు బారిష్టరు పరీక్షకు చదువ ఇంగ్లండు పోవుటకు ముందు వారి సన్మానార్థము సంస్కరణసమాజపక్షమున నొక బహిరంగసభ గావించి వారిని శ్లాఘించుచు ఆయన మాటాడి కార్యశీలము యొక్క యావశ్యకతను పురజనులు గుర్తించునట్లు చేసెను. బాలురకు గాని, బాలికలకు గాని

బాల్యమున వివాహము జరపు నాచారమును ఆయన పూర్తిగ నిరసించు చుండెను. తన బంధువులలో నట్టి వివాహములు జరుగ నున్నప్పుడు, ఆయన అవి జరుగకుండ జేయుటకు యావచ్ఛక్తితో ప్రయత్నించియుండెను. సంస్కర్తలని పిలచుకొనుచు బాల్యవివాహములు గావించు వారిని ఆయన అతి తీవ్రముగ ఖండించెను. ప్రొఫెసర్ ఎమ్. రంగాచారి ఎమ్. ఏ. గారు తమ యేడేండ్ల పుత్రికను పదునైదుఏండ్ల బాలున కిచ్చి వివాహము చేయించినప్పుడు ప్రొఫెసర్ గారిని విమర్శించుచు ఆయన 'ఇండియన్ సోషల్ రిఫార్మర్' పత్రికకు వ్రాసిన వ్యాసమునందు అట్టి కుహనాసంస్కర్తలమూలమున సంస్కరణోద్యమమునకు మహానష్టము కలుగుచున్న దని నిరూపింపబడెను. సంస్కరణకార్యములపక్షమున యోధునివలె పోరు సలుపుటకు ఆయన నిలచె నని యీ పేర్కొనబడినవన్నియు తెలుపుచున్నవి గదా? రాజమహేంద్రవర ప్రార్థనసమాజమునకు ఆయన ప్రాణము పోసెనని చెప్పవచ్చును. మద్రాసు ప్రార్థనపుస్తకమునుండి వారమువారము ప్రార్థనలు చదువుట సమాజికులలో ధర్మజీవనమును రవులు గొల్పుటకు తోడ్పడ నేరదని జయంతి గంగన్నగారు మొదలగు మిత్రులు తెలుపుట వలనను స్వయముగ గమనించుట వలనను సొంతప్రార్థనలు చేయుటకు ఆయనయే మొదట పూనుకొనెను. ధర్మమునందు

తాను పెరుగుచున్నకొలది నూతననూతన ప్రార్థనలను ఆయన చేయుచు తోడి సభ్యులలో భక్త్యుత్సాహముల పురిగొల్పి యుండెను. భక్తి అనుష్ఠానమునందు పరిపూర్ణత జెందునని యుపదేశములమూలముననువర్తనము వలనను వ్యక్తపరచెను. ఇక రాజకీయోద్యమమందును పాల్గొనుటకు ఆయన యుద్యుక్తుడగుచుండెను. స్వదేశవస్తువుల ప్రోత్సాహమునకు ఆయన పాటుపడెను. దేశీయవ్యాయామములు వాడుకలోనికి వచ్చుటకు కొంత ప్రయత్నము చేసెను. "౧౯౦౬ సంవత్సర ప్రాంతముల బాపట్లలో నడపబడుచుండిన తాలింఖానాకు పెదకాపయ్యగారు తరుచు వచ్చుచు కసరతుచేయు వారిని ప్రోత్సాహ పరచిరి. ఇంకొక చోటినుండి క్రొత్తవారిని తెచ్చి జీతమిచ్చి వారిద్వారా తాలింఖానాను నడపించుటకంటె ఉన్నవారిలో కొంత కసరతు నేర్చియున్న నన్ను అందున కుపయోగించుకొనిన బాగుండు నని వారు సలహా నిచ్చిరి." అని బాపట్లవాస్తవ్యులు మంత్రి కృష్ణయ్యగారు చెప్పుచున్నారు. దేశహితకరములగు సర్వకార్యములందు పాటుపడుచు మానవసేవయందు నిమగ్నుడగుచుండెను. ఒక సందర్భమున వీరేశలింగముపంతులుగారి కుత్తరము వ్రాయుచు తన్ను గురించి "For any blessed cause, I would even offer my life unto Him who gave it"—

ఏ ధర్మకార్యము కొరకయినను నా జీవనప్రదాతకు నా జీవితమును సహితము కానుకగ సమర్పించెదను—అని యాయన తెలుపుకొని యుండెను. ఒక మాటలో స్వార్థరహితమై సేవారూపము దాల్చిన ఆయన ధన్యజీవితమె దేశమునకు దొరకిన గొప్ప ఫలము.

జీవనస్మృతి

౧౨ వ ప్రకరణము

మరణము

"Never spend a thought on death. Work every faculty, strain every nerve, use every opportunity. Live as strenuously as though you were to live for ever. Act thy alloted part with all thy heart, and then when in fit time the call comes, resign God's work into God's hands, and enter into thy rest with the old assurance "well done"— మరణమునుగూర్చి యెన్నడును యోచింపకుము. సర్వశక్తులతోడను పాటుపడుము. జీవితమును ధారపోయుము. అన్ని యవకాశములను వినియోగింపుము. శాశ్వతముగ జీవించువానివలె సంపూర్ణకృషితో జీవింపుము. పూర్ణహృదయముతో నీ విధికృత్యమును నిర్వర్తింపుము. అర్హకాలమున ఈశ్వరునినుండి యాహ్వానము వచ్చునప్పుడు, ఆయన విధించిన పనిని ఆయన కప్పగించి 'బాగుగ నిర్వర్తింపబడెను' అను నభయవచనము బడసి నీ విశ్రాంతియందు ప్రవే

శింపుము—అని ప్రతాపచంద్రముజుందారుగారొసంగిన సదుపదేశము వారు రచించిన 'Heart beats' గ్రంథమునుండి యెత్తి దినచర్యపుస్తకమునందు ౧-౧౦-౧౯౦౭ తేదిన బాపయ్యగారు వ్రాసికొనిరి. మృత్యువు ఆయనను ధర్మరంగమున ప్రవేశపెట్టెను. మృత్యువాయనను పలుమారెదుర్కొనుచు మహాధర్మశూరుని జేసెను. అంతియగాని మృత్యువు ఆయన నెప్పుడును నిరుత్సాహపరుప లేదు. దాదాపుగ ధర్మయుద్ధము సలుపుచున్న కాలమంతయు ఆయన శరీరారోగ్యము కలిగియుండక మృత్యుసమక్షముననె జీవించెను. కాని జీవితమంతమునకు వచ్చుచున్నకొలది ఆయనకు ధర్మోత్సాహము మాత్రము హెచ్చెను. తన జీవితమున ప్రత్యక్షమయిన సత్యమె ముజుందారుగారి గ్రంథమున కనుగొని అదియొక సూత్రవాక్యముగా లిఖించుకొనెను. మృత్యువాసన్నమయినకొలది ఆయనయాత్మ యవిరళతేజముతో ప్రకాశింపజొచ్చెను. ఆయన దినచర్యపుస్తకములో కట్టగడపట ౨౬-౧౧-౧౯౦౭ తేదిన యీ వాక్యములు వ్రాసికొనెను.—

"కడచిన జూన్ మాసమునుండి గుండెనొప్పితోడను దగ్గుతోడను మిక్కిలి బాధపడుచున్నాను. ఈ రోజున నవవిధాన సమాజ ప్రచారకులు, భాయి బ్రజగోపాల నియోగిగారు, ఇక్కడికి ప్రచారసందర్భమున వచ్చి నన్ను చూచి యాశీర్వ

దించిరి. ఈశ్వరునకు సంపూర్ణముగ ఆత్మసమర్పణము చేసికొను మని వారు నాకు సలహా చెప్పిరి. 'నీ విరామకాలమును ఈశ్వరధ్యానమున గడపుము. బాధను తొలగించు మని గాని వ్యాధిని నయము చేయు మని గాని ప్రార్థింపక యీశ్వరేచ్ఛ నెరవేరు గాక యనియె ప్రార్థింపుము. ప్రపంచమునకును శరీరమునకును సంబంధించిన యోచనలనుండి ఆధ్యాత్మికవిషయములకు నిన్నీ ప్రార్థన మరలించును; నీవు మనోశాంతిని బడయ గలవు.' ఇవి నిజముగా అనుసరింపదగిన మహావాక్యములు" ఈ తీరున ఆయన మరణమున కాయత్తు డగుచుండెను. ఇక రెండు మాసములకు చనిపోవనున్న సమయమున ౧౦-౧-౧౯౦౮ తేదిన ఆయన కాకినాడనుండి పాలపర్తి నరసింహముగారికి వ్రాసిన యుత్తరములో ఈక్రింది వాక్యములు గలవు. "As for me, I am just as bad as before. The relief from caugh is purely temporary, as you could easily guess. I am a confirmed invalid and there is no near prospect of my getting better and being useful to my country. God's will be done. I completely resign myself to his care. May His blessings rest with you all!" వెనుకటివలెనె తిరిగి జబ్బు స్థితిలో నున్నాను. నీకు తెలియవచ్చుచున్న లాగున ఈ నడుమ దగ్గు

తాత్కాలికముగా మాత్రము నెమ్మదించినది. నేను పూర్తిగ నశక్తుడ నైతిని. త్వరలో నాకు ఆరోగ్యము కలిగి నా దేశముకొరకు నేను పాటుపడుట వట్టిది. ఈశ్వరేచ్ఛ నెరవేరునుగాక! నా రక్షణభార మంతయు పరమేశ్వరునకు సంపూర్ణముగ విడుచు చున్నాను. ఆయన మి మ్మెల్లరను ఆశీర్వదించును గాక!—ఈ మాటలవలన, బాపయ్యగారు తమ యిచ్ఛను వదలుకొని యీశ్వరేచ్ఛ యెట్టిదిగా నున్నను దానిని శిరసావహించుటకు తమ మనసును పదిలపరచు కొని రని స్పష్టముగా తెలియుచున్నది.

వైద్యమునిమిత్తము, బాపట్లనుండి బెజవాడకును, బెజవాడనుండి రాజమహేంద్రవరమునకును, రాజమహేంద్రవరమునుండి కాకినాడకును, కాకినాడనుండి పిఠాపురమునకును, పిఠాపురమునుండి చెన్నపట్టణమునకును ఆయన తనయంత్యకాలమునందు ప్రయాణములు చేయవలసి వచ్చెను. తనకు జబ్బు ప్రారంభ మయినప్పుడు మొదట కొంతకాలము తప్ప ఆయన కూన్నీవైద్యమునె యెల్లప్పుడును చివరి దినములవరకు అనుసరించుచుండెను. దానిమూలమున ఆయనకు మంచి యారోగ్యముకూడ కలిగెను. కాని తగిన పోషణ లేకపోవుటచేతను, వివిధ కార్యములం దెక్కువగ కృషి సలుపుటవలనను, ఆయన దేహస్థితి తిరిగి చెడెను. ఆంగ్లాయుర్వేదవైద్యులను, తదితరవైద్య

లను ఆయన సంప్రదించుచు వచ్చినను, కూని వైద్యము దాదాపు మరణపర్యంతము విడువ లేదు. కాని జబ్బు అంత కంతకు పెరిగి ముంచుకొని వచ్చుచుండెను. ఆ సమయమున మామూలు వైద్యములు చేయించుకొను మని బంధువులును మిత్రులును కోరియుండుటచే, వారి కోరికల ప్రకారము, గుణము కాన్పించిన కాన్పింప వచ్చునను నాశతో బావాజీ మందును, తెనుగు మందును, ఇంగ్లీషుమందును, ఆ డాక్టరు మందును, ఈ డాక్టరు మందును అన్ని రకములయిన మందులను కడపటి రోజులలో సేవించుచు దేనిమూలమున గుణము కానక యొక యూరినుండి మరియొక యూరికి వెళ్లెను. తుదకు చెన్నపట్టణమునకు పోయి జనరల్ హాస్పిటలులో ప్రవేశించెను. ఆయనను చూచుటకు క్రిస్టియన్ కాలేజి ప్రొఫెసర్లును, ఇంకను అచట గొప్పవారును రా దొడంగిరి. ప్రొఫెసరు మాఫెట్ గారి సతీమణి తల్లికంటె నెక్కువగా నుపచారములు చేయ బూనెను. హాస్పిటల్ అధికారులకు ఆయన సామాన్యపురుషుడు కాడని పొడగట్టెను. ఆయనకు వారు సహిత మెట్టి లోపము కలుగకుండ చక్కని యేర్పాటులను గావించిరి. అవసానసమయము దగ్గరకు వచ్చెను. తంతివార్తలు బంధువులకును మిత్రులకును పంపబడెను. కడ సారి చూపునకై యొకరి తరువాత నొకరు వచ్చుటకు

ప్రారంభించిరి. భార్యను కూడ తీసికొనివచ్చి చూపించిరి. ఆమెను జాగ్రత్తగ కాపాడు డని ఆమె బాలమ్మతో ఆయన చెప్పెను. ఒక రోజున పెద్ద డాక్టరు పరీక్ష చేసి నాటి సాయంకాలము నాలుగు గంటలలోపుగా ఆయన మృతి జెందునని తెలిపెను. స్నేహితులు గుంపులు గుంపులుగా రా దొడంగిరి. ఆయన తీవ్రముగ బాధపడుచుండెను; కాని తన బాధ నంతయు మరచిపోవుచు తన్ను చూడవచ్చిన వారెల్లరకు ప్రేమపూర్వకమగు చూపువలన గాని, కరస్పర్శవలన గాని, వందనమువలన గాని, మాటవలన గాని, సన్మానించెను. వారు నిర్వర్తింపవలసిన విధులను గూడ జ్ఞప్తికి దెచ్చెను. అప్పుడు చెన్నపురి బ్రాహ్మసమాజమునకు కార్యదర్శిగా నుండి మిగుల పాటుపడుచుండిన వి. పెదంబరాజు బి. ఏ గారితో "ఇక్కడి బ్రాహ్మసమాజమునకు మీరు స్థంభమువలె నున్నారు. దేశములో బ్రాహ్మధర్మము మీ సేవకై నిరీక్షించుచున్నది. మీ కర్తవ్యమును పాలింపుడు.' అని చెప్పెను. పెదంబరాజు గారు గవర్నమెంటు ఉద్యోగము మాని సుమారు పదునాలుగు సంవత్సరములు శ్రీ పిఠాపురము మహారాజాగారి అనాథశరణాలయమునందు పాటుపడుటకును, ఆ పనినుండి విశ్రాంతి గైకొనిన తరువాత నేటివరకు తమ యావచ్ఛక్తితో మానవసేవ చేయు చుండుటకును, ఈ మాటలు చాల

వరకు తోడ్పడె నని తలంప వచ్చును గదా? ఆ రోజులలో సాంఘిక రాజకీయ విషయములం దెక్కువ యభిరుచిని కనపరచు చుండిన బాపట్ల వాస్తవ్యులగు వెలగపూడి సుబ్బారావు బి. ఏ; బి. ఎల్ గారితో "నీ యభిరుచికి తగినట్లు నీవు దేశసేవ చేయుము'' అని నుడివెను. సంఘసంస్కారకార్యములందును, రాజకీయోద్యమమందును ముందంజ వేయుచు నుత్సాహము కనపరచుచున్న సుబ్బారావుగారి జీవితమున ఆయన కోరిక ఫలించె నని చెప్పవచ్చును. ఆ విధముగ నెవరికి తగినట్లు వారికి ఆయన యంత్యోపదేశము చేసెను. మృత్యుశయ్యమీద కూడ ఆయన తన జీవితాదర్శములనె స్మరించుచు తనవద్దకు వచ్చిన వారిలో నెవరిద్వారా వానిలో నేది వ్యాపనము చెంద గలదో వారి కది తెలిపి తన్నిమిత్తము పాటుపడు డని హెచ్చరిక నొసంగెను. చనిపోవుటకు ముందు జనులు సామాన్యముగా ఇల్లు, వాకిలి, పొలము, దొడ్డి, నగలు, నాణెములు మొదలగు ఆస్తుల విషయమై యాదుర్దజెందుచు తమకు నమ్మకమయిన వారి పరముగా వాని నప్పగింతురు. తా నే యాదర్శములను గ్రహించి జీవితమున కాపాడి యుండెనో, వానిని పోషింపు డని ఆయన తన మిత్రులను ముఖ్యముగ కోరి యుండెను. ప్రాణము విడుచు నిమిషమువరకు దేవునిగూర్చిన చింతయె, దేశమును గురించిన యోచనయె.

పెద్ద డాక్టరుగారు ఆయన చనిపోవు నని నిర్ణయించిన గడువు దాటిపోవు చుండెను. ఆయన పూర్తిగ స్పృహతో నుండెను. మృతి నొందుట నిశ్చయమని నిర్ధారణ యగుటచే మరణ బాధ తెలియకుండ జేయుటకు చిన్న డాక్టరు మత్తు మందు నిచ్చుటకు వచ్చిరి. ఆయన యది పుచ్చుకొనుటకు నిరాకరించెను. ఆసుపత్రి ఆయనను చూడ వచ్చిన బంధుమిత్రులతో కిటకిట లాడుచుండెను. మా ఫెటు దొరసాని ఆయన చెంత నిలచి సేవ చేయుచుండెను. పండిత డి. గోపాలాచార్యులు, డాక్టరు సి. బి. రామారావు మున్నగు స్నేహితులు ఆయన పరుండిన గదిలోను గదిప్రక్కను నిలువబడి కన్నీరు కార్చుచుండిరి. రుగ్మతభయంకరముగగాన్పించెను. ఆయనశరీరము నీటితో నిండిపోయెను. ఊపిరితిత్తులు చెడినవి. అన్ని యంగములు నీరసించినవి. గుండె యేక్షణముననాగునో యను నట్లుండెను. కాని నిశ్చయింపబడిన మరణసమయము దాటెను. "ఇక ఆసుపత్రిడాక్టరులు నాకు చేయగలది యేదియు లే దనుచున్నారు. నేను తప్పక మరణింతు నని వారు రూఢిపరచిన గడియలు గడచినవి. As long as there is life, there is hope— ప్రాణ మున్నంతవరకు, ఆశ యుండును— గోపాలాచార్యులు గారూ! మీరు నాకు చికిత్స చేసెదరా? రామారావుగారూ! మీ రేమయిన ప్రయత్నించెదరా?'' అని యడిగెను. కాని

యెవరికిని ఆశలేదు. అందరు మారుమాటాడకనిలచిరి. "గోపాలాచార్యులుగారూ! బ్రతికి యుండగానె మందూమాకూ వేయక రోగిని విడుచుటయేనా మీ వైద్యపద్ధతి కూడా?" అని మరల ప్రశ్నించెను. "చివరవరకు నేను చేయగలిగిన దంతా చేస్తానురా, నాయనా! నీ వధైర్యపడకు" అని ఆచార్యులుగారు జవాబు చెప్పిరి. కాని ఆసుపత్రిలో నుండగా, ఇతరవైద్యము చేయించుకొనుటకు వీలులేదు. తనను అక్కడనుండి వెంటనె యింకొక చోటికి తీసికొనిపోయి వైద్యము చేయవలసిన దని ఆయన ఆచార్యులగారిని కోరిరి. ఆయనను కదలించిన, గుండె తటాలున ఆగవచ్చును. ఆచార్యులగారును, అందరును ఆయనను అక్కడనుండి కదల్ప గూడదని యనుకొనుచుండిరి. తననిక క్షణ మయినను ఆసుపత్రిలో నుంచవద్దని పట్టుపట్టెను. మరియొకచోట సరియైన యేర్పాటు లుండవని, ఉపచారము బాగుగ జరుగదని, మాఫెటు దొరసానిగారు చెయ్యిపట్టుకొని గడ్డము పట్టుకొని బ్రతిమాలి ఆయనకు నచ్చచెప్ప చూచెను. కాని ఆయన పట్టు వదల లేదు. సాయంకాల మయినది. ఆ చీకటి వేళను ఒక డోలీలో పరుండబెట్టి సాధ్య మయినంత వరకు కదలకుండ మిత్రు లాయనను బ్రాహ్మసమాజమందిరమునకు తీసికొని పోయిరి. అచటికి మాఫెటు దొరసానిగారు పరుపులును, దిండ్లును పంపిరి. అక్కడికి కూడ ఆమె

వచ్చుచుండెను. అన్ని యేర్పాటులు చక్కగా చేయబడెను. గోపాలాచార్యులుగారు మం దిచ్చుచుండిరి. డాక్టరు రామారావుగారు సలహా చెప్పుచుండిరి. మిత్రు లందరును కళాశాల విద్యార్థులును వంతులవారుసను ఆయనకు సేవ చేసిరి. పిళ్ళారిశెట్టి సీతారామయ్యగారును, నేనును ఆ యంత్యదినములలో ఆయనను కనిపెట్టుకొని యుండి పథ్యపానములు చూచితిమి. అవసానము సమీపించిన దని ఆయనకును తెలియును. తనకొరకితరులు వెచ్చించిన సొమ్మును తీర్చుటకు సేవింగ్సు బాంకి నుండి సొమ్ము తీయించుట కేర్పాటు చేసెను. ఆయన తనవద్ద సొంత పైక ముంచుకొని పరు లిచ్చు ధనము పుచ్చుకొనుట తప్పుగా నెంచెడు వాడు. వీరేశలింగము పంతులుగారు మొదలయిన పెద్దలు ఆయనను చూడ వచ్చినప్పుడు వా రందరివద్ద కరములు జోడించి సెలవు పుచ్చుకొనెను. మహామరణవేదనలో మునిగిపోయెను. అమితబాధ పడెను. అది చూచుటకె దగ్గరనున్న వారి గుండెలు తరుగుకొని పోయెను. ఆయన స్పృహ గోల్పోవ లేదు; దైవచింతనము మాన లేదు. ౧౯౦౮ సంవత్సరము మార్చి ౯ వ తేదిన పగలు సుమారు ఒంటి గంటకు నన్నును సీతారామయ్యగారిని చేర బిలిచి ప్రక్కకు త్రిప్పు మని కోరె అటుల మేము త్రిప్పగా హరినామస్మరణ చేసికొనుచు తిరిగి మే మక్కడ

నిలచి యుండగానె కొలది నిమిషములలో ప్రాణము విడిచెను. మే మటులనె నిలచి పోతిమి. కన్నులనుండి నీరు బొటబొట కారెను. ఆ కన్నీటి ధారలతోనె మృతదేహమునకు మొదటి స్నానమాయెను. మిత్రుల పిలిపించితిమి. టంగుటూరి ప్రకాశముగారు మొదలగు ప్రముఖులు కూడ పలువురు వచ్చిరి. బ్రాహ్మమందిర మొక తీర్థస్థలమాయెను. ఆయనమిత్రులందరకు ఆయన బ్రాహ్మసమాజముకొరకు జీవించి మరణించెనని ఆయన బ్రాహ్మమందిరమున ప్రాణము విడుచుటవలన తట్టుచుండెను. ఆయన దివ్యమైన యాత్మకు నిలయమై యుండిన పవిత్రకళేబరమునకు స్నానము చేయించి పూలతో నలంకారము చేసితిమి. దాని సమక్షమున మిత్రులు నిలువవి. పెదంబరాజుగారు ఈశ్వరోపాసనము సలిపిరి. అనంతరము ఎల్లరము స్వయముగ దానిని దహనభూమికి మోసికొనిపోయి తుదిప్రార్థనతోను కన్నీటి ధారలతోను అగ్నిపరము చేసితిమి.

బ్రాహ్మధర్మమునందు విశ్వాసము గలిగి చనిపోవుచున్నాననియు, తదనుగుణమగు పద్ధతుల ప్రకారము తన యంత్యకర్మలు జరుగవలె ననియు, మరణమునకు పూర్వము మిత్రులకును ఆసుపత్రిలోని యధికారులకును స్పష్టముగ వ్రాతమూలమున నెరుకపరచి చిట్టచివరవరకు తన విశ్వాసమునకు భంగము కలుగకుండుటకై బాపయ్యగారు జాగ్రత్త పడిరి. ఆయన మరణపర్యంతము ధర్మమునందు విశ్వాసము గోల్పోలేదు; పట్టుదల విడువలేదు; ఎన్ని కష్టములనైన సహించి ధర్మపతాకము చేత బూనియె యుండెను. ఆయన ధన్యచరితుడు.

ఆయన మరణవార్త వినగానే ఇండియన్ మెసెంజరు, ఇండియన్ సోషల్ రిఫార్మరు, వాయిస్ ఆఫ్ ట్రూత్, కృష్ణాపత్రిక మొదలయిన పత్రికలు ఆయన గుణసంపదను శ్లాఘించుచు సంపాదకీయములు ప్రకటించినవి. ఆయన నివసించియుండిన పట్టణములలో స్మరణసభలు గావింపబడెను. మరియు శాశ్వతస్మరణమునకు తోడ్పడు కొన్ని యేర్పాటులును జరిగినవి. వీరేశలింగము పంతులుగారు రాజమహేంద్రవరములో ఆనందోద్యానవనమున బాపయ్యగారి అస్తికలను భూస్థాపనము చేసి వానిపై సమాధి కట్టించిరి. ఆసమాధియొక్క చలవరాతిపై వారు చెక్కించిన మాటలు చిత్రపటమునందు చూడనగును. రాజమహేంద్రవర పురమందిరమునందు వారి ప్రోద్బలమువలననె ఆయనయొక్క పెయింటింగు నిలుపబడెను. ఆయనభార్య అలివేలుమంగతాయమ్మగారు ఆయన వర్ధంతిదినమున ప్రతిసంవత్సరము కొంతమంది బీదలకు అన్నదానము చేయుటకు కాకినాడ అన్నదానసమాజముద్వా

ఏర్పాటు చేసిరి. ఆయన తమ్ముడు డాక్టరు వెంకటప్పారావు గారు తాము బాపట్లలో నెలకొల్పి నడపుచున్న హాస్పిటలులో ఆయనపేరిట బీదల కుచితముగా వైద్యసేవ చేయుచున్నారు. ఆయన మిత్రులు ఆదిపూడి సోమనాథరావుగారు తాము రచించిన గ్రంథరాజము, భక్తమణిభూషణమునందు ఆయనను స్తవము చేయుచు ఈ క్రింది పద్యమును రచించిరి.

సీ. "భక్తి భీష్ముం డని । ప్రఖ్యాతి వడసిన
 'శివనాథ శాస్త్రి'తో । జెలిమి నెఱపి
కార్యశూరుండును । గరుణానువర్తి యా
 'వీరేశలింగార్యు' । దారిఁ ద్రొక్కి
పాంచాలమండలి । భక్తాగ్రమణులలో
 'గురుదత్త విద్యార్థి' । గుణము గలిగి
యెన్ని కీడులు మూడి । తన్ను బాధించిన
 నిన్నుఁ జిత్తమునందు । నిలిపియోర్చి
గీ. పిన్న యయ్యును భక్తిలోఁ । బెద్ద యగుచు
దేశ రాజాన్వయాగార । దీపమైన
'పెద్దబాపయ్య'కిల నెవ్వ । రుద్ది యయ్య?
సకల కల్యాణగుణ ధన్య! । సర్వమాన్య."

ఆయన యనుచరుడు పాలపర్తి నరసింహముగారు తాము తెనుగున వ్రాసిన 'బ్రాహ్మమతము' అను గ్రంథము

ఆయన కంకితము చేసి ఆ సందర్భముగ పుస్తకప్రారంభమున ఈ క్రింది పద్యమును వ్రాసిరి.

సీ. "ప్రవిమలవేదాంత । ప్రకృతిశాస్త్రంబులఁ
 బఠియించి పట్టంబుఁ । బడసె నెవఁడు
ప్రజలలోఁ బరిశుద్ధి । ప్రబలంబు గాఁగఁ బ్ర
 సంగంబు లూరూర । సలిపె నెవఁడు
స్వాచరణంబుచే । బ్రాహ్మసమాజాభ్యు
 దయ కారణుం డయి । తనరె నెవఁడు
దేశరాజాన్వయ । దీపకుం డై పెద
 బాపయ్య యను పేరఁ । బరగె నెవఁడు
గీ. అస్మదీయ హితుఁడె గాక । యఖిల లోక
హితుఁడు నయి గుణోపేతుఁడై । యొసగె నెవఁడు
అట్టి వినుత చారిత్రున । కలఘు మతికి
నంకిత మొనర్తు మత్కృతి । నధికభక్తి."


బాపయ్యగారి చిరకాలస్నేహితులును, ఆంధ్రదేశ పత్రికలలో నగ్రస్థానము వహించిన కృష్ణాపత్రికా సంపాదకులును, అయిన ముట్నూరి కృష్ణరావుగారు తమ పత్రికారాజమున ౧౫-౩-౧౯౦౮ తేదిన ప్రచురించిన సంపాదకీయ మీ క్రిందను పొందుపరుపబడినది.

"బాపట్ల నివాసస్థులగు దేశిరాజు బాపయ్య బి. ఎ.

యల్. టి గారు నాలుగు సంవత్సరములనుండి క్రూరవ్యాధిచే పీడింపబడి తుదకు చెన్నపట్టణములో ౭వ తారీకు మధ్యాహ్నము ౧ గంటకు కాలముచేసి రని తెలియజేయుట కెంతయు దుఃఖించుచున్నాము. వీరు కొన్నిమాసములు రాజమండ్రీకాలేజిలో ఆంగ్లేయ తత్వశాస్త్రమును బోధించుచుండిరి కాని వీరి కక్కడ అగౌరవము కలుగుటచే ఆ యుద్యోగమునకు రాజీనామా యిచ్చిరి. ఈ వ్యాధిచేత వారి జీవితము దేశమున కెక్కువ ఉపకారి కాకపోయినది. కాని ఈ వ్యాధిచే పీడింపబడుచున్నను, చనిపోవునప్పటికి ౩౦ సంవత్సరములకంటె యెక్కువ వయస్సు లేకపోయినను, వీరి సుగుణపరిమళము దేశమంతటను వ్యాపించి, వీరి మరణము అసంఖ్యాకులగు మిత్రబృందములను శోకవహ్నియందు పడద్రోచెను. వీరి సత్ప్రవర్తన యిట్టిదని పదములతో వర్ణించుటకు మాకు కలమాడకున్నది. ఒక్కపదము మాత్రము వీరి సత్ప్రవర్తన యిట్టిదని సూచింప గలుగును. అది "సుందరం." కుసుమములయొక్క సౌందర్యమును జూచితిమి. కేదారములయొక్క సౌందర్యమును గంటిమి. నరనారీమణులయొక్క సౌందర్యమును జూచి విస్మయించితిమి. కావ్యరచనల సౌందర్యమును జూచి ఆనందము నొందితిమి. కాని మానవప్రకృతియొక్క సౌందర్యము నెక్కడను జూచియుండలేదు. మేధాశక్తియందు విశేష తేజోవంతులు గలరు. అవక్రమపరాక్రమ

మందు ప్రచండమగు ధైర్యవంతులు గలరు. సాహసౌదార్యములయందు మహాత్ములగు సజ్జనులు గలరు. భక్తివైరాగ్యములందు నిరుపమాన మగు సాధువులు గలరు. కాని ప్రకృతిసౌందర్యము బాపయ్యగారి సత్ప్రవర్తనయందె జూడగలిగి యుంటిమని చెప్పుటలో యెంతమాత్రమును అతిశయోక్తి లేదు. చంద్రునివంటి చల్లని కాంతి గలిగి, మనోహరమై, కోమలమై, శాంతిదాయక మగు సుశీలమునకు వీరి జీవితమె ప్రథమనిదర్శనము. వీరి ముఖమండల మెప్పుడును చిరునగవుతో ప్రకాశించుచుండెడిది. వీరి హృదయకమల మెప్పుడును ప్రేమసుగంధమును వెదజల్లుచుండెడిది. వీరి ధీబలము, సంకల్పశక్తి, వీరి ప్రేమాతిశయము, ఒకగుచ్ఛముయొక్క పుష్పములవలెను, ఒకగీతముయొక్క స్వరములవలెను, ఏకాత్మతను బొంది యున్నవి. వీరి హృదయము నవోత్పలకోమలంబై యుండినను, అసత్యమునకును, అధర్మమునకును, దురాచారమునకును, వీరి మనస్సు మహామహీధరాశ్మసంఘాతకర్కశంబై దనర్చెడిది. మానసోపాసనయందు నిష్ఠాగరిష్ఠుడై యజ్ఞోపవీతమును త్యజించి మానసరామునినే ఆరాధించుచుండెడి వాడు. సర్వసౌభ్రాత్రమును సాధించుటకయి వర్ణభేదములను త్యజించెను. దేశభక్తిని నిర్మలముగ నుంచుటకు, విదేశవస్త్రములను విసర్జించెను. వీరు కొన్ని దినముల క్రిందట

మాతో నిట్లు నుడివిరి. "నాకు పూర్వము జీవించవలె నని యెక్కువ ఆశ లేదు. కాని దేశమునందు స్వరాజ్యోద్యమము ఉదయించి నప్పటినుండియు, ఈ ఉద్యమ మెట్లు సఫల మగునో చూచుటకు ఈశ్వరుడు నాకు మరికొన్ని సంవత్స రముల జీవిత మొసంగు గాక" యని చెప్పిరి. ఆహా! వీరికి స్వరాజ్యముపై యెట్టి యాసక్తి! వీరు తరుణవయస్సునందే మెరుపుతీగవలె అంతర్ధాన మైరి. సజ్జనుల జీవితము కాలపరి మాణముచేత నిర్ణయించ కూడ దని ఆర్యోక్తి కలదు. ఓ భ్రాతృవరా! నీ ముఖారవిందము మరణజవనికచే మాకు మరు గైనను నీ జీవితము మా హృదయములయందు దివ్యజ్యోతి వలెశాశ్వతముగా ప్రకాశించు గాక!!"



సమాధి

జీవనస్మృతి

౧౮వ ప్రకరణము

సందేశము

జీవితముద్వారా వ్యక్తమగు నుత్తమాదర్శములు సందేశములను నామముతో గ్రహింపబడును. జీవితమునందు కనబడక నోటినుండి మాత్రము వెలువడు సదుపదేశములు, ఎంతఘనము లయినవి యయినను, సందేశములని పిలువబడవు. బాపయ్యగారి సందేశములను వారి జీవితమె ప్రకటింపగలదు. వారి చరిత్రను చదివిన తరువాత పాఠకులకు వానినిగూర్చి ప్రత్యేకముగ తెలుపుట కేవలమనావశ్యకము. అయినను వా రెట్టి యాదర్శముల కనుగుణముగ జీవించి తోడి దేశీయులకు ఉపదేశములపూర్వకముగా కూడ వెల్లడించిరో అవి వారి వచనములలో వ్యక్తీకరింపబడిన, ఆత్మప్రబోధమున కెంతయు తోడ్పడగలవు. కావున వానిలో ముఖ్యమయినవి సంక్షిప్తముగ నిచట పొందుపరుపబడును.

ప్రత్యక్షసాక్షాత్కారము

'బ్రాహ్మధర్మము' అను శీర్షికతో బాపయ్యగారిచే ఆంగ్లమున వ్రాయబడి, ౧౯౦౫ వ సంవత్సరము సెప్టెంబరు ౬-౧౩ తేదీలుగల సత్యవాదిని పత్రికయందు సంపాదకీయముగ ప్రచురింపబడిన వ్యాసమునందు ప్రత్యక్షసాక్షాత్కారమును గురించిన కొన్నివాక్యములయొక్క అర్థ మిచట చేర్పబడినది.

"బాహ్యప్రమాణమును ఆధారముగాగల మతములు ఒక్కమనుష్యుడు తెలుపు విషయములమీదనె నిర్భరపడియుండును. అంతకంటె విచారకరమయినది యేమనగా, అట్లు తెలుపబడిన విషయములె పరమసత్యమలని ఆమతములు తదనుచరులను అంధప్రాయముగ స్వీకరించునట్లు చేసి, వ్యక్తియొక్క జ్ఞానమును అణచివేయుచున్నవి. వాని యన్నిటిలో, వ్యక్తిత్వము పూర్తిగ వినాశము నొందింపబడుటను, ఈశ్వరశాసనము పేరిట ప్రమాణవచనమునకు నెట్టి యోచనయు లేకుండ వ్యక్తి దోసిలి యొగ్గునట్లు చేయబడుటను, గాంతుము. బ్రాహ్మధర్మము—హిందూదేశమున నెక్కుడు సమంజసముగ పిలువబడదగిన పరిశుద్ధ హిందూధర్మము—చేయునట్టిపని వేరు. ఇది యే బాహ్యప్రమాణము ధర్మజీవనమునకు ఆధారము కానేరదని చెప్పును. ప్రత్యేకమగు నే

ప్రత్యాదేశముమీదను ఆధారపడదు. కేశవచంద్రసేనులు నుడివినట్లు, 'బ్రాహ్మధర్మము విశ్వాసమను శిలపై సుస్థాపితము, భిన్నసంప్రదాయసిద్ధాంతములందు కలుగు మార్పులకు అతీతము.' దేనిని విజ్ఞానము ప్రత్యక్షముగ దర్శించి తప్పకుండ సత్యమె యని తెలుపునో, అదియె విశ్వాసము. ఆ సత్యము మనస్సుచే తర్కవితర్కములద్వారా నిరూపింపబడునదిగాక, ప్రత్యక్షదర్శనమునకు గోచరమగునది...... బ్రాహ్మధర్మానుచరునకు,విశ్వాసములువట్టిజ్ఞానవిషయములు గావు; కాని యవి అంతరాత్మ తెలుపు ఆదేశములు, దృఢములయిన నమ్మకములు. తాను కేవల జ్ఞానముగల జీవియె యని గాక తన భావములను కార్యములుగ పరిణమింప చేయవలసినట్టియు చేయగలిగినట్టియు జీవి యని ఆతడు గ్రహించును. మనస్సాక్షియొక్క యుత్తమశాసనములనుండి అనుదినజీవితము ఆతనికి వేరుగా నుండదు. ఆతడు యోచించునట్లును భావించునట్లును ఆచరించును, జీవించును. ఆవిధముగా, జీవితము నియమమునకును, వర్తనము ఆదర్శమునకును సమరస పరుపబడును."

సర్వతోముఖసంస్కరణము

ఈ విషయమును గురించి బాపయ్యగారు ఆంగ్లభాషలో ౭-౨-౧౯౦౬ తేదిగల సత్యవాదిని పత్రికయందు

'Verity' అను పేరుతో నొకవ్యాసము వ్రాసిరి. అందలి ముఖ్యభావములు ఈక్రింద పొందుపరుపబడినవి.

"వ్యక్తియొక్క జీవన మంతయు ఒక్కటి యగుట వలన, మనోవాక్కాయకర్మలయందు సామరస్యత యేర్పడు చున్నది. ఈ సామరస్యతయె గృహమునకు లోపలను వెలుపలను గడపబడు జీవితములను సమన్వయపరచును. ఈ సామరస్యతయొక్క యభావమువలననె ఒకరు తనపైని యధికారులనుండి హక్కులను కోరుచు అవియె తనకంటె క్రింది శ్రేణిలో నున్నవారి కియ్యకుండుట తటస్థించుచున్నది. ఈ సత్యము గుర్తింపబడకపోవుటచే, సంస్కరణకార్యము వక్రమార్గము పట్టినది.........హక్కులను మాత్రమె గమనించుచు వానివలన కలుగు బాధ్యతలను పాటింపకుండనియెడల, ఏయుద్యమమయినను పాక్షికమగుట స్పష్టము. జీవితమును సమగ్రముగ చూచుచు, ఒక పురుషుడుగాని స్త్రీగాని ఏకాలమునందు, ఏజాతియందు, ఏమతమందు జన్మించినను వారికి మానవజన్మయొక్క సమస్త స్వాతంత్ర్యములు కలవని మన మంగీకరింపక తప్పదు. సంస్కరణము న్యాయముగను జయప్రదముగను జరగుటకు ఈ మూలధర్మమును స్వీకరింపవలెను. అట్లు చేసినప్పుడు, సర్వతోముఖముగను జీవితముయొక్క అన్నిశాఖలందును సంస్కరణము లేక

అభ్యుదయము చేకూరును. సర్వతోముఖసంస్కరణము గావింపబడవలెననియె యాశయము. అది యెల్లరి యామోదము బడయును గాక!"

సత్యము జయించును

శ్రీ పునర్వివాహ శాసనముయొక్క సంవత్సరోత్సవ సందర్భముగా రాజమహేంద్రవర హిందూసంఘ సంస్కరణ సమాజపక్షమున ౩౧-౭-౧౯౦౮ తేదిన ఒక బహిరంగసభను గావించి, దాని యనంతరము రాత్రి ఒకవిందును ఏర్పాటు చేసి, అందునకు బాపయ్యగారు సంస్కరణాభిమాను లందరిని ఆహ్వానించిరి. విందునకు తప్పక వత్తురని తలంపబడిన మిత్రులు కొందరు రాకపోయిరి. ఆ విషయమును గురించి నాటి యుత్సవవృత్తాంతమును ౭-౮-౧౯౦౮ తేదిగల 'ఇండియన్ సోషల్ రిఫార్మర్' పత్రికలో వ్రాయుచు ఆయన సత్యమునందు తనకుగల విశ్వాస మీతీరున వ్యక్తపరచెను.

"అనేకులు గడపుటకు అలవాటుపడిన ద్వంద్వజీవనమును బట్టి చూచిన, మన మిత్రనామధారులు కలిగించెడు నిట్టి యాశాభంగములును సలిపెడు కర్తవ్యోల్లంఘనములును ప్రస్తుతము అనివార్యములె. అందువలన ఎవరును నిరాశ జెందవలసిన పనిలేదు. మనుష్యులయొక్క కొరతవలన ఏసత్యమునకు సంబంధించిన యుద్యమము ఎన్నడును అపజయము

గాంచలేదు. దాని జయ మందుల కనేకులు పూనుకొనుట మీఁదనె ఆధారపడియుండునని తలంచుట గొప్ప భ్రమ. ఏయుద్యమ మయినను దానికి సహజముగ నుండు విలువను బట్టి జయించును, లేక అపజయ మొందును.''

సంస్కారణ విధానము

ప్రొఫెసర్ ఎమ్. రంగాచారి ఎమ్. ఏ గారు తమ కుమార్తెకు అతిబాల్యవివాహము జరపినప్పుడు, వారిచర్యను విమర్శించుచు బాపయ్యగారు ౬-౩-౧౯౦౮ తేదిగల 'ఇండియన్ సోషల్ రిఫార్మర్' పత్రికలో వ్రాసిన వ్యాసము నందలి కొంతభాగము ఈదిగువను అనువదింపబడినది.

“జాతీయతయు హేతుజ్ఞానమును కలసి నిరూపించు విధానమె యనుసరింపదగునని సంఘసంస్కర్తలు పలుమారు చెప్పియుండిరి. కాని మన గురూత్తములు హేతుజ్ఞానముతో సంబంధము లేనట్టి దేదో జాతీయత యనునది కలదని చెప్పుటకు బయలుదేరిరి. వారి మాటలఅర్థము శ్రోతల కప్పుడు బోధపడలేదు. కాని యిప్పుడు హేతుజ్ఞానమునకు పూర్తిగ భిన్నమయినదె తమ జాతీయతయని మనము తెలిసికొనుటకు మనప్రొఫెసరుగారు దయతో అవకాశమును కల్పించినారు. ఇంటిలో నున్న ముసలమ్మల అజ్ఞానమునకును అధికారమునకును కళ్ళుమూసికొని లోబడు పద్ధతియె వారి జాతీయత

కాబోలును. అది యెట్టి మార్పునకు పూనుకొనదని తేలుచున్నది. అది నిజముగా మన హేతుజ్ఞానమునకు గాలి అంతకంటె సామాన్యబుద్ధికిగాని తృప్తికరముగా నుండదు.''

కర్తవ్యము

పాలపర్తి నరసింహముగారికి ౭-౧౨-౧౯౦౭ తేదిన వ్రాసిన యుత్తరమునందు బాపయ్యగా రిట్లు తెలిపిరి.

“నేను కూడ పట్టుదలగల జాతీయవాదినె; నవశక్తిచే పురికొల్పబడినవాడనె. ఆస్తిక సాంఘిక కార్యములపట్ల, జాతీయవాదులు సామాన్యముగా విముఖత్వము చూపుచున్నారు. ధర్మవర్తనము ప్రథమమున నిర్మాణము కావలయును. కొలదిమందిగా నున్న బ్రాహ్మధర్మావలంబకులము మనము ఆ విషయమును నొక్కి చెప్పుచు రాజకీయోద్యమముతోపాటు ధర్మవర్తనసంఘటనకును స్త్రీజాత్యభ్యున్నతికిని కృషి సలుపవలెను.''

సమాపము

తప్పొప్పుల పట్టిక

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
౮౧	౨౦	దైవిక	దైనిక
౮౩	౧౪	not power	not for power
౯౨	౪	రావె	రాలె
౧౨౨	౫	గావించుటయు	గాలించుటయు
౧౫౬	౫	ప్రశంసించు	ప్రసరించు
౧౬౮	౧౮	పరిస్థితులను	పరిస్థితులనుబట్టి
౧౮౪	౧౨	చేసియుండు	చేసియుందు
౧౯౧	౧౧	ప్రార్థనకే	ప్రార్థనలె
౧౯౨	౮	మార్చినవి.	మార్చినవని

END OF
TITLE